






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

''నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్ధలైంది.. ఇంద్రవెల్లి స్వేచ్ఛగా రెక్కలు విచ్చుకుంది.. నాకు అండగా నిలిచి.. నాతో దండుగా కదిలి..ఇంద్రవెల్లి కొండల్లో దండోరా మోగించిన' ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా, తీసుకున్న నిర్ణయం, స్వేచ్ఛ.
– సిఎం రేవంత్‌రెడ్డి


సంపుటి 27, సంచిక: 300 | సోమవారం | 21-04-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




తెలంగాణ రైజింగ్ బృందం

## కితాక్యూషూ సందర్శన

పర్యావరణ పునరుజ్జీవనానికి, సుస్థిర నగరాభివృద్ధికి ఆదర్శ నమూనాగా మారిందని సిఎం రేవంత్‌రెడ్డి కితాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

జపాన్‌లో పర్యటిస్తున్న 'తెలంగాణ రైజింగ్ ప్రతినిధి' బృందం కితాక్యూషూ నగరాన్ని సందర్శించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తదితరుల బృందానికి తరువాయి 2లో



## 60% దేశాల పాఠశాలల్లోనే...

- ఆహార పానీయాలను నియంత్రించే చట్టాలు, ప్రమాణాలు
- తాజా 'యునెస్కో' ప్రపంచ విద్యాపరిరక్షణ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** అరవైశాతం దేశాలలో మాత్రమే పాఠశాలల్లో ఆహారం, పానీయాలను నియంత్రించే చట్టాలు, ప్రమాణాలు ఉన్నాయని యునెస్కో ప్రపంచ విద్యాపరిరక్షణ నివేదిక వెల్లడించింది. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రోపికల్ మెడిసిన్ నేతృత్వంలో రిసెర్చ్ కన్సోర్టియం స్కూల్ హెల్త్ భాగస్వామ్యంతో ఈ నివేదిక ప్రచురించబడింది. గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక ప్రకారం...187 దేశాలకు గాను 93 దేశాలలో మాత్రమే చట్టం, తప్పనిసరి ప్రమాణాలు లేదా మార్గదర్శకాలను కలిగి ఉన్నాయి. 'ఇదిలా ఉంటే ఈ 93శాతం దేశాలలో 29శాతం తరువాయి 2లో

# ఆర్‌టిసిలో 3,038 ఉద్యోగాలు



- త్వరలో భర్తీ చేస్తాం
- సాధ్యమైనంత తొందరగా నోటిఫికేషన్ జారీచేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిఎస్ ఆర్‌టిసి సంస్థలో త్వరలోనే 3038 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉద్యోగ భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చిన నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్ జారీ చేయనున్నామన్నారు. ఆర్‌టిసిలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతున్నందున సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీసిఎం భట్టి విక్రమార్కకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తూ, దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ఉద్యోగ క్యాలండర్ ప్రకారం మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయనున్నామని, వీటిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని, తరువాయి 2లో

# 'కగార్'తో దండకారణ్యంలో మారణకాండ తగదు

- అటవీ,ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకే బిజెపి కుట్రలు
- అన్ని సమస్యలకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయం
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక సభలో వక్తలు

**ఆదివాసులు, ఉద్యమకారులకు జీవించే హక్కులను కాపాడాలి**



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మారణకాండ కొనసాగించడం తగదని ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక సభలో పలువురు వక్తలు ఖండించారు. ఆదివాసీలపై దాడులు ఆపి మావోయిస్టులతో తప్పనిసరిగా చర్చలు జరిపి ఉద్యమకారుల, ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని కోరారు. ఇంద్రవెల్లి మారణకాండ జరిగి నలభై నాలుగేళ్లు అవుతున్న సందర్భంగా మధ్యభారతంలో ఆపరేషన్ కగార్‌తో సాగుతున్న ఆదివాసుల హననానికి వ్యతిరేకంగా ఆదివారం కరీంనగర్‌లోని సిపిఐ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభ ముడిమడుగుల మల్లన్న, గుమ్మడి కొమురయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తరువాయి 2లో

## శాంతి చర్చలకు పిలవాలి

- మావోయిస్టులను అంతం చేస్తామన్న వ్యాఖ్యలను అమిత్ షా వెనక్కు తీసుకోవాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మావోయిస్టులను తుద ముట్టిస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తప్పు చేస్తే కేసులు పెట్టాలి కానీ చంపేసే అధికారాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారా? అని ప్రశ్నించారు. దుందుడుకు చర్యలను ఆపాలని, స్వచ్ఛందంగా మావోయిస్టులు చర్చలకు పిలిస్తే కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. వెంటనే మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించి శాంతియుత వాతావరణాన్ని దేశంలో కల్పించాలని కోరారు. కరీంనగర్‌లో ఆదివారం స్థానిక బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతాల పేరుతో రెచ్చగొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. కులమతాలు, జాతులకతీతంగా తరువాయి 12లో



అమెరికాలో రాజులు లేరు

## వలసదారులకు స్వాగతం

దేశవ్యాప్తంగా మార్మోగిన నినాదాలు 02



## బిహార్‌లో 'గేమ్‌చేంజర్లు' ప్రభంజనం

05

- కొత్త రాజకీయ పార్టీల రాకతో ప్రధాన పార్టీల్లో కలవరం
- రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్, మాజీ కాంగ్రెస్ నేత ఐపి గుప్తా, మాజీ ఐపిఎస్ శివ్‌దీప్‌లాండే పార్టీలు తెరపైకి



## జమ్ము కశ్మీర్‌లో వరుణుడి బీభత్సం

05

- విరిగిపడ్డ కొండచరియలు.. ముగ్గురు మృతి

## ముర్షీదాబాద్ అల్లర్లపై న్యాయ విచారణకు డిమాండ్

02

- కోల్‌కతాలో సిపిఐ(ఎం) భారీ ర్యాలీ
- వేతనాల పెంపు, ఎంఎస్‌పిలే ప్రధాన డిమాండ్లు

# 'చేవెళ్ల', 'రాజేంద్రనగర్'లో ఉప ఎన్నికలొస్తున్నాయ్



- పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు పిలుపు
- రాజేంద్రనగర్‌లో నాకు భూములు ఎక్కడున్నాయో చూపించాలని కాంగ్రెస్‌కు సవాల్

ప్రజాపక్షం/హైదరాబాద్

చేవెళ్ళ, రాజేంద్ర నగర్‌లో శాసనసభ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోతున్నాయని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. దివంగత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, చంద్ర బాబు నాయుడు హైదరాబాద్‌లో ఐటీ సంస్థలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎన్నో పార్టీలు వచ్చాయి,పోయాయని, టిడిపి,బిఆర్‌ఎస్ మాత్రమే చరిత్రలో నిలిచిపోయాయన్నారు. ఒక సారి అవకాశం ఇద్దామని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించి, తాము తినే పళ్లెంలో మన్ను పోసుకున్నట్టుగా ఉందని, తామే గొయ్యి తవ్వుకుని పడినట్టుగా మారిందని వ్యాఖ్యానించారు. కెటిఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అత్తాపూర్ తరువాయి 2లో

నేటి నుంచి నిజామాబాద్‌లో

## రైతు మహోత్సవం

- పంటలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తుల ప్రదర్శన
- 136 స్టాల్స్ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్



వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రం లో రైతు మహోత్సవం నిర్వహించనున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగే మహోత్సవాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తరువాయి 2లో

# బంగ్లాదేశ్ యువతులతో హైదరాబాద్‌లో వ్యభిచారం



- పశ్చిమ బెంగాల్ కేంద్రంగా వ్యవస్థీకృత దందా
- బంగ్లాదేశీ యువతుల అక్రమ రవాణా
- ఇక్కడ వ్యభిచారం, ఇతర దందాలకు వినియోగం
- కేసుల దర్యాప్తులో గుర్తించిన పోలీసు అధికారులు

ప్రజాపక్షం /హైదరాబాద్

హైదరాబాద్ తో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల విదేశీ యువతులతో వ్యభిచారం చేయిస్తున్న అనేక ముఠాలు పట్టుబడ్డాయి. ఈ బాధితుల్లో అత్యధికం బంగ్లాదేశీ యువతులే ఉంటున్నారు. దీంతో వీరు దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న విధానంపై దర్యాప్తు అధికారులు దృష్టి పెట్టారు. ప్రాథమిక ఆధారాలను బట్టి కొన్ని కీలక విషయాలు గుర్తించారు. ఈ మనుషుల అక్రమ రవాణా దందాకు పశ్చిమ బెంగాల్ కీలకంగా ఉన్నట్లు తేలింది. అక్కడి కొందరు సూత్రధారులు బంగ్లాదేశ్లోనూ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. వారి ద్వారా ఒకరిని అక్రమంగా బోర్డర్ దాటించడానికి రూ.4 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కీలకంగా వ్యవహరిస్తున్న రాహుల్ బంగ్లాదేశీయులతో పాటు మయన్మారీల అక్రమ రవాణా దందాకు పశ్చిమ బెంగాల్లోని సరిహద్దు జిల్లాలు కీలకంగా మారాయి. ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అక్రమ రవాణా పెరిగింది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు కొత్తగా ముఠాలు పుట్టుకువచ్చాయి. వీటికి నేతృత్వం వహిస్తున్న వ్యక్తులకు ఇటు పశ్చిమ బెంగాల్ తో తరువాయి 12లో






# ప్రపంచం
WORLD NEWS

### 70 రోజుల్లో హసీనా కేసుల దర్యాప్తు పూర్తి : ఐసిటి ఆదేశం

**ఢాకా :** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలపై విచారణను రాబోయే 75 రోజుల్లో పూర్తిచేయాలని ఆ దేశ అంతర్గత ఐసిటి (ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్) దర్యాప్తు సంస్థలకు ఆదేశించింది. హసీనాపై దాఖలైన రెండు కేసుల్లో దర్యాప్తును జూన్ 24వ తేదీనాటికి పూర్తిచేయాలని కోరుతూ గడువు పొడిగించింది. గత ఏడాది జులైలో దేశంలో విద్యార్థులు చేసిన తిరుగుబాటు సందర్భంగా మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని హసీనాపై కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో హసీనాతోపాలు మాజీ పోలీస్ డైరెక్టర్ జనరల్ చౌదరి అబ్దుల్ అల్–మామన్ ఒక్కరే నిందితుడుగా ఉన్నారు. ఆ తర్వాత చట్టవిరుద్ధంగా దారుణ హత్యలకు పాల్పడ్డారంటూ హసీనాతోపాటు మరో 11 మందిపై కేసులు నమోదయ్యాయి. వేరువేరుగా ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన ఈ కేసులపై దర్యాప్తుకు గడువు పొడిగించాలని ఐసిటిని కోరింది. దీంతో మహ్మద్ గోలమ్ మర్తూజా మజుందార్ నాయకత్వానగల ముగ్గురు సభ్యుల ధర్మాసనం పై మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మరో 44 మందిపై కేసుల్లో దర్యాప్తును కూడా జులై 10 నాటికి పూర్తిచేయాలని ఆదేశించింది.

### గాజాలో యుద్ధం విరమించి..
## ఆకలిగొన్నవారి ఆకలి తీర్చండి

పోప్ ఈస్టర్ సందేశం



**వాటికన్‌సిటీ :** గాజాలో యుద్ధాన్ని విరమించాలనీ, మానవహననానికి స్వస్తిచెప్పాలని పోప్ ఫ్రాన్సిస్ (88) సందేశం ఇచ్చారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా పోప్ సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద ఆదివారంనాడు వేలాదిమంది ప్రజలను కలుసుకుని వారికి తన ఆశీర్వాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాజా గురించి మాట్లాడారు. ఆయన ఆరోగ్యం బాగోలేనప్పటికీ ఆయన ప్రజల్లోకి వచ్చి కొద్దిసేపు గడిపారు. డబుల్ న్యూమోనియాతో ఆసుపత్రిపాలై ఐదు వారాలు చికిత్సపొందిన పోప్ ఫ్రాన్సిస్ ఈస్టర్ సందర్భంగా చాలా సంక్షిప్త సందేశం ఇచ్చారు. ఆయన ఇప్పటికీ ఇంకా న్యూమోనియా వ్యాధినుండి కోలుకునే దశలోనే ఉన్నారు. అనేక పూర్తి అధికారిక కార్యక్రమాలను ఆయన రద్దుచేసుకుని పరిమితంగా ప్రజలకు కనిపిస్తున్నారు. వైద్యుల సలహా మేరకు ఆయన బయట ఎవ్వరికీ ఎక్కువగా కనిపించకుండా విశ్రాంతిలో గడుపుతున్నారు. గడచిన జనవరిలో ఆసుపత్రి కిటికీ నుండి చేతులు ఊపి భక్తులను ఆశీర్వదించిన పోప్ గాజాలో మానవత్వం మంటగలిసిందని, ఇది మానవజాతికి సిగ్గుచేటని అన్నారు. ఇప్పుడు ఈస్టర్ సందేశంలో యుద్ధం విరమించాలని కోరారు. అత్యంత విషాదకరమైన పరిస్థితులు గాజాలో నెలకున్నాయన్నారు. అటు పాలస్తినాలో, ఇటు ఇజ్రాయెల్‌లో తీవ్ర సమస్యలను, ఇక్కట్లను ఎదుర్కొంటున్న ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. బందీలను విడుదల చేయాలని, ఆకలిగొన్నవారి ఆకలి తీర్చాలని, అందుకు ఇజ్రాయెల్ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గత నెల రెండో తేదీ నుండి గాజాలోకి మానవతాసహాయం వెళ్ళకుండా ఇజ్రాయెల్ సేనలు అడ్డుకోవడంతో పాలస్తినా ప్రజలు ఆకలితో నకనకలాడుతున్నారు. కాగా రోమ్‌లో పర్యటించిన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌ను పోప్ ఫ్రాన్సిస్ అధికారికంగా కలుసుకోలేదు. కానీ అనధికారికంగా ఆయనతో కాసేపు ముచ్చటించారు. ఈ ముచ్చట్లలో జె.డి.వాన్స్ భార్య ఉషా కూడా పాల్గొన్నారు. కానీ పోప్‌తో వాన్స్ అధికారిక చర్చలు జరపలేదు. కాగా ఈస్టర్‌కు ముందుగా రోమ్ సెంట్రల్ జైలును పోప్ సందర్శించారు.



**గాజాలో దాడులు : 25 మంది మృతి**

గాజాలో జరుగుతున్న యుద్ధం ఆదివారంనాటికి 560వ రోజుకు చేరుకుంది. తెల్లవారుజాము నుండీ ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడుల్లో 25 మంది పాలస్తీనియన్లు మరణించారు. మృతుల్లో ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. ఇజ్రాయెల్ ఇటీవల నివాసిత ప్రాంతాలు, తాత్కాలిక గుడారాలలో తలదాచుకుంటున్న ప్రజలపైన దాడులను ఉధృతం చేసింది. తూర్పు రఫా ప్రాంతంలో ఐదుగురు మరణించగా, ఇతర ప్రాంతాలలో ఇరవైమంది మరణించారు. కాగా ఇజ్రాయెల్ ప్రభుత్వం గతంకంటే చాలా ఎక్కువగా ఈ ఏడాది ఈస్టర్ పర్వదిన రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించిందని అనేకమంది పాస్టర్లు చెప్పారు. క్రైస్తవులకు అత్యంత కీలకమైన 'పవిత్ర వారం'లో కదలికపై కఠిన ఆంక్షలు విధించారని చెప్పారు.

## అమెరికాలో రాజులు లేరు

వలసవాదులకు స్వాగతం
దేశవ్యాప్తంగా మార్మోగిన నినాదాలు
ట్రంప్ నిరంకుశత్వంపై ప్రజాగ్రహం
వేలాది మందితో ప్రదర్శనలు



**వాషింగ్టన్ :** సుంకాల పేరిట ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్ష విధానాలపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆయనకు వ్యతిరేకంగా అమెరికావ్యాప్తంగా ప్రజాందోళనలు మిన్నంటున్నాయి. ఇటీవల హ్యాండ్స్ ఆఫ్ ట్రంప్ అంటూ భారీస్థాయిలో ప్రజలు నిరసన తెలిపారు. తాజాగా 'అమెరికాలో రాజులు లేరు' అన్న నినాదంతో ర్యాలీలు చేపట్టారు. బ్యానర్లు, ప్లకార్డులతో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. ట్రంప్ విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు అంటూ నినదించారు. 'అమెరికాలో రాజులు లేరు', 'నిరంకుశత్వాన్ని ప్రతిఘటించాలి', 'ఐస్ లేదు... భయం లేదు, వలసదారులకు స్వాగతం' అన్న నినాదాలు దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో మార్మోగాయి. ట్రంప్ నిరంకుశ విధానాలను అమెరికన్లు వ్యతిరేకించారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. లేకపోతే అభిశంసన తప్పదని హెచ్చరించారు. 1775 ఏప్రిల్ 19 నాటి 'అమెరికన్ రివల్యూషనరీ వార్' 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్వేతసౌధం వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. '50501' అంటే '50 ఆందోళనలు, 50 రాష్ట్రాలు, ఒక ఉద్యమం'లో భాగంగా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు జరిగాయి. న్యూయార్క్ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వరకు, వాషింగ్టన్, చికాకో నుంచి రోడ్ ఐలాండ్, మేరీల్యాండ్, విస్కోన్సిన్, టెన్నెస్సీ, దక్షిణ కరోలినా, మ్యాన్‌హాటన్, బోస్టన్ వరకు ఆందోళనలు, ప్రదర్శనలు పెద్ద ఎత్తున నిర్వహించారు. న్యూయార్క్ ప్రధాన గ్రంథాలయం వద్ద 'అమెరికాలో రాజులు లేరు', 'ఈ దౌర్జన్యం సాగదు' అన్న నినాదాలతో ఆందోళన జరిగింది. వలసదారుల చట్టపరమైన నివాస హోదా రద్దు, వారి బహిష్కరణను ఆందోళనకారులు వ్యతిరేకించారు. 'భయం లేదు... వలసదారులకు స్వాగతం' అంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సాగుతున్న ట్రంప్ పాలనతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. పోర్ట్‌ల్యాండ్, ఓరేగాన్‌లో వేలాది మంది కదం తొక్కారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో 'ఇంపీచ్ రిమూవ్' (అభిశంసన తొలగింపు) అని పసిఫిక్ మహాసముద్రం ఒడ్డున రాసి నిరసన తెలిపారు. ఆంచోరేగ్, అలాస్కాలోనూ భారీగా ర్యాలీలు జరిగాయి. ఫెడరల్ ప్రభుత్వంలో ఎలన్‌మస్క్ పాత్రకు నిరసనగా కొన్ని చోట్ల ఆందోళనలు నిర్వహించారు. కాగా, పౌర హక్కుల, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూ సంస్థలు, న్యాయవాద సంఘాలు, వృద్ధులు, ఎన్నికల సంస్కరణల సంఘాల అధ్వర్యంలో 50 రాష్ట్రాల్లో 'హ్యాండ్సాఫ్' ఆందోళనల కొనసాగింపుగా తాజా నిరసనలు జరిగాయి.

### కెన్యా ప్రజలకు
## వన్యమృగ భయం



**నైరోబీ :** కెన్యాలో సింహం ఒక నివాసిత ప్రాంతంపై దాడిచేసి 14 ఏళ్ళ వయసుగల బాలికను ఎత్తుకుపోయింది. బాలికను చంపి తినేసిందని, బాలిక మరణించిందనీ కెన్యా వన్యమృగసేవల విభాగం తెలియజేసింది. ఈ సమీప ప్రాంతంలోనే ఏనుగు చేసిన దాడిలో 54 ఏళ్ళ వయసుగల వ్యక్తి కూడా మరణించాడు. నైరోబి శివారుప్రాంతంలో శనివారంనాడు ఈ ఘటన జరిగింది. నైరోబీ నేషనల్ పార్కు సమీపంలో ఉండే ఒక నివాసిత ప్రాంతం ప్రహరీగోడ దూకి లోపల ఆవరణలోకి ప్రవేశించిన సింహం బాలికను అపహరించి తీసుకువెళ్ళిందని వన్యమృగ సంరక్షణ విభాగం పేర్కొంది. బాలికను ఎత్తుకుపోవడం గమనించిన మరో బాలిక గట్టిగా కేకలు వేసింది. అధికారులు రంగంలోకి దిగి సింహం అడుగుజాడలతోపాటు వెనకే వెళ్ళి పరిశీలించారు. మగబది నదీతీరం దాకా సింహం బాలికను తీసుకువెళ్ళి అక్కడ చంపి తినేసింది. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఆ బాలిక మృతకళేబరాన్ని నదీతీరం వద్ద అధికారులు కనుగొన్నారు. నివాసిత ప్రాంతాలపై వన్యమృగాలు దాడులు చేయకుండా అదనపు భద్రత కల్పిస్తామని వన్యమృగ సంరక్షణ విభాగాధికారులు ప్రకటించారు. అదేవిధంగా నైరోబీకి 130కి.మీ దూరంలో ఉన్న సెంట్రల్ న్యేరీ కౌంటీలోని అడవుల్లో ఏనుగు ఆహారవేటలో ఉండగా మనిషి ఎదురుపడ్డాడు. ఏనుగు దాడిలో ఆ వ్యక్తి ఎముకలు విరిగిపోయి మరణించాడు. నైరోబీలో తరచు నివాసిత ప్రాంతాలపై వన్యమృగాలు దాడులు చేసి పశువులు, కుక్కలను చంపి తింటున్నాయి. ఈ ఘటనలు ఆ ప్రాంత ప్రజలకు సర్వసాధారణంగా మారాయి. కానీ ఇప్పుడు మనుషులపై దాడులు జరుగుతున్నాయి.

### వచ్చే శనివారం ఇరాన్–అమెరికా
## మూడో విడత చర్చలు



**రోమ్ :** ఇరాన్–అమెరికా మధ్య అణు సమస్యపై శనివారంనాడు చర్చలు ముగిశాయి. చర్చలు సానుకూల వాతావరణంలో జరిగినప్పటికీ రాజకీయ,భౌగోళికపరమైన అనేక ఆటంకాలు ఈ రెండు దేశాలకూ సమస్యలుగా ఎదురవుతున్నాయి. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘీ, మధ్యాసియాలో అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ మధ్య నాలుగు గంటలసేపు రెండో విడత చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరించిన ఒమన్ ప్రభుత్వ ప్రతినిధి పక్క పక్క గదుల్లో కూర్చున్న ఈ ఇద్దరి నాయకుల మధ్యా అటూ ఇటూ తిరుగుతూ ఒకరు చెప్పిన సమాచారాన్ని మరొకరికి తెలియజేస్తూ పరోక్ష చర్చలకు సహకరించారు. ఈ తరుణంలో వచ్చేవారంలో మూడో విడత చర్చలు జరపాలని రెండు దేశాల ప్రతినిధులూ నిర్ణయించారు. వచ్చే శనివారమే ఒమన్‌లో మూడో విడత చర్చలు జరుగుతాయని ఇరాన్ మీడియాకు ప్రభుత్వం తెలియజేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంలో ఈ రెండు దేశాల ప్రతినిధులమధ్య పరోక్షస్థాయి చర్చలు జరుగుతున్నాయిఇ. మొదట ప్రత్యక్ష చర్చలు జరిపితీరాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పట్టుపట్టారు.

## మారణకాండ తగదు
(మొదటి పేజీ తరువాయి)




కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి, ఆత్మగౌరవం కోసం జరిగిన ఇంద్రవెల్లి పోరాటంలో ఆదివాసీలపై జరిగిన హత్యాకాండకు నలబై నాలుగేళ్లు పూర్తవుతోందన్నారు. అన్ని సమస్యలకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయమన్నారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా, బిజెపి, ఆర్‌ఎస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ అడవులలో కోట్లాది అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి 1990 నుంచి 2025 వరకు ఆపరేషన్ జనజాగరన్ అభియాన్, సల్వాజుడం, గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ ఆనకొండ, చివరకు ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఆరు నెలల పసిగుడ్డ మంగ్లీ సోడి మొదలు రేణుక మిడ్కో వరకు దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. ఆదివాసీ అడవీ ప్రాంతంలో సైన్యాన్ని దింపడం కోసం వనరులను రవాణా చేయడం కోసం ఆరు లైన్ల 9 ఇంచుల రోడ్డును నిర్మించారన్నారు. ఇది ఆదివాసీల అభివృద్ధికి ఎలాంటి ఉపయోగం లేదని, కనీసం వారికి సైకిల్‌లు సైతం లేవన్నారు. అంతేగా మోహనరావ్, చలపతి, ఊర్మిళ, మిడ్కో లాంటి వారిని పట్టుకుని చంపారని అన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో జరిగిన మారణకాండ దండకారణ్య ప్రాంతమంతా అనేక ఇంద్రవెల్లులు, వాకపల్లిలు జరుగుతున్నాయన్నారు. 1996 పేసా చట్టం, 2006 అడవీ హక్కుల చట్టాన్ని అమలు పరచకుండా నరమేధాన్ని కొనసాగిస్తూ ఆదివాసీల ఉద్యమాలకు నిశ్శబ్దం చేసి వనరులను కార్పోరేట్‌లకు అందించడానికి మోడీ, అమిత్ షా చేస్తున్న ఆర్థిక విధానాలను ఖండించారు. గత పదిహేను నెలల కాలంలో 400 మంది అమాయక ప్రజలను బూటకపు ఎన్‌కౌంటర్ పేరిట చంపారని ఆరోపించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీతో తప్పనిసరిగా చర్చలు జరిపి ఉద్యమకారుల, ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని, అంతేకాకుండా మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శాంతి చర్చలు జరిపి ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య, మహబూబ్ నగర్ జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు రామిళ్ల బాపు, శ్రీపతి రాజగోపాల్, పుల్ల సుచరిత, ఎరుకల రాజన్న, పొన్నం రాజమల్లయ్య, నారా వినోద్, బొడ్డుపెల్లి రవి, బొంకూరి లక్ష్మణ్, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు టి.రత్నకుమార్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చింతా భూమేశ్వర్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, దుర్గం నగేష్, మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా నాయకులు జిందం ప్రసాద్, రాసా భూమయ్య, రైతు కూలీ సంఘం నాయకులు ఎల్.భీమన్న, పిడిఎస్‌యు జిల్లా కన్వీనర్ అంగడి కుమార్, భారత్ బచావో నాయకులు నారాయణ, పులిపాక రవీందర్, డిటిఎఫ్ నాయకులు కరెంగుల నరేందర్ ఉన్నారు.

## కితాక్యూషూ సందర్శన
(మొదటి పేజీ తరువాయి)

కితాక్యూషూ నగర మేయర్ కుజుహిసా టకేచీ ఆత్మీయ స్వాగతం పలికారు. అక్కడి సాంప్రదాయ రీతిలో ఘనంగా తెలంగాణ బృందాన్ని స్వాగతించారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యపూరిత నగరంగా పేరుగాంచిన కితాక్యూషూలో గాలి, నీరు, నేల అన్నీ తీవ్ర కాలుష్యంతో కూరుకుపోయిన దుస్థితి ఉండేది. గత కొన్నేళ్లుగా అక్కడి ప్రభుత్వం అమలు చేసిన పరిరక్షణ విధానాలతో కితాక్యూషూ నగరం కోలుకుంది. కాగా కాలుష్యం నుంచి బయటపడేందుకు కితాక్యూషూ నగరంలో అమలు చేసిన విధానాలను, ప్రస్తుతం పాటిస్తున్న జాగ్రత్తలను మేయర్ నేతృత్వంలోని అధికార బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి వివరించింది. ప్రస్తుతం ఆ నగరం పర్యావరణ పరిరక్షణ, రీసైక్లింగ్ ఆవిష్కరణలు, సుస్థిరత పరంగా కితాక్యూషూ నగరం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. పర్యావరణ పునరుజ్జీవనానికి, సుస్థిర నగరాభివృద్ధికి ఒక ఆదర్శ నమూనాగా మారిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### ముర్షీదాబాద్ అల్లర్లపై..
## న్యాయ విచారణకు డిమాండ్



కోల్‌కతాలో సిపిఐ(ఎం) భారీ ర్యాలీ
వేతనాల పెంపు, ఎంఎస్‌పిలే ప్రధాన డిమాండ్లు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ ముర్షీదాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన అల్లర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని దారిమళ్ళించేందుకు తృణమూల్ కాంగ్రెస్– బిజెపిపార్టీలు పరస్పరం పోటీపడుతున్నాయని విమర్శించింది. రాజకీయ స్వప్రయోజనాలు సాధించుకోవడం కోసం ముర్షీదాబాద్‌జిల్లాలో అల్లర్లు చేసేందుకు అధికార తృణమూల్ కాంగ్రెస్, బిజెపిలు కుమ్మక్కు అయ్యాయని డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వామపక్ష సంఘటనకు సారథ్యం వహిస్తున్న సిపిఐ(ఎం) ఆదివారం నాడు కోల్‌కతాలో భారీ ర్యాలీ నిర్వహించింది. కార్మికుల వేతనాలు పెంచాలనీ, సామాజిక భద్రతా కార్యక్రమాలను అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, రైతు రుణాలు రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలను పెంచాలని ర్యాలీ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో, దేశంలో రాజకీయాలు దోపిడీదారుల చేతుల్లో ఉన్నాయా? లేక కార్మికులు, కర్షకుల ప్రయోజనాలు ఆశించేవారి చేతుల్లో ఉన్నాయా? అనే విషయమే ఇక తెరమీదకు చర్చకు వస్తుందని నాయకులు ప్రకటించారు. ఇవే డిమాండ్లను ప్రదర్శకులు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. పశ్చిమ బెంగాల్‌వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో ఆదివారం ఉదయంనాటికే అత్యంత విశాలమైన బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌కు 'నేల ఈనిందా'' అన్న చందంగా కార్మికులు–కర్షకులు చేరుకున్నారు. విశాలమైన మైదానం కిటకిటలాడుతూ ఇరుకుగా మారింది. అన్ని జిల్లాల నుండీ దారులన్నీ కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్‌కే దారితీశాయి. మూడుసార్లు వరుసగా ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు నిర్వహించిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ వైఫల్యాలను సిపిఐ(ఎం) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీమ్ ఎండగట్టారు. ఆయన ర్యాలీలో మాట్లాడుతూ, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు సంపాదించుకోవడంకోసమే ముర్షీదాబాద్‌జిల్లాలో బిజెపి–తృణమూల్ కాంగ్రెస్ కుమ్మక్కై అల్లర్లకు పాల్పడ్డాయని విమర్శించారు. ఈ అల్లర్లపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఐక్యత, సౌభ్రాతృత్వాలు రాష్ట్రంలో లేకుండా చేసే పరిస్థితులు టిఎంసి–బిజెపి సృష్టిస్తున్నాయని అన్నారు. ప్రజలను మత ప్రాతిపదికపై విభజించడంకోసమే ముర్షీదాబాద్ అల్లర్లను ముందుగానే సిద్ధంచేసి అమలు చేశారన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రస్తావిస్తూ, ఈ చట్టాన్ని అమలు చేయడంద్వారా కేంద్రంలోని బిజెపి దేశ ప్రజలకు ద్రోహం చేసిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమైఔనప్పటికీ కూడా కేవలం ముర్షీదాబాద్‌జిల్లాలో మాత్రమే అల్లర్లు, హింసాకాండ చోటుచేసుకోవడం అనేక సందేహాలకు దారితీస్తున్నాయని, ఈ విషయంపై అనేక ప్రశ్నలు వస్తున్నందువల్ల న్యాయ విచారణ జరపాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా బిజెపి–టిఎంసిపార్టీలు పరస్పరం సహకరించుకునే వాతావరణాన్ని రాష్ట్రంలో సృష్టిస్తున్నాయన్నారు. ఈ రెండుపార్టీలు వ్యూహాత్మకంగా ఒక అవగాహనకు వచ్చిన తర్వాతే ముర్షీదాబాద్‌లో అల్లర్లు సృష్టించాయన్నారు. సిపిఐ(ఎం)కు చెందిన పలు ప్రజాసంఘాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి.

## ఉప ఎన్నికలొస్తున్నాయ్
(మొదటి పేజీ తరువాయి)

నాయకుడు శ్రీరామ్‌రెడ్డి ఆదివారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువ కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎంఎల్‌ఎ సబితా ఇంద్రారెడ్డి, బిఆర్‌ఎస్ రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో ఔటర్ రింగ్ రోడ్డు ప్రజలు కాంగ్రెస్ పార్టీ మాటలను ఎవ్వరూ నమ్మలేదని,అడ్డిమార్ గుడ్డి దెబ్బన గోషామహల్ నియోజకవర్గంలో బిజెపి గెలిచిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ స్థానిక నాయకులను నమ్మడం లేదని,అగ్రనేతలను తీసుకొచ్చి డిక్లరేషన్లు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ కార్యక్రమాలను గత ప్రభుత్వంలో కెసిఆర్ అమలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు పెద్దవి, చేతలు చిన్నవి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇండ్లు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ ఉంటే ముట్టుకోబోరని, కానీ హైడ్రా పేరుతో పేదల ఇండ్లు మాత్రం కూల్చుతున్నారని ఆరోపించారు. రాజేంద్రనగర్‌లో తనకు భూములు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని, ఆ భూములు ఎక్కడ ఉన్నాయో చూపించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి నెలలో 31వ తేదీ ఉండబోదనేది ఎంత నిజమో, రేవంత్ రెడ్డి మాటలు కూడ అంతేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక్క మంచి పని చేయని బిజెపి, మత,కుల పిచ్చి లేపడం తప్పా మరొటి ఉండబోదని కెటిఆర్ ఆరోపించారు. హిందువులు ప్రమాదంలో ఉన్నారని బిజెపి నాయకులు చెబుతున్నారని, హిందువులు ప్రమాదంలో ఉంటే మోదీ విఫలం అయినట్లేగా అని ఎ ద్దేవా చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పైన ఈడి కేసు నమోదు చేస్తే ఇంతవరకు సిఎం రేవంత్ రెడ్డి స్పందించలేదన్నారు. బిఆర్‌ఎస్ ఉండకూడదని బిజెపి, కాంగ్రెస్ కంకణం కట్టుకున్నాయని మండిపడ్డారు. 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరగనున్న రజతోత్సవ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గాల్లో జెండా దిమ్మెలకు గులాబీ రంగు వేసుకోవాలని, దిమ్మె లేకపోతే కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణపైన కెసిఆర్ చెరగనిముద్ర వేశారన్నారు.


## 60% దేశాల పాఠశాలల్లోనే...
(మొదటి పేజీ తరువాయి)

దేశాలలో మాత్రమే ఆహారం, బెవరేజ్ మార్కెటింగ్‌ను పరిమితం చేసే చర్యలను తీసుకుంటున్నారు. 60శాతం పాఠశాలలో మాత్రమే ఆహారం, పానీయాలను నియంత్రించడంలో ప్రమాణాలను కలిగి ఉన్నాయి అని గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ (జిఇఎం) తెలియజేసింది. 30కంటే తక్కు వ మధ్యతరగతి దేశాలలో ఆధారిత ఆహారం, పోషకాహార విద్య సంబంధిత సర్వే ఆధారిత మూల్యాంకనం ద్వారా పాఠశాల వ్యవస్థలో ఏకీకరణ అనేది ఒక స్వతంత్ర పాఠ్యాంశంగా లేదా పాఠ్యాంశాల అంతటా కాకుండా పాఠ్యేతర లేదా ప్రాజెక్ట్ ఆధారిత కార్యకలాపాల ద్వారా జరుగుతుందని గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ బృందం గుర్తించింది. నివేదిక ప్రకారం 28దేశాలలో మూడు దేశాలు మాత్రమే ఈ మదింపును నిరంతరం నిర్వహిస్తూ ఉపయోగిస్తుందని వివరించింది. చాలా పాఠశాలల్లో భోజన కార్యక్రమాలు, విద్యాలక్ష్యాలు, పోషకాహారం,ఆ రోగ్యం, సామాజిక రక్షణ లక్ష్యాలను కలిగి ఉంటాయి. అయితే తక్కువ మాత్రమే ఊబకాయాన్ని నియంత్రించడంపై దృష్టి పెడతాయి అని ఆ నివేదిక వెల్లడించింది. పాఠశాల భోజన సదుపాయాలపై దృష్టి సారించిన మరోసర్వే72 శాతం ఫుడ్ మార్కెటింగ్ స్కూల్ గ్రౌండ్స్‌పై కొన్ని పరిమితులపై భోజనం పెట్టే ప్రొవిజన్‌ను కలిగి ఉన్నాయని, 52శాతం దేశాలు పాఠశాల మైదానంలో లేదా సమీపంలోని ఆహారపదార్థాలపై జాతీయ నిషేదాన్ని కలిగి ఉన్నాయని తెలియజేసింది. అధిక ఆదాయ దేశాలలో ఆహార వ్యవస్థతో విధాన నిర్వహణపై పౌష్టికాహార పాలసీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో దానిని హైలెట్ చేస్తూ అత్యధిక సంఖ్యలో విధానపరమైన చర్యలు ఆరోగ్యకరమైన ఎంపికతో కూడిన ప్రవర్తనా మార్పు సమాచారంపై దృష్టి పెట్టినట్లు జెఇఎం నివేదిక తెలిపింది.

## రైతు మహోత్సవం
(మొదటి పేజీ తరువాయి)

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు సైతం ప్రదర్శనలో ఉంచనున్నారు. సుమారు 136 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు నూతన వ్యవసాయ పద్ధతులపై మూడు రోజుల పాటు వర్క్ షాపు నిర్వహించనున్నారు. పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థలు తమ అనుభవాలు పంచుకునేందుకు ఇది వేదికగా నిలవనుంది.

## ఆర్‌టిసిలో 3,038 ఉద్యోగాలు
(మొదటి పేజీ తరువాయి)



పరీక్షలకు సన్నద్ధం కావాలని పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తుందని, తద్వారా ఆర్‌టిసిలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని మంత్రి పొన్నం చెప్పారు. ఇప్పటి వరకు ఆర్‌టిసిలో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారికి రూ. 5500 కోట్ల ఆదా జరిగిందని వివరించారు.

**ఆర్‌టిసిలో మొత్తం 3038 ఉద్యోగాలు :**
డ్రైవర్ 2000, శ్రామిక్ 743,
డిప్యూటీ సూపరిండెంట్ (ట్రాఫిక్) 84,
డిప్యూటీ సూపరిండెంట్ (మెకానికల్) 114,
డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ 25
అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ 18,
అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) 23
సెక్షన్ ఆఫీసర్ (సివిల్) 11, అకౌంట్ ఆఫీసర్స్ 6
మెడికల్ ఆఫీసర్స్ జనరల్ 7, మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ 7

# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎమ్మెల్యే గాంధీకి వాట్సాప్‌లో బెదిరింపులు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఊహించని పరిణామం చోటు చేసుకుంది. అరికెపూడి గాంధీపై దాడి జరగబోతుందంటూ వాట్సాప్‌లో ప్రచారం జరిగింది. ఆదివారం సాయంత్రం 5 గంటల తర్వాత నలుగురు వ్యక్తులు అరికెపూడి గాంధీపైన కత్తులతో దాడి చేస్తారని ఒక గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గోశాలకు వెళ్లే సమయంలో దాడికి ప్లాన్ చేశారని ఆ అజ్ఞాత వ్యక్తి తన సందేశంలో పేర్కొన్నాడు. దాడికి ప్లాన్ చేసిన వారిపై గతంలో అక్రమ ఆయుధాల కేసులు ఉన్నాయని కూడా ఆ సందేశంలో పొందుపరిచారు. కాగా అరవింద్ కుమార్, సాయి రితీష్ రెడ్డి, కోలా వంశీ, గుళ్ల నాగరాజులు దాడి చేస్తారంటూ వారి ఫోన్ నంబర్లను కూడా గుర్తు తెలియని వ్యక్తి వివరాలను వెల్లడించారు. దీనిపై అరవింద్ కుమార్ వెంటనే స్పందిస్తూ తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. అజ్ఞాత వ్యక్తి ఆరోపణలు నిజం కాదని ఆయన ఖండించారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరు



తక్కువ ఖర్చుతో నిర్మించబడే ప్రాజెక్టులకు ప్రాధాన్యత : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
మధిరలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ఖమ్మం : చిట్ట చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ఆయకట్టుకు సాగునీటిని అందించడంలో వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. తక్కువ ఖర్చుతో సాగునీటిని అందించే లక్ష్యంతో ప్రాజెక్టులను చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మంజిల్లా మధిర మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మధిర మండలం సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో వైరా నదిపై రూ.6.85 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మహదేవ పురం గ్రామంలో 952 ఎకరాలకు సాగునీటిని అందించే రూ.12.14 కోట్ల వ్యయంతో నిర్మించే ఎత్తిపోతల పథకాన్ని ఆయన ప్రారంభించారు. రాయపట్నం గ్రామంలో 1079 ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. మధిర మున్సిపాలిటీలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించే రెండు వరుసల రహదారి విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సిరిపురం వద్ద నిర్మించే చెక్ డ్యాం ద్వారా ఈ ప్రాంతంలో భూ గర్భ జల నీటి మట్టం పెరుగుతుందని దీనికి పై భాగంలో ఉన్న చిన్న ఎత్తిపోతల పథకాలకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం సమాంతరంగా చేపడుతుందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా పేద పిల్లలు చదువుకోవాలని యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని మొదటి దశలో నిరుపేదలకు మంజూరు చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. రైతు సంక్షేమం దిశగా రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యం రైతులకు రూ.500 బోనస్, రైతు బీమాను అందిస్తున్నామన్నారు. మహిళలను సంపన్నులుగా మార్చే దిశగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద పనులు చేపట్టామని ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు రమేష్‌బాబు, శ్రీనివాసాచారి, యుగంధర్, వాసంతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వల్లే
# సంస్థకు రక్షణ



సింగరేణిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుంటే చూస్తూ ఊరుకోం
కూనంనేని సాంబశివరావు హెచ్చరిక

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణిలో కార్మికుల హక్కులను కాపాడేది, సంస్థను రక్షించేది చరిత్ర కలిగిన యూనియన్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం రామగుండం ఎన్టీపీసీలోని శ్రీ మయి ఫంక్షన్ హాల్ (అమరజీవి కామ్రేడ్ మాదన నారాయణ హాల్‌)లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింగరేణి యువ కార్మికుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన తెలంగాణలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కాలరీస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయని, దీనిని అడ్డుకునేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉద్యమాలు చేసి రక్షించుకుందామని, అందుకు యువ కార్మికులు సైనికుల లాగా ఐక్యంగా ఉండి సంస్థను కాపాడుకోవాలని ఆయన అన్నారు. ప్రైవేటు రంగంలో ఉన్న సింగరేణిని ఎందరో నాయకులు తమ జీవితాలను, ప్రాణాలను త్యాగం చేసి ప్రభుత్వ రంగ సంస్థగా మార్చుకోవడం జరిగిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల వల్ల సింగరేణికి కొత్త గనులు రాకపోవడం మూలంగా ఉన్న గనులను ఓపెన్ కాస్టులుగా మారుస్తూ, కార్మికుల సంఖ్య తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ కొనసాగుతుందని లేకుంటే యువ కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతోందని ఆయన అన్నారు. సింగరేణికి బకాయి పడ్డ వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం, కొత్త గనులు రావడం కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉద్యమాలు చేస్తుందని, దానికి యువ కార్మికులు అంతా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటియుసి గెలిచిన తరువాత ఒక పద్ధతి ప్రకారంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్. ప్రకాశ్, ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి.రావు, మాట్లాడగా, ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రం, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, ఆర్జీ టూ, త్రీ బ్రాంచి కార్యదర్శులు జీగురు రవిందర్, మందల రాంచంద్రారెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, బ్రాంచి కోశాధికారి ఎస్ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనక రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపూరి సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతంలు పాల్గొన్నారు. సదస్సుకు గోదావరిఖని 5 ఇంక్లైన్ చౌరస్తా నుంచి మెయిన్ చౌరస్తా, మార్కండయ కాలనీ, గౌతమినగర్ మీదుగా ఖాజిపల్లి శ్రీమయి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీకి ముందు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు పూలబోకె అందించి, శాలువా కప్పి నాయకులు స్వాగతం పలికారు. కళాకారులు ఎజ్జ రాజయ్య, లెనిన్, జూల మోహన్, జాలిగం రాజు తదితరులు సదస్సులో కార్మిక చైతన్య గేయాలు ఆలపించారు. ఇంకా ఈ సదస్సులో బ్రాంచి ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, యువ కార్మిక సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

# 'ఏఐ'ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోండి

ఎస్‌సిసిఎల్ సిఎండి బలరాం




ప్రజాపక్షం/హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేతృత్వంలోని సాంకేతిక విప్లవం మన జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేయబోతుందని, దీనిని నైతికంగా ఎలా ఉపయోగించాలో నేర్చుకుంటే మంచిదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సూచించారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో 'పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో జాతీయ పౌర సంబంధాల దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన సదస్సుకు ఎన్.బలరాం ముఖ్యఅతిథిగా హాజరై, పబ్లిక్ రిలేషన్స్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ నిపుణులనుద్దేశించి ప్రసంగించారు. 'మనం ఎఐ యుగంలోకి ప్రవేశించలేదని, ఇప్పటికే దానిలో మునిగి ఉన్నామని చెప్పారు. ఇంటర్‌నెట్ విస్తృతమైన ప్రభావం మన ప్రపంచాన్ని మరింత కుదించిందన్నారు. ఎస్‌సిసిఎల్ లాభాలను నిర్ధారించే కార్మికులు, సిబ్బంది, అధికారులు భాగస్వామ్యంతో తీసుకున్న వివిధ వినూత్న చర్యలను బలరాం వివరించారు. మహీంద్రా విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డీన్ ప్రొఫెసర్ శశిధర్ నంజుండయ్య మాట్లాడుతూ ఎఐ చుట్టూ ఉన్న నైతిక అంశాలను ప్రస్తావించారు. 'టెక్నాలజీ సందేశాన్ని నియంత్రిస్తుందా లేదా సందేశం సాంకేతికతను నియంత్రిస్తుందా? అనే నైతికతతో ఉన్నవారు ఎవరు ఉన్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు కృష్ణ బాజీ, సభ్యులు మోహన్ రావు, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము, కార్యదర్శి డాక్టర్ కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 2.366 కిలోల గంజాయి స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు హైదరాబాద్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, 2.366 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌టిఎఫ్ బృందం ప్రతినిధి నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. దూల్‌పేట్‌లోని పురానాపూల్‌లోని ఒక ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో ఎస్‌టిఎఫ్ 'ఎ' బృందం పోలీసులు దాడి చేసి 1.206 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గంజాయిని విక్రయిస్తున్న చంద్రముఖి, ఆకాష్ సింగ్‌లను అరెస్టు చేసి, గంజాయితో పాటు నిందితులను దూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. మరో సంఘటనల్లో అసిఫ్ నగర్ బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న మహమ్మద్ అఫ్జల్ అమిత్‌ను ఎస్ టి ఎఫ్ 'డి' బృందం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద 1.160 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌టిఎఫ్ 'డి' బృందం ప్రతినిధి తిరుపతి యాదవ్ తెలిపారు. గంజాయిని నిందితుడిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## 27న తెలంగాణ జన జాతర

ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నా
రైతులను పట్టించుకోవడం లేదు : ఎమ్మెల్సీ కవిత



ప్రజాపక్షం/ఖమ్మం : భారత రాష్ట్ర సమితి రజతోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న తెలంగాణలో జన జాతర జరగనుందని బిఆర్ఎస్ నాయకురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన బిఆర్ఎస్ పాలనను తెలంగాణ ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా మద్దతును కోల్పోయిందని ఆమె తెలిపారు. ఖమ్మం పర్యటనలో భాగంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ముగ్గురు మంత్రులున్న తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే చర్యలు తీసుకోలేకపోయారని అసలు రైతుల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి తర్వాత ఆ స్థాయిలో ఉన్న ఉప ముఖ్యమంత్రి ఖమ్మంజిల్లాకు చెందిన వారే అయినప్పటికీ ఖమ్మంజిల్లాకు చేసింది ఏమి లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే జిల్లాలో భక్తరామదాసు ప్రాజెక్టును నిర్మించి 60వేల ఎకరాలకు సాగునీటిని అందించడం జరిగిందని ఆమె తెలిపారు. అకాల వర్షాలకు రైతులు పడుతున్న ఇబ్బందులను గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్‌ఎలు మదన్‌లాల్, బానోత్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌జెసికి పరామర్శ :** ఇటీవల అనారోగ్యానికి గురైన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్‌జెసి కృష్ణను ఎంఎల్‌సి కవిత పరామర్శించారు. ఆర్‌జెసి శస్త్ర చికిత్స చేయించుకున్న తర్వాత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# భారత్ వైపు ప్రపంచ దేశాల చూపు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: ఇంటెలెక్చువల్స్ కోసం ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఇంటలెక్చువల్, ప్రొఫెషనల్ స్కిల్స్ పెంచుకోవడమంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదని, సమాజంతోపాటు ప్రపంచ అభివృద్ధికి దోహదపడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్' నూతన భవనానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, మరో రెండేళ్లలోనే 5 బిలియన్ మార్క్ దాటనుందని తెలిపారు. ఈ విజయం కంపెనీ సెక్రటరీ, ప్రొఫెషనల్స్ హార్డ్ వర్క్, అంకితభావం, విలువలతో కూడిన వ్యాపారం వల్లనే సాధ్యమైందన్నారు. కంపెనీ సెక్రటరీలు దేశ కార్పొరేట్ రంగానికి రూపురేఖలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్పొరేట్ కంపెనీలు విలువలను పాటిస్తూ పారదర్శకంగా చట్టాలను అనుసరించేలా చేస్తూ, దేశ కార్పొరేట్ గవర్నెన్స్‌కు కంపెనీ సెక్రటరీలు వెన్నెముకగా నిలుస్తుందన్నారు. కంపెనీల సమగ్రత కాపాడడంతో పాటు కార్పొరేట్ వ్యవహారాల నిర్వహణ సరిగా ఉండేలా చూస్తూ, దేశ ఆర్థిక వృద్ధి లో కూడా కంపెనీ సెక్రటరీలు కీలక పాత్ర పోషిస్తున్నారని, 2017లో జరిగిన ఐసిఎస్ఐ జూబ్లీ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నారని కిషన్ రెడ్డి తెలిపారు. సత్యం వధ ధర్మం చర అనే సూత్రం ఆధారంగా ఐసిఎస్ఐ పనిచేస్తోందని, ప్రతి కంపెనీ సెక్రటరీ ప్రతిరోజు ఈ సూత్రాన్ని ఆధారంగా పని చేస్తే దేశ వ్యాపార రంగం నిజాయితీ, పారదర్శకతతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఇప్పటికే జర్మనీ, జపాన్ లాంటి దేశాలు మన ప్రతిభను గుర్తించి, కంపెనీ సెక్రటరీలు, లాయర్లు, అకౌంటెంట్లను వారి దేశాల్లో పనిచేసేందుకు నియమించుకుంటున్నాయని గుర్తు చేశారు. భారత్ ఆత్మ నిర్భరత సాధించే దిశగా కంపెనీ ఐసిఎస్ఐ లాంటి సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కేంద్రం తక్షణమే స్పందించాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యా, ఉద్యోగ,రాజకీయంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో చేర్చి, బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్‌తో బిసి హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ గత 20 రోజులుగా ఢిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆయనతో చర్చించి దీక్షను విరమింప చేయాలన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు ను, రాష్ట్ర గవర్నర్ కూడా ఆమోదించి రాష్ట్రపతికి పంపించి వారం రోజులు గడుస్తోందని, ఈ బిల్లుపై ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా విచారకరమని శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిని బిసి బిల్లుకు బిజెపి మద్దతు తెలిపిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం రాష్ట్ర బిజెపి నిర్ణయానికి విరుద్ధంగా బిసి బిల్లును ఆమోదించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర ఆరోగ్యం క్షీణించిందని, తక్షణమే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు జోక్యం చేసుకుని దీక్ష విరమింప చేసేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆయనకు ప్రాణానికే ప్రమాదమని శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బిసి ఉద్యమకారుని ప్రాణాలకు హాని జరిగితే కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. రెండు రోజుల్లోనే సిద్దేశ్వరకు మద్దతుగా హైదరాబాదులో అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలు, కుల సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని, దేశ వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## నలుగురు ప్రియుళ్లతో కలిసి భర్త హత్యకు కుట్ర

**మీరట్:** ఇటీవల కాలంలో పురుషులపై దారుణాలు విపరీతంగా పెరుగుతున్నాయి. భర్తలను హత్య చేస్తున్న భార్యల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లో మగాళ్లపై ఆడవాళ్ల నేరాలు అగ్రస్థానంలో నిలిచాయి. ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్యలు చాలా మందే ఉన్నారు. తాజాగా, ఓ మహిళ తన నలుగురు ప్రియుళ్లతో కలిసి భర్త హత్యకు కుట్ర చేసింది. భర్తను చంపి అతడి బీమా డబ్బులు కాజేయాలని చూసింది. ఈ విషయం భర్తకు తెలిసింది. భార్య కుట్ర భగ్నమైంది. భార్య సంబంధాల గురించి, హత్యకు సంబంధించిన కుట్ర గురించి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన గౌరవ్ శర్మ, రితాన్షి శర్మలకు 2012లో పెళ్లయింది. కట్నం తీసుకోకుండానే ఆమెను పెళ్లి చేసుకున్నాడు. తర్వాత రితాన్షి భర్తతో కలిసి అత్తింట్లోనే ఉండేది. తరచుగా అందరితో గొడవ పెట్టుకునేది. చాలా నీచంగా ప్రవర్తించేది. దీంతో గౌరవ్, రితాన్షి వేరు కాపురం పెట్టారు. వేరే ఇంటికి మారిన తర్వాతనైనా ఆమె ప్రవర్తనలో మార్పు వస్తుందని భర్త భావించాడు. అయినా ఫలితం లేదు. మగ స్నేహితులతో కలిసి ఆమె తరచుగా మద్యం తాగేది. కొన్ని రోజుల పాటు ఇంటికి రాకుండా బయటే ఉండేది. పొరిగిళ్ల వారు రితాన్షి ప్రవర్తనపై గౌరవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే గౌరవ్ 12 ఏళ్ల తన మేనల్లుడ్ని ఇంటికి పిలిపించాడు. తమతో పాటే ఉంచుకున్నాడు. గౌరవ్ మేనల్లుడు రితాన్షి చెడుపనుల గురించి చెబుతూ ఉండేవాడు. రితాన్షి దాదాపు ఐదుగురు మగాళ్లతో సంబంధం పెట్టుకున్నట్లు గౌరవ్‌కు ఆధారాలు దొరికాయి. వాటిలో కొన్ని ఫొటోలు, వీడియోలు, స్క్రీన్ షాట్లు ఉన్నాయి. రితాన్షీ తన పేరు మీద ఉన్న 40 లక్షల ట్రావెల్ ఇన్సురెన్స్ కోసం హత్యకు కుట్ర పన్నినట్లు గుర్తించాడు. నలుగురు ప్రియుళ్లతో కలిసి ఆమె కుట్ర చేసినట్లు తెలుసుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన దగ్గర ఉన్న ఆధారాలను వారికి సమర్పించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అసైన్డ్‌కు పట్టా దక్కేనా....?



ప్రజాపక్షం/ఖమ్మం : కొత్త చట్టం అమల్లోకి వచ్చే ముందు విస్తృత చర్చ జరుగుతుంది జరగాలి కూడా. అతి ముఖ్యమైన భూ భారతి చట్టం అమలు ముందు గ్రామీణ ప్రాంతాల్లో పలు అనుమానాలు, ఆశలతో కూడిన చర్చ మొదలైంది. ధరణి లోపాలను సవరించడంతో పాటు అనుభవదారులుగా ఉండి భూమిపై హక్కు లేని వారికి ఈ చట్టం హక్కు కల్పిస్తుందా...? వాస్తవంగా భూమి లేకుండా కేవలం పట్టాదారు పాసుపుస్తకాలకే పరిమితమైన భూముల సంగతిని తేలుస్తుందా అన్న దానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. ధరణిలో రెవెన్యూ గ్రామంలో ఉన్న మొత్తం భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి మధ్య వ్యత్యాసం ఉంది. కొన్ని గ్రామాల్లో భూమి మొత్తం రికార్డుల్లోకి చేర్చబడలేదు. మరి కొన్ని గ్రామాల్లో ఉన్న భూమి కంటే రికార్డుల్లో వందల ఎకరాల్లో ఎక్కువగా ఉంది. ఇదే నేపథ్యంలో 1970 దశకంలో ఇందిరా గాంధీ ప్రధానిగా గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని పేదలకు ముఖ్యంగా దళితులు, గిరిజనులకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూమి పంపిణీ చేయబడింది. ఇందులో బంజర భూములు, మాన్యాలు, ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, సీలింగ్ భూములు ఉన్నాయి. తెలంగాణ భారతదేశంలో విలీనం తర్వాత గ్రామాలను వదిలి వెళ్లిన జమీందార్, జాగీర్‌దారు భూములను కూడా పేదలు అనేక దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వీరిలో ఒకట్రెండు శాతం మంది రైతులకు పట్టా హక్కు కల్పించిన మిగిలిన వారికి హక్కులు కల్పించబడలేదు. ఒకప్పుడు పడావ్ పడి విలువ లేని భూములుగా ఉన్న వీటికి మారిన పరిస్థితుల్లో భూ విలువ పెరిగిన నేపథ్యంలో విపరీతమైన డిమాండ్ ఉంది. బంజరు, మాన్యాలు, ఇనామ్ భూముల్లో పలు చోట్ల కర్మాగారాలు, సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ భూములు ఇప్పటికీ పలువురి చేతులు కూడా మారాయి. ప్రధానంగా ఒక అంశాన్ని గమనిస్తే తొలి నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కులు కల్పించని అధికార యంత్రాంగం పేదల వద్ద భూములు కొని కర్మాగారాలు, విద్యా సంస్థలు లేదా ఇతరత్రా నిర్మాణాలు చేపట్టిన వారికి పట్టాదారు పాసు పుస్తకాలు అందించారు. కానీ అనాది నుంచి భూమి సాగు చేసుకుంటున్న వారికి మాత్రం ఏదో ఒక కొర్రీ పెట్టి హక్కు కల్పించబడలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 15,83,500 కుటుంబాలకు 22,24,500 ఎకరాలను పేదలకు పంచినట్లుగా భూ రికార్డులు చెబుతున్నాయి. దీనితో పాటు 14,800 ఎకరాల భూదాన్ భూములను 39,400 ఎకరాల సీలింగ్ భూములను కూడా పేదలకు పంచారు. వీటిని కొనుగోలు చేసిన వారికి హక్కులు కల్పించిన ప్రభుత్వం సాగు చేసుకుంటున్న వారికి మాత్రం హక్కులు కల్పించబడలేదు. ధరణిలో వీటి ఊసెత్తలేదు.

**భూ భారతి భూ లెక్క తేల్చేనా ?**
భూ విస్తీర్ణం దానితో పాటే సాగు భూమి, అటవీ భూమి, నిర్దాక భూముల విషయంలో పొంతన లేని లెక్కలు ఉన్నాయి. ఉదాహరణకు సాగు భూమి విషయంలో రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలకు, వాస్తవ భూ విస్తీర్ణానికి మధ్య తేడాలున్నాయి. ఎప్పుడో 19వ శతాబ్దం తొలినాళ్లలో తెలంగాణలో నిజాం పాలనలో మొత్తం భూ సర్వే జరిగింది. సర్వే నెంబర్ల వారీగా ఉర్దూలో భూ వివరాలను నమోదు చేశారు. డొంకలు, రోడ్లు, నివాస స్థలాలు, నిరర్థక భూముల వివరాలతో పాటు నీటి వసతులను కూడా ఆనాడు భూ రికార్డుల్లో నమోదు చేశారు. రాను రాను నిరర్థక భూములు సాగు భూములుగా మారడం జరిగింది. ఇప్పుడు ఒక సర్వే నెంబరులో ఉన్న భూ విస్తీర్ణానికి వాస్తవ విస్తీర్ణానికి మధ్య పొంతన లేదు. ఇప్పుడు సర్వే నెంబర్ల ప్రకారమే రైతులు అనుభవదారులుగా ఉన్నారంటే అది లేదు. భూ సర్వేనే దీనికి పరిష్కారమన్నది అందరి వాదన. భూ భారతి ద్వారా అక్రమార్కులకు అవకాశం కల్పించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది. ధరణి సమయంలో పైరవీకారులు ఇష్టానుసారంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. వివాదస్పద భూములను సైతం తమ పేరున రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. ఓ దశలో రెవెన్యూ కార్యాలయాలు పైరవీలకు అడ్డాలుగా మారాయి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండడంతో పాటు భూమి కలిగిన ప్రతి రైతుకు భూమిపై హక్కు పొందేవిధంగా ధరణిలో పొందుపర్చాల్సి ఉంది.

**పోడు సంగతేంటి...:**
భూ హక్కులు, చట్టాలు అనే విషయం ప్రస్థావనకు రాగానే పోడు భూముల విషయం కూడా ప్రస్తావనకు వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పోడు సమస్య ఉంది. 2006కు పూర్వం సాగు చేసుకుంటున్న పోడు రైతులకు భూమిపై హక్కు కల్పిస్తామని చెప్పినప్పటికీ అది వాస్తవ రూపం దాల్చలేదు. 2006 నాటికి సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించి 1,83,257 వ్యక్తిగత దరఖాస్తులు రాగా వన సంరక్షణ సమితుల నుంచి 3,427దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా మొత్తం 6,31,000 ఎకరాలకు హక్కు కల్పించాలని కోరగా కేవలం 3,00,284 ఎకరాలకు మాత్రమే హక్కు కల్పించారు. 3,30,000 ఎకరాలకు పైబడి భూమికి హక్కులు కల్పించాల్సి ఉంది. సాగు దారులను ప్రతి ఏడాది జూన్ మాసంలో బెదిరించడం, రైతులకు, అటవీ అధికారులకు మధ్య ఘర్షణలు జరగడం పరిపాటైంది. ఇటువంటి సమస్యలకు తావివ్వకుండా 2006కు పూర్వం సాగు చేసుకుంటున్న ప్రతి పోడు రైతుకు భూ భారతి చట్టం ద్వారా హక్కు కల్పించాల్సి ఉంది. యూనిక్ కోడ్‌ను ప్రతి రైతుకు అందించడంతో పాటు రెవెన్యూ గ్రామాల్లో ఉన్న ప్రతి సెంట్‌కు హక్కుదారుని తేల్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ఆ దిశగా భూ భారతి చట్టం రెవెన్యూ తప్పిదాలకు తావివ్వకుండా రైతులను బాధితులుగా మార్చే వ్యవస్థను తిరిగిన తేకుండా రూపొందించి అమలు చేయాలని రైతాంగం కోరుతుంది.




# మాతృభాషకు గ్రహణం!




దేశంలో మాతృభాషకు గ్రహణం పడుతున్నది. ప్రాంతీయ ఆధిపత్య ధోరణులకు, రాజకీయ ఎత్తుగడలు కూడా జతకలవడంతో సమస్య రోజురోజుకూ ముదురుతున్నది. హిందీని దేశంలోని అన్ని రాష్ట్రాలపై రుద్దడానికి కేంద్రంలోని బిజెపి సర్కారు చేస్తున్న ప్రయత్నాలు మిగతా భాషలకు సవాళ్లు విసురుతున్నాయి. ఇప్పటికే ఉనికిని కోల్పో యే ప్రమాదం ఎదుర్కొంటున్న భాషలు, సమీప భవిష్యత్తు లో లుప్తమయ్యే ప్రమాదం పొంచివుంది. దక్షిణాది భాషలకు, ప్రత్యేకించి తెలుగుకు హిందీ వల్ల సమస్యలు తప్పవన్నది నిజం. దీనికితోడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ మాతృభాషపై గౌరవం రోజురోజుకూ తగ్గిపోతున్నది. 'మా పిల్లలకు తెలుగు రాయడం, చదవడం రాదు' అం టూ గొప్పగా చెప్పుకొంటున్న తల్లిదండ్రులు అడుగడుగు నా కనిపిస్తారు. ఇంతకంటే దారుణం మరొకటి లేదు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నవారిలో అత్యధికులు ద్వితీయ భాషగా సంస్కృతం లేదా హిందీని తీసుకోవడం తెలుగు భాష దౌర్భాగ్యం. పొరుగునున్న తమిళనాడు నుంచి ఈ విషయంలో తెలుగు రాష్ట్రాలు పాఠాలు నేర్చుకోవాలి. నేడు నెర్చుకోవడానికి ఇష్టపడని భాష రేపు వాడకానికి కూడా మిగలదనేది నిజం. మనిషి సంఘజీవి. సమాజంలోని వ్యక్తుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి, మన అభిప్రాయాలను వివరించడానికి భాష అవసరం. మాతృభాషలో ఉన్నంత సులువు మరే ఇతర విధానాల్లోనూ ఉండదు. మన మాతృభాషను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలి. రచయితలు కలాలు కదిలించారు. సమాజంలో మాతృభాషామాధ్యమం గురించి శాస్త్రీయ అవగాహన కలిగించాలి. వివిధ రకాలుగా తెలుగు శ్రేయస్సు కోరుతూ పండితులూ, రచయితలూ, సాహితీవేత్తలూ, పాత్రికేయులూ విజ్ఞాన శాస్త్ర సాంకేతిక తంత్రజ్ఞులూ, సామాజిక, రాజనీతికోవిదులూ, అధికారులూ, రాజకీయులూ పాలకులు బలమైన వాదన వినిపించాలి. తద్వారా తెలుగు భాష ఇంకా అభివృద్ధి చెందాలి. పారిభాషిక పదాలను నిర్మించుకోవాలి, నిఘంటువులు కూర్చాలి. అనువాదాలు విరివిగా రావాలి. కొన్ని అక్షరాలను తగ్గించుకోవాలి. ఆధునిక భాషగా తీర్చిదిద్దుకోవాలి. ఇలాంటి వందలాది సూచనలు ఉన్నాయి. ఎంతోమంది మేధావులు, రచయితలు, సాహితీకారులు ఎన్నో సంవత్సరాలుగా భాషను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరిస్తునే ఉన్నారు. కానీ, ప్రజల్లో, ప్రత్యేకించి తల్లిదండ్రుల్లో చెప్పుకోదగిన మార్పు లేకపోవడం దురదృష్టకరం. పిల్లలను తెలుగు మాధ్యమంలో చేర్చడానికే జంకుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే తీరు కొనసాగితే, ఒకటి రెండు దశాబ్దాలలో తెలుగు భాషా విధ్వంసం తప్పదు. తద్వారా కలిగే సామాజిక సంక్షోభం యుద్ధంకంటే భయానకమైనది. నేరుగా మనుషులను చంపటం అనాగరికం. అది నిన్నటి మాట. భాషల్ని చంపితే చాలు. ఇది నేటి మాట. ఇప్పటివరకూ స్థానిక భాషలపై ప్రత్యక్షంగా ఆధారపడి నడుస్తూ, లక్షలాదిమందికి జీవనోపాధినిస్తున్న టీవీ చానెళ్లూ, సినిమాలూ, పత్రికా ప్రచురణలూ, ప్రకటనా వ్యవస్థలూ గ్రంథ ప్రచురణలూ వీటిలో పనిచేస్తున్నవారి మీదే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరందరూ తెలుగు తదితర మాతృభాషలే ఆధారంగా సంపద సృష్టిలో పాలుపంచుకుంటున్నవారు. రెండు దశాబ్దాల తర్వాత వచ్చే ఇంగ్లీషు నేర్చిన యువజనానికి వీటి అవసరాలు లేక వీటి ప్రాముఖ్యత తగ్గి ఇవన్నీ అంతరించే ప్రమాదం పెరుగుతుంది. ఇప్పటివరకూ లక్షలాదిమందికి జీవనాధారమైనవి మూలబడిపోతాయి. దీన్ని అడ్డుకోవాలంటే మాతృభాషామాధ్యమమే ఉండాలి. మానవ వికాసంలో ఒక విశిష్ట లక్షణంగా ఉత్పన్నమైనదీ భాషే. మనిషి పుట్టుక భాషతోనే. అంటే మనిషికి మనిషిగా గుర్తింపు వచ్చినదీ భాషతోనే. ఒక భాష గొప్పదనీ మరొకటి పేదదనీ అనుకోడానికి ఎలాంటి ఆస్కారం లేదు. అంటే భాషలమధ్య ఎలాంటి తేడాలూ, చిన్నా పెద్దా అనే తారతమ్యాలూ లేవు. అన్ని భాషలూ శక్తివంతమైనవే. అన్నింటా అదే సంక్లిష్టతా అంతే సౌలభ్యం కూడా. నిరుద్యోగ సమస్య మూలాల గురించి పాలకులు ఆలోచించాలిగానీ ఇంగ్లీషులోనేర్పితే ఉద్యోగాలు వచ్చేస్తాయనే భ్రాంతిలో ఎట్లా పడ్డారనేది ఆశ్చర్యకరమే. లక్షలాది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఎట్లా మిగిలిపోయారనేది వీళ్లకి శేషప్రశ్నగా మిగిలిపోవటంలో ఆశ్చర్యమేమీలేదు.ప్రపంచీకరణ అంటే ఆంగ్లీకరణ కాదు స్థానికీకరణ మాత్రమే. ఇది భాషావైవిధ్యం ద్వారానే సాధ్యం. పాఠశాల స్థాయిలో ఇంగ్లీషు మాధ్యమం ఈ వైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. వందలాది స్థానీయ సాంప్రదాయ వృత్తి వ్యాపారాలను ఆధునీకరించి వేలాది మందికి ఉపాధి అవకాశాలను మెరుగు పరచటం మాతృభాషలద్వారా మాత్రమే సాధ్యం. స్థానిక భాషలలో విద్యాబోధన, వృత్తివ్యాపారాలూ వాణిజ్యం, పరిశ్రమలను చవకగానూ, సులువుగానూ ఎక్కువమందిని కలుపుకుంటూ నిర్వహించే వీలు కలుగుతుంది. భాషావైవిధ్యాన్ని కాపాడుకుంటేనే విద్యా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమాన్ని అనివార్యం చేయాలి. ఇదే ఐరాస నివేదిక, ఐరోపా మండలి భాషా విధానం. మాతృభాషలో చదవడం, రాయడం బాగా నేర్చాకే మరే భాషనైనా నేర్చుకోవడం సులువవుతుంది. ఐక్యరాజ్య సమితి కార్యకలాపాలలో ప్రధానమైనవి అభివృద్ధీ, మానవ హక్కులే. ఇది భాషా సంబంధమైన వివక్షను చట్టవ్యతిరేక చర్యగా పరిగణిస్తుంది. అందుకని, బోధనా మాధ్యమంగా మాతృభాష స్థానంనుండి దానిని తొలగించడం ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘించటమే. మానవ సమాజాల సంక్షేమానికీ వాటి గుర్తింపులోనూ విద్య కీలకం. అంతేగాక, ఆధునిక మానవ సమాజాల భద్రతకూ స్వేచ్ఛకూ విద్య తప్పనిసరి. ఈ సందర్భంలో ప్రాథమిక విద్యతో సహా విద్యాభాషా హక్కుల సాధనలో ఆర్థికపరమైన అవాంతరాలను కలగనీయకూడదని ఐక్యరాజ్య సమితి నిర్దేశిస్తోంది. తాజా అధ్యయనాలను అనుసరించి చాలా దేశాలలో ఆంగ్లమాధ్యమ బోధన వేగంగా విస్తరిస్తోంది. కొన్ని దేశాలలో త ప్పిస్తే, చాలా దేశాలలో ఆంగ్ల మాధ్యమ బోధన అధికారిక ప్రభుత్వ అండతోనే నడుస్తోంది. ఐతే, ఆంగ్ల మాధ్యమ బోధనను ప్రవేశపెట్టడంలోనూ కొనసాగించడంలోనూ ఆయా ప్రజల నుంచి మద్దతు రాబట్టలేకపోవడంతో ఈ నిర్ణయం 'వివాదాస్పదంగానూ, అస్పష్టంగానూ ఉన్నా వ్యతిరేకంగా మా త్రం లేదు. ఆంగ్ల భాషా విస్తరణ, విపరీత ధోరణులు ప్రపం చ దేశాలను వేధిస్తుంటే, మన దేశంలో ఈ సమస్యకు తోడు హిందీని భుజాలపై మోయాల్సి రావడం అదనం. దీనివల్ల దేశంలోని వివిధ ప్రాంతా లు తమతమ సామాజిక ప్రత్యేకతలను కోల్పోవాల్సి వస్తుంది. సొంత భాష మరుగున పడుతుంది. దేశ వ్యా ప్తంగా ఆంగ్ల, హిందీ మాధ్యమాల్లో విద్యాబోధనకు అనువైన పరిస్థితులుగానీ, మౌలిక సదుపాయాలుగానీ లేదు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఒక భాషను నాశనం చేస్తే, ఆ భాషలో సాహిత్యం కూడా పతనమవుతుంది. ప్రభుత్వాలే వ్యూహాత్మకంగా ఇలాంటి కుట్రలకు తెరతీయడం దురదృష్టకరం. మన సమాజాన్ని సంక్షోభంలోకి నెట్టే, మన భాషా సాంస్కృతిక వారసత్వాన్ని తుదముట్టించే విధానాలను సహించడానికి వీల్లేదు. మాతృభాషా పరిరక్షణ ఉద్యమానికి నడుంబించక తప్పదు. ఇంగ్లీష్ ప్రచారకులు అన్నిరకాల వ్యాపార వ్యూహాలతో ఉద్వేగపూరిత వాగ్దానాలతో దూకుడుగా వారి భాషను మార్కెటింగ్ చేస్తున్నారు. ఇంగ్లీషేతర భాషలలోని శాస్త్ర ప్రచురణల సంఖ్య మరింత వేగంగా పెరగటం ఆయా దేశాల్లోని శాస్త్ర సంఘాలు విస్తరించడమూ వైవిధ్యం చెందటమూ కూడా కారణం. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లంలో వెలువడుతున్న అన్ని శాస్త్ర పత్రికల నిష్పత్తి వాస్తవానికి క్షీణిస్తోంది. అంతర్జాతీయంగా ఇంటర్నెట్ వాడకం ఇంగ్లీషు ఆధిపత్యాన్ని సూచిస్తోందనే వాదన అర్థసత్యం మాత్రమే. పూర్తిగా నిజంకాదు. విద్యా ప్రయోజనాల కోసం ఇంటర్నెట్ వాడకం పెరగడం ఎలక్ట్రానిక్ సమాచార ప్రసార రంగంలో ప్రపంచంలో ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషల పెరుగుదలనే ప్రతిబింబిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంపొంది స్థానికంగా పేరు కోల్పోవటమా లేక స్థానికంగా ప్రాచుర్యంపొంది ప్రపంచవ్యాప్తంగా పేరు కోల్పోవడమా అనేది ఇప్పుడు శాస్త్రవేత్తల ముందున్న సమస్య. దీని నుండి బయటపడటానికి యంత్రానువాద సహాయం తప్పదు. ప్రపంచీకరణ సమర్థవంతంగా పనిచేయాలంటే అనువాదాలు ఎక్కువ రావటమేకాదు సమాంతరంగా సాగాలి. తద్వారా ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు అనేక రకాల విద్యావిషయక పరిజ్ఞానం అందుబాటులో వస్తుంది. ప్రతి బహుళజాతి సంస్థా లేదా వ్యాపార వాణిజ్య సంస్థా తన విస్తరణకు ఇంగ్లీషేతర భాషను మాట్లాడే సమాజాన్ని తన అభివృద్ధికి అడ్డంకిగా చూస్తోంది. ముందుగా ఇట్లాంటివారి దృక్పథంలో మార్పుతేవాలి. అందుకు ప్రభుత్వాలు సాంప్రదాయ వ్యాపార వాణిజ్య లావాదేవీలలో భాషనుగురించి కొన్ని తప్పనిసరి ఆంక్షలు విధించాలి. అనువర్తిత శాస్త్రాలలో చెప్పే మొదటి పాఠం ప్రయోగశాల నుండి క్షేత్రానికి తప్పనిసరి ప్రయాణం. చైనా, జపాన్, కొరియా వంటి దేశాలు ఆంగ్ల మాధ్యమాన్ని ఏనాడూ అనుసరించలేదు. ఆంగ్లంపై ఆధారపడలేదు. అంతమాత్రం చేత వారి శాస్త్ర, సాంకేతికాభివృద్ధి నిలిచిపోలేదు. మిగతా చాలా దేశాలంటే అవి ముందున్నాయి. అమెరికాతో అన్ని రంగాల్లోనూ పోటీపడుతున్న చైనాలో ఆంగ్ల భాష వల్లే విజ్ఞానం అబ్బిందని అనగలమా? అక్కడి ప్రజలు మాతృభాషలోనే మాట్లాడతారు. చదువుతారు. అక్కడి సాహిత్యం మొత్తం చైనీస్ భాషలోనే ఉంటుంది. జపాన్, ఉత్తర కొరియా తదితర దేశాల్లోనూ ఇదే వాతావరణం కనిపిస్తుంది. కాబట్టి, ఆంగ్ల మాధ్యమం మాత్రమే అద్భుతమనే ఆలోచనా ధోరణుల నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ప్రాంతీయ భాషలను దెబ్బకొట్టి, రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటున్న రాజకీయ పార్టీల వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టడం ఇప్పుడు హిందీయేతర భాషలు మాట్లాడే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి. మాతృ భాషను కాపాడుకోవాలి.




# ఎంత దిగజారితే అంత గొప్ప భాష!

భాష ఎంతగా దిగజారిపోతే అంత గొప్ప అనుకునే దుస్థితి. ఒకప్పుడు పలకడానికి కూడా మొహమాటపడే పదాలు ఇప్పుడు విరివిగా ప్రచారమవుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అంతా నిర్లజ్జగా, నిస్సంకోచం గా వాడేస్తున్నారు. ప్రైవేటు చానెల్స్ వచ్చి తెలుగు భాషను కొంత భ్రష్టు పట్టిస్తే, సోషల్ మీడియా ఉన్న కొద్దిపాటి వి లువల వలువలను కూడా తీసేస్తున్నది. కొన్ని సినిమా లు... సీరియళ్లు... కార్యక్రమాల్లో వాడే భాష వింటే అస లు ఇది తెలుగేనా అనే అనుమానం వస్తుంది. అది ము మ్మాటికీ తెలుగుకాదు.. పైశాచిక భాష. పీక్కోవడాలు.. గోక్కోవడాలు భాష కిందే చెలామణి అవుతున్నాయి. ఇ ప్పుడు వస్తున్న చాలా సినిమాల్లో, అత్యంత మామూలుగా వాడుతున్న ఎన్నో పదాలు నిన్నమొన్నటి వరకూ సభ్య స మాజంలో ఉచ్చరించడానికి నిషిద్ధాలు. ప్రత్యేకించి తెలంగాణలో కొన్ని అసభ్యకరమైన పదాలను సామాన్యంగా ఉపయోగించరు. ఇప్పుడవి ఎలాంటి సంకోచం లేకుండా వాడుకోవడానికి అన్ని మాధ్యమాలు పోటీపడి మరీ వీలు కల్పిస్తున్నాయి. నిజానికి భాషణ, బోధన, ఆలనా, పాల నా అనేవి భాషకి నాలుగు చక్రాలు. తెలుగునాట అవేందుకో మొరాయించాయి. తలా ఒక చెయ్యి వేసిముందుకు నడిపించకపోతే, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. పదాల ఎంపిక నుంచి ఉచ్చారణ వరకూ అడుగడుతునా నిర్లక్ష్యమే కనిపిస్తున్నది. 'ఏరా బూతులు మాట్లాడుతున్నావ్... దెబ్బలు తింటావ్ జాగ్రత్త' అని ఓ తండ్రి అంటే, 'నేను సినిమా పాట పాడుతున్నా' అన్నాడట ఓ పిల్లవాడు. నాలుగు గోడలకు పరిమితమయ్యే పదాలు పిల్లల నోళ్లలో నానే రీతిలో సినిమాలు ఉంటున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడు. హాస్యం పేరుతో తెలుగు చానెళ్లలో కురుస్తున్న బూతు అంతాఇంతా కాదు. ఆ దిక్కుమాలిన కార్యక్రమాలకు చూస్తూ, పళ్లు ఇకిలించుకుంటూ, పిచ్చిపిచ్చి వ్యాఖ్యానాలు చేసే సెలబ్రిటీలు... ఇంగ్లీషు, ఉర్దూ పదాలు వాడడం తప్పుకాదు. జనబాహుళ్యానికి అర్థమవడానికి ఇతర భాషలకు చెందిన కొన్ని పదాలు తప్పనిసరి అవుతాయి. కానీ, ఇంగ్లీషు వాళ్లు కూడా వాడడానికి ఇ బ్బందిపడే పదాలను యాంకర్ యమకింకర్లు అలవోకగా వాడుతున్నారు. రాయడం సభ్యతకాదు.. వివరించడం ఉచితం కానేకాదు కాబట్టి అలాంటి పదాలు వాడడం లేదు. ఈ 'భాషాదురాక్రమదారులు' పుట్టగొడుగుల్లా పుట్టుకొ స్తూ, భాషను శక్తి వంచన లేకుండా అవమానిస్తూ, రాక్షసానందం పొందుతున్నారు. మనకి ఇంగ్లిషు వచ్చు అనుకుంటున్నాం.. కాని రాదు... తెలుగు రాదనుకుంటు న్నాం, కానీ వచ్చు.... ఇంగ్లీషులో మనం మాట్లాడుతున్నామంటే దాని అడుగున లేదా మనస్సు పొరల్లో తెలుగు ఉంది. తెలుగు భూమికగా మన ఇంగ్లీషు సాగుతుంది. అందుకే మాతృభాష ఎక్కడికి పోదు. ఈ విషయాన్ని గమనించకుండా మనమంతా మూకుమ్మడిగా తెలుగు భాష కు అపచారం చేస్తునే ఉన్నాం. కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు అక్షరాలు నేర్పడం ఏనాడో మానేశారు. తెలుగు మీద అభిమానాన్ని ప్రదర్శిస్తున్న ఎంతో మంది తమతమ పిల్లల్ని మాత్రం ఆంగ్ల మాధ్యమంలోనే చదివిస్తున్నారన్నది చేదు నిజం. అందుకే, భాషోద్యమకారులు వారి పిల్లలను ఆంగ్లంలో చదివిస్తున్నారా? అనే ప్రశ్న తరచు వినిపిస్తున్నది. ఏదిఏమైనా తెలుగు భాషకు ద్రోహం చేస్తున్నది, ఎక్కువగా నష్టం చేస్తున్నది ప్రభుత్వాలే. కార్పొరేట్ విద్యాసంస్థలు ఆంగ్ల బోధన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. తెలుగు మాధ్యమంలోనే బోధన చేయాలన్న ఉత్తర్వులు ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేసి మార్కుల కోసం కార్పొరేటు స్కూళ్లలో ఫ్రెంచి, హిందీ చెబుతూ తెలు గు అక్షరాలు. నేర్పని పరిస్థితిని సృష్టించింది కూడా ప్రభుత్వాలే. వందల కోట్ల రూపాయల విలువైన వ్యాపారం చేస్తున్న తెలుగు సినీ పరిశ్రమ మాతృభాషకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు స్పందించదు? ఎక్కడో ఆత్యాచారం జరిగితే స్పందించే సినీ ప్రముఖులు, తెలుగుకు తీ వ్రమైన అన్యాయం జరుగుతుంటే కనీసం ట్విటర్లో కూడా ఎందుకు మాట్లాడరు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం లేదు. తెలుగుభాష పరిరక్షణకు తెలుగు జాతి స త్యాగ్రహం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. మనిషిని మనిషిగా నిలబెట్టగలిగే అనుబంధం, ఆత్మీయత, స్పం దన, తిరుగుబాటు లాంటివి మనసు లక్షణాలు. ఒక వ్యక్తి నిజమైన మనిషిగా ఎదగాలంటే మాతృభాషలో విద్యాబోధన అత్యావశ్యకం. పరిభాషలో బోధన వల్ల మానసిక శ క్తులు వికసించవు. ఇంజనీరింగ్, వైద్యం లాంటి అన్ని స్థా యిల్లో తెలుగుని ఒక సబ్జెక్టుగా చేర్చాల్సిన అవసరం ఉం ది. దీనివల్ల వాళ్లలో వ్యాపార దృష్టి పోతుంది. తెలుగునా ట ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఎంపిక విధానాలు మా రాలి. కేవలం ఐచ్ఛిక ప్రశ్నలు ఇచ్చి వాళ్ళని ఎంపిక చేస్తున్నారని, కానీ తెలుగు బోధించే వారికి వాక్ రూప, లిఖిత, సృజనాత్మక నైపుణ్యాలు ఉండాలి. వీటన్నింటిని పరిశీలించే ఎంపిక చేయాలి. పరిగణనలోకి తీసుకుని పాఠాలు చేర్చాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో మూల్యాంకన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి. బ్రిటిష్ వాళ్ళు ఆంగ్లానికి నిర్దేశించిన బోధన ప్రమాణాలనే తెలుగుకు అనుసరిస్తున్నాం. ఇంతకంటే దిగజారుడుతనం ఏ ముంటుంది? భాష ఊపిరిని నులిమేస్తూ, గొప్పగా ఏదో సాధించామని సంబరపడుతున్న అవివేకులు కోకొల్లలు. ఈ ధోరణి మారితేగానీ తెలుగు భాషకు మళ్లీ పూర్వవైభవం రాదు.








దండోరా జయభేరి
వ్యాసాలకు ఆహ్వానం

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం తెలుగు నేలపై మూడు దశబ్దాలపాటు సాగిన మాదిగ దండోరా ఉద్యమం యావత్ భారతదేశ సామాజిక ఉద్యమాలకు సరికొత్త దిక్సూచిగా నిలిచింది. ఈ ముప్పై ఏళ్లలో మాదిగలు నడిపిన ఉద్యమం కుల ఉద్యమం మాత్రమే కాదు.. అది సబ్బండ జాతుల హక్కులు, పోరాటాలకు ఆదర్శంగా నిలిచిన మహోద్యమం. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో షెడ్యూల్డ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ (సమపంపిణీ)తోపాటు సాగిన ఇతర ఉద్యమాలు, సాధించిన విజయాలపై జర్నలిస్ట్ డా.మహేష్ కొంగర, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ కోటల సంపాదకత్వంలో వ్యాస సంకలనం (పుస్తకం) తీసుకురావాలని సంకల్పించాం. ఈ సంపుటికి కుల, మత, రాజకీయాలకతీతంగా వ్యాసాలు పంపాలని కోరుతున్నాం.

వ్యాసాలు పంపాల్సిన ఇ-మెయిల్
thevilekari@gmail.com
వాట్సాప్ నెం : 96663 45099
చివరి తేది ఏప్రిల్ 30

# 'దండోరా జయభేరి' వ్యాసాలకు ఆహ్వానం

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం తెలుగు నేలపై మూడు దశబ్దాలపాటు సాగిన మాదిగ దండోరా ఉద్యమం యావత్ భారతదేశ సామాజిక ఉద్యమాలకు సరికొత్త దిక్సూచిగా నిలిచింది. ఈ ముప్పై ఏళ్ల లో మాదిగలు నడిపిన ఉద్యమం కుల ఉద్యమం మాత్రమే కాదు..అది సబ్బం డ జాతుల హక్కులు, పోరాటాలకు ఆదర్శంగా నిలిచిన మహోద్యమం. పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో షెడ్యూల్డ కులాల రిజర్వేషన్ల వర్గీకర ణ (సమపంపిణీ)తోపాటు సాగిన ఇతర ఉద్యమాలు, సాధించిన విజయాల పై జర్నలిస్ట్ డా.మహేష్ కొంగర, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ కోటల సంపాదకత్వంలో వ్యాస సంకలనం (పుస్తకం) తీసుకురావాలని సంకల్పించాం. ఈ సంపుటికి కుల, మత, రాజకీయాలకతీతంగా వ్యాసాలు పంపాలని కోరుతున్నాం.


వ్యాసాలు పంపాల్సిన ఇ-మెయిల్: thevilekari@gmail.com
వాట్సాప్ నెం: 96663 45099.
వ్యాసాలు పంపేందుకు చివరి తేదీ ఏప్రిల్ 30.

# సాహిత్యంలో 'క్లాంగింగ్' ధోరణులు..

ఇటీవల కాలంలో వస్తున్న రచనల్లో 'క్లాంగింగ్' ధోరణులు పెరుగుతున్నాయి. కవితలు, నవలలు, డైలాగులు, పాటల రూపంలో మానసిక వికృత రూపాలు సమాజంలోకి చొచ్చుకొస్తున్నాయి. అర్థం లేని భాషను ఉపయోగించడం, ఒక వర్గం లేదా విధానం లేదా ప్రాంతంపై విషం చిమ్మడం నేటి సాహిత్యంలో పెద్దపీట వేసుకొని కూర్చున్న అవాంఛనీయ విధానాలు. క్లాంగింగ్ అనేది మానసిక రుగ్మతల లక్షణం. ఇది ప్రధానంగా స్కిజోఫ్రెనియా, బైపోలార్ డిజార్డర్ ఉన్న రోగులలో కనిపిస్తుంది ఈ లక్షణాన్ని అసోసియేషన్ చైన్యింగ్ అని కూడా పిలుస్తారు. కొన్నిసార్లు గ్లోసోమానియా అని కూడా పిలుస్తారు. ఇలాంటి లక్షణాలున్న వ్యక్తులు రచనలు చేస్తే, సమాజానికి జరిగే నష్టం ఏమిటనేది తరచుగా చోటు చేసుకుంటున్న సమస్యాత్మ పరిణామాలు, రుణాత్మక ఆలోచనా విధానాలు స్పష్టం చేస్తున్నాయి. సందర్భం లేకుండా అర్థపరంగా లేదా ధ్వనిపరంగా జతకలిసే పదాల గొలుసులను పునరావృతం చేయడమే నేడు కవిత్వంగా చలామణి అవుతున్నది. ఇందులో పదాల మధ్య స్పష్టమైన తార్కిక సంబంధం లేకుండా కంపల్సివ్ రైమింగ్ లేదా అనులేఖనాలు ఎక్కువ. వైద్య పరిభాషలో క్లాంగింగ్ అనేది ప్రత్యేకంగా. సందర్భానుసారంగా అనుచితమైన ప్రవర్తనను సూచిస్తుంది. కానీ, రచయిత మాత్రం అసందర్భంగా క్లాంగింగ్ రుగ్మతను ప్రదర్శించుకుంటున్నాడు. రచనలను, ప్రత్యేకించి కవితలను ప్రాస రూపంలో బంధించడాన్ని మానసిక అనారోగ్యానికి నిదర్శనంగా పేర్కొలేకపోయినప్పటికీ, అవసరం లేని పద ప్రయోగాలతో, కృతకమైన వికృత పదాల ప్రతిబంధనాలతో కవిత్వాన్ని అల్లడం ముమ్మాటికీ మానసిక రోగి లక్షణమే. పాఠకుడు ఏమనుకుంటాడో... ఏ విధంగా స్పందిస్తాడో ఆలోచించకుండా, తమ అస్తవ్యస్త ఆలోచనలను వారి మీదకు విడిచిపెట్టడం ఓ రుగ్మత. ఫార్మల్ థాట్ డిజార్డర్స్ (ఎఫ్‌టిడి) అనేది అనేక లక్షణాలతో కూడుకొని, ఆలోచన, భాష, కమ్యూనికేషన్ సమస్యలను సృష్టిస్తుంది. నేటి కవుల్లో ఇలాంటి ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీరిని 'స్కిజోఫ్రెనియా రచయితలు' అనడంలో తప్పులేదు. 1986లో ఆండ్రియాసేన్ అభివృద్ధి చేసిన థాట్, లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ స్కేల్ (టిఎల్‌సి)ని ఉపయోగించి ఆలోచన రుగ్మతలను కొలుస్తారు. ఇది ఎఫ్‌టిడి రకంగా క్లాంగింగ్‌తో సహా 18 ఉప రకాల అధికారిక ఆలోచన రుగ్మతల ధోరణులను నిర్ధారిస్తుంది. దురదృష్టవశాత్తు, ముందస్తు ఆలోచనా ఊబిలో కూరుకుపోయి, వాస్తవాలను చూడలేకపోతున్న కవులు, తమకు తోచిన లేదా తమకు నచ్చిన అంశాలను జనాంతికం చేసేస్తున్నారు. రచనలు చేస్తున్నారు. సమాజానికి కొత్త రుగ్మతను అంటిస్తున్నారు. క్లాంగింగ్‌లో మానసిక అనారోగ్య లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. క్లాంగింగ్ రచనల్లో రచయిత మానసిక అనారోగ్యం ఆవిష్కృతమవుతున్నది. మానసిక రుగ్మతల లక్షణాలకు ఒక ప్రత్యేక ప్రాంతం కావడంతో, క్లాంగింగ్ యొక్క నిర్వచనాలలో, స్కిజోఫ్రెనియాలో ఫార్మల్ థాట్ డిజార్డర్ లక్షణాల ఉపసమితిలోకి అది ఎలా రాకపోవచ్చు లేదా ఎలా రాకపోవచ్చు అనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది ఎఫ్‌టిడి అయినప్పటికీ, ఇది 'డిస్ట్రాక్టిబిలిటీ' అనే ఉప రకం కిందకు రావాలని స్టీబెర్ వాదించాడు. ఈ లక్షణాలు, వైచిత్రులు సాహిత్యంలోకి చొచ్చుకురావడం దురదృష్టకరం.

ఈ వారం కవితలు

## కాడెడ్లు



మొద్దు నిధురబోతున్న
సూర్యుని మొఖం మీద
అలుకునీళ్ళు సల్లి
నిధురలేపుతుంది అమ్మ
చంద్రుని ఇంటికి తోలి
సూర్యునికి తోవ సూపిత్తడు నాయిన

నాయిన కాళ్ళకింద నలిగినంకనే
సచ్చుబడ్డ సౌడు నేలలన్ని
సస్యశ్యామలమై మెరిశినై
అవ్వచేత ఇత్తనం బెట్టినంకనే
నోళ్ళు తెరుచుకున్న బీళ్ళన్ని
బువ్వకుండలై ఏపుగా ఎదిగినై

మా బతుకు శెల్కను సాపుజేశిన
నాయిన కాళ్ళ్ళకు దండమెట్టుకుం
దామని వంగినపుడల్లా
పాదాల అంచుల్లో పారుతున్న నెత్తుటి
నదుల్ని కంటున్న
మా బతుకు మల్లను పచ్చగజేసిన
అవ్వ శేతులను పాయిరంగా ముద్దాడిన
పుడల్లా పెదవులకు గుచ్చేటి
శేతుల్ల మొలిసిన పల్లేరు గాయలసోంటి
కణుపుల సూత్తన్న

అవ్వా... నాయినా...
మీ కట్టాన్ని తలుసుకున్నాక
కన్నీరుపొంగని కళ్లెవన్నుంటే
అవి జీవంలేనివే అయ్యుంటవి

పొలంల మెదిలే
కాడెడ్ల తలుసుకున్నపుడల్లా
మా బతుకు మళ్ళల్ల తిరిగిన
మీ రూపాలే కండ్లబడుతున్నవే...

దిలీప్.వి
8464030808

## ధరణిని ప్రేమిద్దాం..

ధరణిని ప్రేమించు దినము నేడు
ధాత్రిని కాపాడు తలపుతోడ
మొక్కలు నాటుట మేలు కలుగు
స్వచ్ఛమైన గాలి నింపుటకున్

కాలుష్యము తరిమి కాలువలను
నిర్మలముగ ఉంచు నిశ్చయమున
జల వనరుల పొదుపు భూమి
రక్షణకు భవిత కొరకు నిలచున్.
ప్లాస్టికు వదలి పర్యావరణమును
ప్రేమతో కాపాడు ప్రతి మనుజుడు
పుడమిని స్వర్గము చేయు పుణ్యమున
నిలుచును మనమందరము నిత్యముగా

డిజె మోహన రావు
8247045230



## డ్రగ్స్ - డ్రీమ్స్

ఉక్కు సంకల్పపు యువత
రేపటి తరపు దేశ భవిత
వివేకానంద అమృత వచనాలు
అబ్దుల్ కలాం అంతరిక్ష స్వప్నాలు
నల్లమందు ఆకాశపు
మత్తులో ఎగిరిపోతున్నాయి..!

గంజాయి స్వరం ఓ గన్ లా మారి
మానవతా విలువల్ని మట్టిలో కలిపేస్తుంటే
మాదక ద్రవ్యాల వాడకం
మరణశాసనాలను లిఖిస్తున్నాయి..!
డ్రగ్స్ డ్రీమ్స్ మత్తు రాకెట్ల మోత
మరో ప్రపంచయుద్ధమై

మా'నవ' ఉనికినే ప్రశ్నిస్తుంటే
నా అక్షర సైన్యంతో
అలుపెరగని పోరాటానికి
అడుగేసాను నేను..!
బాధ్యత పరిమళం సాక్షిగా
మరో సుందర ప్రపంచం కోసం..!
మాదక ద్రవ్యాల వాడకపు పాఠాలు
పర్యావసానపు గుణపాఠాలు
కవన కిరణాలై ప్రజ్వరిల్లాలి
ప్రభుత్వాల డ్రగ్స్ నిరోధక
చర్యలు జ్ఞాన కిరణాలై

మన బ్రతుకును నడిపించే
ప్రభాత గేయాలవ్వాలి
ఇప్పటికైనా మనమంతా ఏకమై..
అడుగు అడుగు ఉద్యమమై
అక్షరం అక్షరం విప్లవమై

తరాల మనుగడ కోసం తరలిరాకపోతే
భూగోళమే డ్రగ్స్ చుట్టూ
పరిభ్రమిస్తుంటుంది..!
మనలో...మనకొరకై.. డ్రగ్స్ రహిత నవసమాజపు
జాతిగీతమై ప్రవహిద్దాం..!!

– అరుణ్ కుమార్, 9394749536



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిజెపి ఎంపి దూబేపై కోర్టు ధిక్కార చర్యలు

### ఎజికి సుప్రీం న్యాయవాది ఫిర్యాదు

న్యూఢిల్లీ: బిజెపి ఎంపి నిషికాంత్ దూబే సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు న్యాయవాది అనాస్ తన్వీర్ అటార్నీ జనరల్ కార్యాలయాన్ని కోరారు. ఈ వ్యాఖ్యలు తప్పుదారి పట్టించేవని, సుప్రీం కోర్టు గౌరవాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఉన్నాయని తన్వీర్ అన్నారు. కోర్టు ధిక్కరణ చట్టం1971కు చెందిన సెక్షన్ 15(1)(బి) కింద రాసిన తన లేఖలో లోక్‌సభ ఎంపిపై కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించడానికి ఎజి అనుమతి కోరుతూ తన్వీర్ దూబే చేసిన ప్రకటనలు 'చాలా అపకీర్తికరమైనవి, తప్పుదారి పట్టించేవి, గౌరవనీయ సుప్రీం కోర్టు గౌరవం, అధికారాన్ని తగ్గించే లక్ష్యంతో ఉన్నాయి' అని న్యాయవాది ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టంపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలను సీనియర్ న్యాయవాది ప్రస్తావిస్తూ సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా తన విభజన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సుప్రీం కోర్టు నిష్పాక్షికతను దెబ్బతీస్తున్నాయని ఆయన అన్నారు.

## జెడి(యు), బిజెపి పొత్తు అవకాశవాదం


### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**బక్సర్ :** బీహార్‌లో అధికార జెడి(యు), బిజెపి మధ్య పొత్తు 'అవకాశవాదం' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ 'కుర్సీ' (కుర్చీ) కోసం మాత్రమే పార్టీ మారుతున్నారని ఆరోపించారు. బక్సర్‌లోని దల్‌సాగర్ స్టేడియంలో పార్టీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీలో ప్రసంగించిన ఖర్గే ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నితీష్ కుమార్, బిజెపి మధ్య పొత్తు కుదిరిన పొత్తు అవకాశవాదమని, ఇది రాష్ట్ర ప్రజలకు మంచిది కాదన్నారు. నితీష్ కుమార్ 'కుర్సీ' (సిఎం పదవి) కోసం మాత్రమే పార్టీ మారుతున్నారని, మహాత్మా గాంధీని చంపిన జెడి(యు) చీఫ్ భావజాలంతో చేతులు కలిపారు అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. బీహార్‌కు రూ.1.25 లక్షల కోట్ల ప్యాకేజీ ఇస్తానని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ ఏమైందని కూడా ప్రశ్నించారు. ప్రధాని 'అబద్ధాల కర్మాగారాన్ని' నడుపుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 18, 2015న బీహార్‌కు రూ. 1.25 లక్షల కోట్ల ప్యాకేజీ హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందో బీహార్ ప్రజలు నితీష్ కుమార్‌ను నిలదీయాలని సూచించారు. బీహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ఎన్నికల్లో ప్రజలు 'మహాఘటబంధన్' పార్టీలకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఇటీవల దాఖలు చేసిన చార్జిషీట్‌పై ఖర్గే స్పందిస్తూ ఇది కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు ఈ చర్య అని, పార్టీ నాయకులు భయపడకూడదదని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని ఖర్గే గుర్తుచేశారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వ్యతిరేకమన్నారు. పేదలు, మహిళలు, సమాజంలోని బలహీన వర్గాలకు వ్యతిరేకంగా ఉన్నారని, సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించడం లేదని మండిపడ్డారు. కులం మరియు మతం ఆధారంగా సమాజాన్ని విభజించాలని చూస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు వర్గాల మధ్య విభజన సృష్టించడానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ చేసిన కుట్ర అని ఆయన ఆరోపించారు.

# బిహార్‌లో 'గేమ్‌చేంజర్లు' ప్రభంజనం

### కొత్త రాజకీయ పార్టీల రాకతో ప్రధాన పార్టీల్లో కలవరం
### వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్, మాజీ కాంగ్రెస్ నేత ఐపి.గుప్తా, మాజీ ఐపిఎస్ శివ్‌దీప్‌లాండే పార్టీలు తెరపైకి
### బిహార్ రాజకీయ ముఖచిత్రం రసవత్తరం




**న్యూఢిల్లీ :** రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. శాసనసభ ఎన్నికలకు బిహార్ రాష్ట్రం సన్నద్ధం అవుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికల సమీకరణాలను తారుమారుచేసేందుకు త్వరలో జరుగనున్న బిహార్ శాసనసభ ఎన్నికల బరిలోకి నూతన రాజకీయ పార్టీల రథ సారధుల రంగప్రవేశం బిహార్ అసెంబ్లీ ఫలితాల అంచనాలను తలకిందులు చేసే ప్రమాదం పొంచి ఉన్నది. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల పేర్లతో ప్రజా రాజకీయాలలో ఇప్పటివరకూ నిరూపించుకోని కొత్త రాజకీయ గేమ్‌చేంజర్లు బరిలోకి దిగనుండటం పేరొందిన రాజకీయపార్టీలను సైతం కలవరపరుస్తోంది. రాజకీయ పార్టీల వ్యూహకర్తగా ప్రజాదరణ పొందిన ప్రశాంత్‌కిషోర్ నేతృత్వంలో బిహార్ రాష్ట్రంలో జన్ సూరజ్ పార్టీ కొన్ని నెలల క్రితమే రాజకీయాలలోకి ఆరంగేట్రం చేసింది. అయితే ఆ రాష్ట్ర రాజకీయాలలో జన్‌సూరజ్ పార్టీ ఇంకా క్రియాశీల పాత్రను నిర్వర్తించడంలో బాగా వెనకబడ్డది. ఈలోగా మాజీ కాంగ్రెస్ నాయకుడు ఐపి.గుప్తా కొత్తగా పార్టీ ప్రారంభంతో తన దూకుడును పెంచారు. కుల సమీకరణ పురాతన ఇతివృత్తంతో బిహార్‌లోని గాంధీ మైదానంలో అద్భుతమైన బలప్రదర్శన చేశారు. ఆ వేదిక నుండి 'ఇండియన్ ఇంక్విలాబ్ పార్టీ'ని ప్రకటించి చర్చనీయాంశమయ్యారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి గట్టి మద్దతునిచ్చిన జెడి (యు) అధినేత, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఫిట్‌నెస్‌పై ఆయన ప్రత్యర్థులు ప్రశ్నలు సంధిస్తున్న నేపథ్యంలో వాటిపై సందేహాలు నెలకొన్నాయి. మహారాష్ట్రియన్ అయిన మాజీ ఐపిఎస్ అధికారి శివ్‌దీప్ లాండే 'హింద్ సేన' పార్టీని ప్రారంభించి, ప్రజలలో ఎలాంటి మద్దతు లేకున్నప్పటికీ తనదైన శైలిలో పని చేసుకుంటూ పోతూ ఒక బ్రాండ్‌ను సృష్టించుకున్నారు. లాండే తన కర్మభూమి బిహార్‌లో మార్పు తీసుకురావాలని కోరుకుంటే నితీశ్ కుమార్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉండి అయిష్టమైన వ్యక్తిగా మారిన ఆర్‌సిపి.సింగ్ కూడా ఉన్నారు. ఆయన బిజెపిని స్థాపించారు కానీ పార్టీ జెడి(యు)తో తన పొత్తును పునరుద్ధరించిన తర్వాత ఆ చల్లటి వాతావరణం నుంచి బయటపడ్డారు. ఆర్‌సిపి.సింగ్ ఒక మాజీ బ్యూరోక్రాట్. ఆయన తన శక్తియుక్తులన్నీ వెచ్చించి 'ఆప్ సాబ్ కి ఆవాజ్' అనే ఒక కొత్త పార్టీని ప్రారంభించారు. బిజెపి, ఆర్‌జెడి, జెడి (యు)వంటి స్థిరపడిన రాజకీయ పార్టీలలోని చాలామంది రాజకీయనాయకులు రాబోయే నెలల్లో కిషోర్,గుప్తాతో జాగ్రత్తగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ 2020 ఎన్నికలలో దాదాపు 35 అసెంబ్లీ స్థానాలలో జెడి(యు) ఓటమికి ఒంటరి ప్రయత్నాలు చేసిన జ్ఞాపకాలు ఇంకా తాజాగానే ఉన్నాయి. ఆర్‌జెడికి చెందిన ఒక రాజకీయ నాయకుడు మాట్లాడుతూ ప్రశాంత్ కిషోర్, ఐపి.గుప్తా చాలా సీట్లలో గెలువడం తాను చూడలేదని, అయినప్పటికీ వారు అనేక నియోజకవర్గాలలో సరిపోను ఓట్లను రాబట్టి ప్రధానపార్టీలలో ఒక పార్టీ ఓటమిని నిర్ధారించడానికి దృష్టి సారించగలరనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. అయితే మాజీ ప్రసిద్ధ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ సుపరిపాలన పేరుతో ప్రజలను బాగా సమీకరించగలరని, తన పార్టీకి మద్దతుగా సంప్రదాయ కులాల గుర్తింపును పొందగలర, గుప్తా బిహార్ రాష్ట్రంలో అత్యంత వెనకబడిన వర్గాలలోకి వచ్చే తాంతి, తాంత్వ కులాలను సమీకరించడం ద్వారా బాగా ప్రాచుర్యం పొందారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాత ఈ కులాలను ఎస్‌సి కేటగిరీ నుంచి తొలగించివేశారు. ఈ కారణంపై గుప్తా కాంగ్రెస్ పార్టీని వీడి కొత్త పార్టీని ప్రారంభించారు.

## జమ్ముకశ్మీర్‌లో వరుణుడి బీభత్సం..

### విరిగిపడ్డ కొండచరియలు.. ముగ్గురు మృతి





**రంబాన్/జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో వరదలు పోటెత్తాయి. వరదల్లో చిక్కుకుని ముగ్గురు మరణించారు. రాంబన్ జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సుమారు 100 మందిని సహాయక బృందాలు రక్షించాయి. వరదల కారణంగా చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఇక కొండ చరియలు విరిగి పడడంతో ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శిథిలాల కింద పలు వాహనాలు చిక్కుకుపోయినట్లు సమాచారం. పశ్చిమాసియాలోని ప్రత్యేకమైన వాతవరణ పరిస్థితుల వల్లే జమ్ములో భారీ వర్షాలు, తుఫాను సంభవించిందని వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన ఐదేళ్లలో జమ్ముకశ్మీర్‌లో ఇంత భారీ స్థాయిలో వర్షాలు, బలమైె గాలులు వీయడం ఇదే మొదటిసారని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. కాగా దీనిపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లొద్దని సూచించారు. రాంబన్‌లో కొండ చరియలు విరిగిపడడంవల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందన్నారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.



## సిపిఐ సీనియర్ నేత దివాకర్ నాయక్ మృతి

**భువనేశ్వర్/న్యూఢిల్లీ:** సిపిఐ జాతీయ కార్యవర్గ మాజీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర మాజీ కార్యదర్శి దివాకర్ నాయక్ (72) కన్నుమూశారు. అనారోగ్యంగా ఉన్న ఆయన ఆదివారం భువనేశ్వర్, ఖర్వేల్ నగర్ ప్రాంతంలోని సిపిఐ రాష్ట్ర కేంద్ర కార్యాలయం భాగ్‌వతి భవన్‌లో తుదిశ్వాస విడిచారు. దివాకర్ నాయక్ మరణం వామపక్షానికి, పార్టీకి తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ సంతాపం ప్రకటించింది. మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి... నిబద్ధతతో ఉద్యమాల్లో పాల్గొన్నారని, దాదాపు 55 ఏళ్లు పార్టీకి హోల్‌టైమర్‌గా సేవలు అందించారని కొనియాడింది. సిపిఐ ఒడిశా రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. సైద్ధాంతిక శక్తి, నిబద్ధత, సేవాగుణానికి ఆయన జీవితం నిదర్శనమని సిపిఐ శ్లాఘించింది. దివాకర్ నాయక్ స్థానం భర్తీ చేయలేనిదంటూ ఆయనకు అరుణాంజలి ఘటించింది. నాయక్ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. దివాకర్ నాయక్ భౌతికకాయాన్ని ఉదయం 11 గంటల వరకు పార్టీ కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీలకు అతీతంగా నాయకులు ఆయనకు నివాళులర్పించారు. బిజెడి సమన్వయ కమిటీ చైర్మన్ దేవి ప్రసాద్ మిశ్రా, ఎమ్మెల్యేలు ఆర్‌పీ స్వేయిన్, జ్ఞానేశ్వర్ బెహరా, సిపిఎం నేత జనార్దన్ పతి తదితరులు

### సోనియా, రాహుల్‌పై ఇడి చర్యలు

## రాజకీయ ప్రతీకారమే

### డిఎంకె నేత టిఆర్ బాలు విమర్శ



**చెన్నై :** ఇండియా కూటమిలోని కీలక భాగస్వామి అయిన ఎంకె నేతృత్వంలోని డిఎంకె బిజెపిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఇడి చార్జిషీట్ దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది. ఈ చర్య ఆమోదయోగ్యం కాదని, సిగ్గుచేటని, ప్రతీకార చర్య అని విమర్శలు చేసింది. వివిధ పార్టీలను ఏకం చేస్తూ వక్ఫ్ వంటి అంశాలపై కాషాయ పార్టీని వ్యతిరేకిస్తున్నందున కాంగ్రెస్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)తో సహా కేంద్రం దర్యాప్తు సంస్థలను, బిజెపిని బహిష్కరిస్తున్నామన్నారు. బిజెపి రాజకీయ ప్రతీకారం కారణంగా నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఇడి చార్జిషీట్ దాఖలు చేయడాన్ని డిఎంకె తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ కోశాధికారి, పార్లమెంటరీ పార్టీ నేత టిఆర్. బాలు పేర్కొన్నారు. గుజరాత్‌లో ఇటీవల జరిగిన ఎఐసిసి సమావేశం కేంద్రంలోని బిజెపి 'ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఎత్తిచూపింది. పార్టీ కార్యకర్తల పునరుజ్జీవనాన్ని సమర్థవంతంగా ఎత్తిచేపిందన్నారు. గతంలో కూడా ఎఐసిసి సమావేశాలు జరిగిన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోను ఇడి దాడులు నిర్వహించిందని ఆయన అన్నారు. గుజరాత్‌లో జరిగిన ఐఎసిసి సమావేశం తర్వాత కూడా ఇలాంటి నమూనానే ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'వక్ఫ్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ గట్టిగా నిలబడటం, ప్రతిపక్ష పార్టీలు అందుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరడం బిజెపి ప్రభుత్వానికి వచ్చడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను, దాని వైఫల్యాలను కాంగ్రెస్ ప్రజల్లోకి, తీసుకువెళుతుందని బిజెపి భయపడుతోందన్నారు. అందుకే ఇడి కాంగ్రెస్ పార్టీ చుట్టూ తిరుగుతోందని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వంటి నాయకులను కూడా వదిలిపెట్టలేదని బాలు అన్నారు. కాంగ్రెస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక, బిజెపి ప్రభుత్వం ఇడి, ఇతర సంస్థలను పురిగొల్పుతుందని, ఇది అసహ్యకరమైన చర్య మాత్రమే కాదు, ఎవరికీ ఆమోదయోగ్యం కాని సిగ్గుమాలిన రాజకీయ ప్రతీకారం అని ఆయన అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతరులపై ఇడి ఇటీవల న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లించడంపై

## జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి 'గుస్సా'



**జైపూర్:** జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్‌అబ్దుల్లా ఢిల్లీ విమానాశ్రయం అందిస్తున్నసేవలపై తీవ్రంగా మండిపడ్డారు. తాను ప్రయాణిస్తున్న ఇండిగో విమానాన్ని హఠాత్తుగా దారిమళ్లించడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. శనివారం రాత్రి తాను జమ్ము నుండి ఢిల్లీకి బయల్దేరానని తెలిపారు. మూడు గంటల తర్వాత హఠాత్తుగా విమానాన్ని జైపూర్‌కు మళ్లించారని ఆరోపించారు. తిరిగి జైపూర్ నుండి ఢిల్లీకి ఎప్పుడు బయల్దేరతామో కూడా తెలియని అయోమయ పరిస్థితిని తాను ఎదుర్కొన్నాని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఢిల్లీ విమానాశ్రయ అధికారులు ఈ సంఘటనపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ప్రయాణికుల పట్ల విమానాశ్రయ అధికారులు అనుసరిస్తున్న వైఖరిపై ఆయన తీవ్ర అసహనంవ్యక్తం చేశారు.అధికారుల అనుసరిస్తున్న ధోరణి వల్ల సహనం కోల్పోయానని, తాను మర్యాదగా మాట్లాడలేకపోతున్నానని విమర్శించారు. ప్రతికూల వాతావరణంవల్ల శనివారంశ్రీనగర్ విమానాశ్రయంలో 6 విమానాలు రద్దు అయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. విమానాల రాకపోకలలో అంతరాయం ఏర్పడిన ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రభావం ఇతర కనెక్టింగ్ విమానాలపై కూడా పడింది. ఈ అసౌకర్యంపై ఇండిగో ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ జమ్ములో భారీ వర్షాలతో వడగళ్లు పడ్డాయని, వాతావరణం మెరుగైన వెంటనే, విమానాల రాకపోకల కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరిస్తామని, ఈ విషయమై తమ బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని అధికారులు చెప్పారు.

### నేడు, రేపు తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభలు

# భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలి



దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలో 47 కోట్ల మంది పని చేస్తున్నారు. వీరిలో వ్యవసాయ రంగములో 25 కొట్లుపోగా, నిర్మాణరంగంలో 12 కోట్లకు పైగాఉన్నా మిగతావారు పారిశ్రామిక సేవా రంగాలలో పనిచేస్తున్నారని దేశవ్యాప్తంగా నిర్వహించిన శాంపుల్ సర్వే (ఎన్ఎస్ఎస్)ద్వారా తెలిందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. అదేవిధంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రతతో పాటు, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తామని 2021 లో సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది.

కొత్తగా న్యూ పెన్షన్( ఎన్.పీ.ఎస్) స్కీం తీసుకొచ్చినప్పటికీ ఆచరణలో 10 శాతం కార్మికులకు అమలులోనికి రాలేదు. 2018లో ఈ–శ్రమ పోర్టల్ ద్వారా కార్మికులందరినీ గుర్తించి చేర్పిస్తున్నామని సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇప్పటివరకు ఈ–శ్రమ పోర్టల్ లో చేరిన వారు 18 కొట్లు మాత్రమేనని 2025 పార్లమెంటులో తెలిపింది. ఈ రంగంలో పనిచేసే మెజార్టీ కార్మికులకు నెలసరి వేతన విధానం, యాజమాన్య పద్ధతిలేకపోవడం వారందరినీ రిజిస్ట్రేషన్ చేసే విధానములేక, ఈ రంగంలో పనిచేసేవారు వలస( మైగ్రేషన్) కార్మికులే ఎక్కువగా ఉండటం, వారికి స్థిర నివాసము లేకపోవటం, సీజన్ కార్మికులుగా, కాంట్రాక్టు కార్మికులుగా ఉండటం, అది ఓకే పని కాకుండా ఉపాధి కోసం వివిధ వృత్తిపరమైన పనులు కూడా చేయడం జరుగుతుంది.

**నిర్మాణరంగంలో పెరుగుతున్న కార్మికులు:**

ముఖ్యంగా నేడు దేశవ్యాప్తంగా నిర్మాణ రంగము చాలా కీలకమైనది.. పట్టణీకరణ పారిశ్రామికీకరణ, వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగముతో పాటు భవన నిర్మాణరంగములో అపార్ట్మెంట్స్ నిర్మాణం, కొంతకాలంగా బిల్డర్స్ వేగంగా ముందుకొచ్చారు. దీంతో పాటు రోడ్లు, ప్రాజెక్టులు, కెనాల్సు, రైల్వే లైన్స్, విమానయాలు, ఇండస్ట్రియల్ కారిడార్స్ తదితర నిర్మాణ పనులలో వేలాది లక్షలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు.

**నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ చట్టం నేపథ్యం:**

కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని గత కొన్ని దశాబ్దాలుగా కార్మిక సంస్థలు ఉద్యమిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వాలు కూడా వారి సంక్షేమానికి కొన్ని చట్టాలను రూపకల్పన చేసినారు.

భారతదేశంలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వర్గ, వృత్తి సంఘాలను ఒకే వేదిక మీద తీసుకొచ్చి కార్మికులకు సంక్షేమానికి సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించిన ఏఐటియుసి జాతీయస్థాయిలో ' ఆల్ ఇండియా కాన్ ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ' ఏర్పాటు చేయడం జరిగింది. ఫెడరేషన్ నాయకత్వం వివిధ రూపాల్లో ధర్నాలు ప్రదర్శనలు సమ్మెలు చలో పార్లమెంటు(ఢిల్లీ) పోరాటాలు చేపట్టిన నేపథ్యంలో 1996లో ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న యుడిఎఫ్ ప్రభుత్వంలో సిపిఐ భాగస్వాములు గా కేంద్ర హోం మంత్రిగా ఏఐటిసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి ఇంద్రజిత్ గుప్తా, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న ఏఐటీయూసీ అధ్యక్షులు చతురానన్ మిశ్రా కృషితో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం 1996 లో ఆమోదించబడినది.

కేంద్ర చట్టానికి ముందే 1989 లోనే కేరళ రాష్ట్రంలో ఆనాడు అధికారంలోనున్న లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం నిర్మాణ కార్మికుల కోసం ' కంస్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డ్ ' ఏర్పాటు చేయబడినది. అదేవిధంగా 1994లో తమిళనాడు ప్రభుత్వం బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయబడింది. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు మరి కొన్ని మెరుగైన సౌకర్యాలను పొందుపరుస్తూ పెన్షన్, పని ప్రదేశాలలో కార్మి కులకు రక్షణ, వైద్యము కనీస వేతనాలు వగైరా సౌకర్యాలు చేర్చి 1996లో కేంద్రము చట్టం తీసుకొచ్చింది.కానీ ఈ చట్టాన్ని 2009 వరకు చాలా రాష్ట్రాలు అమలుకు పూనుకోలేదు.

**సుప్రీంకోర్టు ఆదేశాలు:**

ఈ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఉద్యమించటంతో పాటు కార్మిక సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో 2010 సం. లో సుప్రీంకోర్టు 1996లో తీసుకువచ్చిన చట్టాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయకపోవడంతో తీవ్రంగా గర్విస్తూ అన్ని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శిలకు కార్మిక శాఖలకు ఆదేశాలు ఇచ్చింది.

**1996 చట్టంలో లోపాలు సవరించాలి:**

ఈ చట్టంలో నిర్మాణరంగా కార్మికులందరినీ సంక్షేమ బోర్డులో చేర్పించి, నిర్మాణ పనుల నుండి ఒక శాతం సేస్సు వసూలు చేసి సంక్షేమ బోర్డులో జమచేసి కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, సంక్షేమ బోర్డులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు కార్మిక యాజమాన్యాల( నిర్మాణ సంస్థలు) నుండి పాలకవర్గములో పెట్టాలని నిర్దేశించనైనది. కార్మికుల సంక్షేమం కోసం చేపట్టవలసిన పథకాలను పాలకవర్గం నిర్ణయించాలని పేర్కొన్నారు. ఇందులో ఉన్న లోపాలను ఆసరా చేసుకుని చాలా రాష్ట్రాలు బోర్డులో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఉదా: తెలంగాణ రాష్ట్రంలో 2018 నుంచి గత ప్రభుత్వంలోనూ, నేడున్న ప్రభుత్వంలోనూ పాలకవర్గం లేదు. కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేదు. కార్మిక శాఖ అధికారుల ఇష్టాను సారంగా నడుస్తుంది. నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తున్నారు. ఈ బోర్డు కార్యకలాపాలు నిర్వహణకు ప్రత్యేకమైన సిబ్బంది లేకపోవడం గుడా కార్మికులకు అందవలసిన సహాయము ఎప్పటికప్పుడు అందుట లేదు.

తెలంగాణలో గత ప్రభుత్వం 1000 కోట్లు ఇతర సంక్షేమాల పథకానికి మళ్ళించింది.

**నేటికీ 60 శాతం నమోదు కాని కార్మికులు:**

నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం 1996లో వచ్చిన 28 సంవత్సరాలు అవుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా ఈ రంగంలో 12 కోట్ల మంది పనిచేస్తున్నారని నివేదికలు చెబుతున్న 40 శాతం కార్మికులు మాత్రమే వివిధ రాష్ట్రాలలో సంక్షేమ బోర్డులో నమోదయి ఉన్నారు. ఇంకా 60 శాతం పైగా కార్మికులు బయటనే ఉన్నారు. వీరి అందర్నీ నమోదు చేయించాలి.

తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ సంక్షేమ బోర్డు

ఉమ్మడి రాష్ట్రంలో2009 నుండి అమలులోనికి వచ్చిన, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు అయినప్పటికీ ఇప్పటికీ బోర్డులో నమోదైన వారి సంఖ్య 20 లక్షలు మాత్రమే.2018 నుండి బోర్డుకు పాలకవర్గం లేదు. కార్మిక సంఘాల ప్రాతినిధ్యం లేదు. కార్మిక శాఖ అధికారులతో విస్తారాజ్యంగా నడుపుతున్నారు. రాష్ట్రంలో50 లక్షలకు పైగా కార్మికులు పనిచేస్తున్నట్లు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయి.

**నిర్మాణ కార్మికుల సంక్షేమంపై ఐఎల్ఓ కృషి :**

నిర్మాణ కార్మికుల సంక్షేమంపై ఐఎల్ఓ ఢిల్లీలోనూ ముఖ్యమైన నగరాలలోనూ కార్మిక సంఘాల ప్రజలతోనూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోనూ సెమినార్లు నిర్వహించినది. కార్మికుల సంక్షేమం కోసం చేపట్టవలసిన వైద్యము, ఆరోగ్యము, రక్షణ చర్యలపైన, పని ప్రదేశాలలో తప్పకుండా తాత్కాలిక / పర్మినెంట్ షెడ్స్, నివాసానికి, విశ్రాంతికి ఏర్పాట్లు శుభ్రమైన రక్షిత మంచినీరు, స్నాన గదులు, టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, ప్రథమ చికిత్స కు ఏర్పాట్లు, 200 మంది కార్మికులకు పైగా పనిచేయచోట్ల అంబులెన్స్, క్యాంటీన్ సౌకర్యం, చిన్నపిల్లల రక్షణకు శిశు కేంద్రం, ఆయాలు, బరువు పనులు, ప్రమాద పనులు చేయుచున్న సందర్భంలో రక్షణ పరికరాలు, వైద్య సహాయం తదితరు ఏర్పాట్లు ఉండాలని రికమండేషన్ చేసి చట్టంలో పొందుపరచాలని చెప్పింది. సంక్షేమ బోర్డు ద్వారా అందించవలసిన సంక్షేమ పథకాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం( ఎఐటియూసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

1). నిర్మాణ రంగంలో పనిచేయుచున్న కార్మికులందరినీ ప్రత్యేక క్యాంపు ల ద్వారా అందరినీ సంక్షేమం బోర్డులు చేర్పించాలి.2). తక్షణమే సంక్షేమ బోర్డుకు పాలకమండలిని గుర్తింపు పొందిన జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలి 3) నిర్మాణాల నుండి సెస్సును ఒక శాతం నుండి 2 శాతానికి పెంచాలి.4). రాష్ట్రంలో పది జిల్లాల నుండి 33 జిల్లాలు ఏర్పాటు చేయటంతో కొత్త జిల్లాలలో డిసిఎల్,ఏసిల్, ఇతరు సిబ్బందిని నియమించి కార్మికులకు అందవలసిన సహాయాన్ని సకాలంలో అందించాలి.5) మై గ్రేట్ వర్కర్స్( వలస కార్మికుల) పనిచేయుచున్న ప్రదేశాలలో నమోదు చేయించి బోర్డు అందించే సహాయాన్ని అందించాలి.6). కార్మికుల అడ్డాల వద్ద ముఖ్యంగా పట్టణాలలో అన్ని మౌలిక సదుపాయాలతో విశ్రాంతి షెడ్యూల్ నిర్మించాలి.7). ఇండ్లు లేని కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వటం లేదా ఆర్థిక సహాయాన్ని అందించాలి. 8). 55 సంవత్సరాలు దాటిన కార్మికులకు సంక్షేమ బోర్డు నుండిరూ. 5 వేలు అమలు చేయాలి. 9). కార్మికుల పిల్లల చదువులకు ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు స్కాలర్షిప్స్ అందించాలి. 10). ప్రమాదంలో చనిపోయిన కారుకుల నష్టపరిహారం రూ. 10 లక్షలకు, సహజ మరణానికి రూ.3 లక్షలకు పెంచాలి.11). కార్మికుల కుటుంబ సభ్యులకు ఇచ్చే విధంగా హెల్త్ స్కీమును అమలుపరచాలి.12). కార్మికుల నైపుణ శిక్షణ పేరుతో.. కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరుతో వందల కోట్ల రూపాయలను ఏజెన్సీలకు ఇస్తున్నారు.. దీనిపై సమగ్రంగా దర్యాప్తు జరిపించి కార్మికులకు న్యాయం జరిగే విధంగా.. నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైతులకిచ్చిన హామీలు అమలు చేయాల్సిందే



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రైతులకు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలన్నీటిని ప్రభుత్వం అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంలో తెలంగాణ వ్యవసాకార్మిక సంఘం ( బికేఎంయు అనుబంధం) శాఖ మహాసభను చెరుకుపల్లి రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడారు. ఇప్ప టివరకు ఏర్పాటైన చట్టాలన్ని కార్మికుల పోరాటాల ద్వారానే వచ్చాయన్నారు. పాలకులు వ్యవహరిస్తున్న పోకడలపై మరల అటువంటి పోరాటాలకు సిద్ధమై హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6వేలు ఇవ్వాలన్నారు. అలాగే వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకువచ్చి జీవించే హక్కును కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

## హైదరాబాద్‌లో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎపి ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు వేడుకలను హైదరాబాద్లో ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ హాజరై కేక్ కట్ చేసారు. సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు పి.సాయిబాబా ఈ సందర్భంగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్బంగా జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసారు. సందర్బంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సిద్ధాంతాలు, ఆశయాలను చంద్రబాబు కొనసాగిస్తూ విద్యా,వైద్య, రవాణా, వ్యవసాయం, సంక్షేమ, అభివృద్ధి రంగాలలో ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారని అన్నారు. పారిశ్రామికీకరణకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు దేశవిదేశాల నుంచి పెట్టుబడులను రాబట్టి లక్షలాది యువత ఉపాధికి దోహదపడ్డారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చంద్రబాబు విద్యను ఒక యజ్ఞంలా నిర్వహించారని, ఆరోజుల్లో రాష్ట్రం నుండి ఇంజనీరింగ్, మెడికల్ విద్యను అభ్యసించాలంటే పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన గత్యంతరం ఉన్న సమయంలో కాలేజీలను ఎన్నో విద్యా సంస్థలను నెలకొల్పారన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్ గౌడ్, ఎం.ఎ.సిద్దీఖి, కట్టరాములు, పరుశురామ్, ఎస్.ప్రకాష్, చంద్రమోహన్, ఎబిఆర్.మోహన్, ఎం.రాజు, ప్రదీప్ గౌడ్, జి.అనిల్ కురుమ, శ్యామ్ సుందర్, కిరణ్, బానుప్రకాష్, సత్యనారాయణ, బి.రాజు, జగదీష్ గౌడ్, సుక్రవేది, రామారావు, సత్తన్న, బిక్షపతిచారి, రబ్బాని, మహేంధర్, కృష్ణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లను 'ఉరిసిల్ల'గా మార్చొద్దు

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చవద్దని, ప్రపంచ మానవాళి మానాన్ని కాపాడిన పద్మశాలీలను కాపాడుకో వాల్సిన సామాజిక బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆ త్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్లలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం నేతన్న చౌక్‌లో జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోనే ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన ఆత్మహత్యలు నివారణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రపంచ మానవాళి మానాన్ని కాపాడే క్రమంలో ప్రతి పద్మశాలి తన గుండెనే కండెక చేసి, బట్టలు నేసి ప్రపంచ మానవాళి తల ఎత్తుకొని తిరిగేలా చేసిన గొప్ప శాస్త్రవేత్తలు పద్మశాలీలు అన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన గార్ల వాసి ఇస్రో సైంటిస్ట్ గంజి వెంకటరమణ కావడం ప్రతి పద్మశాలి గర్వించదగ్గ విషయమని తెలిపారు. నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడవద్దని కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మహత్యల నివారణపై ముద్రించిన కరపత్రాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మ పీఠం పత్రిక సంపాదకులు కొక్కుల భాస్కర్, యూత్ లీడర్ పత్తిపాక సురేష్, రమేష్, జనార్ధన్, వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 'ఎకో టౌన్'

### జపాన్ సంస్థలతో తెలంగాణ ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యావరణ హిత కిటాక్యూష నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకుంటుంది. కిటాక్యూష సిటీ మేయర్ కజుహిసా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర మోడల్స్, నదుల పునరుజ్జీవన విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్సీ, నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ పై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యూష మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ కిటాక్యూష నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేయర్ వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదు అవసరం అని అభిప్రాయపడ్డారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితో పాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయటం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాద కరమై పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితో పాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. హైదరాబాద్– కిటాక్యూష రెండు నగరాల మధ్య విమాన ప్రయాణ ఏర్పాటు చేయాలనే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది.



హైదరాబాద్‌లో జపనీస్ భాషా పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువ శక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కలిగిస్తే, అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవన ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది, పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.

# ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేచర్ క్యాంప్

### ఫారెస్ట్ బాత్‌లో 22 రకాల పక్షుల గుర్తింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వడ్స్, ట్రయల్స్ పేరిట మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్ లో నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 మంది మైక్రాన్ సంస్థ ఐటి ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ నేచర్ క్యాంప్‌లో పాల్గొన్న వారికి ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.సుమన్, హెడ్ నేచరలిస్ట్ అఖిల్, నేచురలిస్ట్ అపరంజని క్యాంపు గురించి జరగబోయే కార్యక్రమాల గురించి, ఫారెస్ట్ ట్రెక్ పార్క్ గురించి వివరించారు. వారికి 5 రకాల టీం బిల్డింగ్ ఆక్టివిటీస్ చేపించి, అడవిలో టెంట్ ఎలా వేసుకోవాలి, క్యాంప్ ఫైర్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్, టెంట్‌లో విడిది, బర్డ్ వాక్ బర్డింగ్ (పక్షుల వీక్షణ) చేపించి, చెట్ల గురించి, సహజ రాతి నిర్మాణాల గురించి, కనపడిని పక్షుల గురించి వివరించారు. ఒక టీంకు హెడ్ నేచురలిస్ట్ అఖిల్, నేచురలిస్ట్ అపరంజని. మరొక టీంకు ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్ మార్గదర్శకులుగా వ్యవరించారు. అక్కడ వారు కనిపించిన పక్షులను వారి కెమెరాలలో బంధించి వాటి, సైంటిఫిక్ పేర్లు, కామన్ పేర్లు, వాటి అలవాట్లు, ప్రవర్తనల గురించి, రాళ్ళ గురించి, చెట్ల ఉపయోగాల గురించి వారికి వివరించారు. అలాగే పాల్గొన్న వారికి టిజిఎఫ్‌డిసి రూపొందించిన బరడ్స్ పాకెట్ గైడ్ ఇవ్వడం జరిగింది. పక్షుల వీక్షణకు వచ్చిన వారు చూసిన పక్షులను పాకెట్ గైడ్ ద్వారా గుర్తిస్తూ, నిపుణులు పక్షుల వీక్షణ ఎలా చేయాలి, వాటిని ఎలా గుర్తించాలి, ఎలాంటి పక్షులు ఎలాంటి శబ్దలు చేస్తాయి వంటి విషయాలను వచ్చిన వారికి వివరించారు. పక్షులు ప్రకృతి వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, వాటి ద్వారా వృద్ధి, విత్తనాల వ్యాప్తి, పర్యావరణ సంతులనం సృష్టించబడుతుంది. చెట్లు, పక్షుల మరియు వన్య ప్రాణుల సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచడం ఇప్పుడు ఎంతో అవసరమని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం వి.తనూజ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.సుమన్, ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మారెడ్డి, హెడ్ నేచురలిస్ట్ అఖిల్, నేచురలిస్ట్ అపరంజని, కిరణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల్లోకి అంబేద్కర్ ఆలోచనా విధానం :మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి




**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** రాజ్యాంగ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు పొందేందుకు అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేలా చూసే బాధ్యత యువతపై ఆధారపడి ఉందని మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల పాలక మండలి లేకపోవడంతో స్థానిక సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణ త్రాగునీరు, వీధి దీపాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఉందన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని మున్సిపాలిటీలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసి, పారిశుద్ధ్య నిర్వహణ తాగునీరు, వీధి దీపాల సమస్యలు తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో జగిత్యాల మున్సి పాలిటీలో ప్రతి రోజు తాగునీరు అందించామని, రూ.200లకే నల్ల కనెక్షన్ అందించామన్నారు. జగిత్యాల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్య లు పరిష్కరించేందుకు కృషి చేస్తానని జీవన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. జగిత్యాల గాంధీ నగర్‌లో 22న జైబాపు జైబీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్యకర్తలు నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

# 50 ఏళ్ల కిందటే రాష్ట్రాల స్వయంప్రతిపత్తి పోరు

### కరుణానిధి, అన్నాదురై కీలక పాత్ర

**చెన్నై:** రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కోసం 50ఏళ్ల కిందటే పోరాటం మొదలైంది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, సార్వభౌమాధికారాన్ని పరిరక్షించే చర్యలు సిఫార్సు చేయడం కోసం తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇటీవల సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ప్యానల్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆయన తండ్రి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి 50 ఏళ్ల కిందటే ఇందుకోసం గళమెత్తారు. 1974, ఏప్రిల్ 16న తమిళనాడు అసెంబ్లీలో రాష్ట్ర స్వయంప్రతిపత్తి కోసం కరుణానిధి ప్రభుత్వం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సభ ఆమోదించింది. రాష్ట్రాలు స్వయంప్రతిపత్తి ఉద్దేశాన్ని డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై (1909–1969) సమర్థించారు. 1967–69లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కరుణానిధికి స్ఫూర్తిప్రదాత అయ్యారు. అన్నాదురై మార్గంలో కరుణానిధి ముందుకెళ్లారు. కలైంగర్‌గా పేరు తెచ్చుకున్నారు. తరచూ అన్నాదురై మాటలను ఉటంకించేవారు. 1969లో ఆంగ్ల పత్రిక 'హోం రూల్‌'లో అన్నాదురై రాసిన చివరి వ్యాసం ప్రచురితమైంది. అందులో 'ప్రియమైన సోదరుడా, నేనెప్పుడూ అధికారం కోసం ప్రాకులాడలేదు. ఫెడరల్‌గా చెప్పబడే ఈ



రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నందుకు ఆనందించడంలేదు. కేంద్రీకృత విధానాలు మరింతగా ఆచరణలోకి వచ్చాయి. సమాఖ్య వాదం కాగితాలకే పరిమితమైంది. అయితే ఢిల్లీతో తగాదా పెట్టుకోవాలని, కేంద్రాన్ని విసిగించాలన్నది నా ఉద్దేశం కాదు. ఇది నా మంచి మిత్రుడు ఈఎంఎస్ (కమ్యూనిస్టు నేత నంబూద్రీపాల్) అర్థం చేసుకోగలరు' అని పేర్కొన్నారు. 1967, ఏప్రిల్ 8న న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నాదురై మాట్లాడుతూ 'దేశ ఐక్యతను, సమగ్రతను పరిరక్షించడానికి అవసరమైన అధికారాలను మాత్రమే కేంద్రం కలిగివుండాలి... రాష్ట్రాలకు సముచిత అధికారాలు ఉండాలి' అని అన్నారు. అధికార పంపిణీ, రాజ్యాంగం అమలు కోసం హై పవర్ కమిషన్ నియామకం అవసరమని సూచించారు. ఈ అన్ని అంశాలను సమర్థిస్తూ 1969, ఆగస్టు 19న కరుణానిధి త్రిసభ్య ప్యానల్‌ను పీవీ రాజమన్నార్ నాయకత్వంలో ఏఎల్ ముదాలియర్, పి.చంద్రారెడ్డి సభ్యులుగా ప్రకటించారు. 1969, సెప్టెంబరు 22న రాష్ట్రాల స్వయంప్రత్తి ఆధారంగా రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య సంబంధాలపై ప్రశ్నల పరిశీలనకు కమిటీ ఏర్పాటు అయింది. 1971 ఎన్నికల మేనిఫెస్టోలో సరైన స్వయంప్రత్తి కల్పించేందుకు రాజ్యాంగానికి సవరణ అవసరమని డీఎంకే డిమాండ్ చేసింది. 1971, మే 27న తమిళనాడు ప్రభుత్వానికి రాజమన్నార్ కమిటీ నివేదిక అందింది. దానిని ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి పంపారు. ఆ నివేదికను ప్రధాని 1971, జూన్ 22న పరిగణనలోకి తీసుకున్నారు. ఇదే ప్రశ్నపై పరిపాలన సంస్కరణల కమిషన్ (అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్) అప్పటికే ఇచ్చిన నివేదికను ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. ఇదిలావుంటే దేశాన్ని విభజించాలని చూసేవారిపై తగు చర్యలు తీసుకోవాలని, స్వయంప్రతిపత్తి కోసం గట్టి డిమాండ్‌నకు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ను ఉదాహరణలుగా చూపే ధోరణి విషయంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్‌వీ హండే (స్వతంత్ర పార్టీ) ఒక సవరణను ప్రతిపాదించడం అప్పట్లో ఆసక్తికరంగా మారింది.

# ధాన్యం కొనుగోళ్లపై నిఘా నేత్రం

## సరిహద్దుల్లో సంయుక్త చెక్ పోస్టులు

### విజిలెన్స్ అధికారులు, పోలీసులు తనిఖీలు

### పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యం తరలిరాకుండా పటిష్ట చర్యలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్రమాలు చోటు చేసుకోకుండా పౌరసరఫరాల శాఖ నిఘా పెంచనుంది. ఇందు కోసం రాష్ట్ర సరిహద్దుల్లో సంయుక్త చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు, పోలీసులు దాడుల్లో పాల్గొనన్నారు. ఇందు కోసం సరిహద్దుల్లో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుండి ధాన్యం పెద్ద ఎత్తున అక్రమంగా తరలివచ్చే అవకాశం ఉండటంతో పెద్ద ఎత్తున నిఘా పెంచుతున్నారు. అక్రమార్కులకు కళ్లెం వేసేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బోనస్ రూ.500 తెలంగాణ ప్రజలకే చెందాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి నుండే చర్యలు తీసుకుంటున్నారు. అతి కొద్దిరోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో యాసంగి (రబీ) ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఇది మొదలైన ఐదు రోజుల తర్వాత లారీల్లో తెలంగాణకు ధాన్యాన్ని తరలించేందుకు లారీలు క్యూలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతీ చెక్‌పోస్టుకు ఐదుగురు సిబ్బందిని నియమించనున్నారు. సరిహద్దున ఉన్న ఏపి, ఛత్తీస్‌గఢ్‌లో కొందరు బ్రోకర్లు పెద్దెత్తున సన్నబియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వలు చేసినట్లు ఫిర్యాదులు అందటంతో అధికారులు అప్రమత్తం మవుతున్నారు. వాటిని ఇటు తరలించి క్వింటాకు రూ.500 బోనస్ కాజేద్దామని దురుద్దేశ్యాన్ని నిలవురించేందుకు సంయుక్త దాడులు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. అక్కడి వ్యాపారులకు ఇక్కడ సహకరించే వారిని గుర్తించి వారిపై కూడా కేసులు పెట్టేందుకు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇతర జిలాల్లో రాష్ట్ర సరిహద్దుల్లో లారీలను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

**మచ్చిక చేసుకుని, బోనస్ కాజేసి..!**

తెలంగాణ రాష్ట్రంలో సన్నాలు క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఉండటంతో పొరుగు రాష్ట్రాల వారు ఇక్కడి వారిని మచ్చిక చేసుకుని ధాన్యాన్ని తీసుకొచ్చి దోచుకుందామని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం కొనుగోలు కేంద్రాల వారితో దోస్తీ, రైతులతో ఒప్పందాలు చేసుకుని ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల నుండి సుమారు 1000 క్వింటాళ్ల ధాన్యం అక్రమంగా తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందురు రంగం కాగా సుమారు 67వేల మెట్రిక్ టనున్నల ధాన్యా న్ని సేకరించాలనే అంచనాలతో అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. సన్నాలకు రూ.23 20తో పాటు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్, బి గ్రేడ్ రకానికి రూ.2300 రేటు ఖరారు చేశారు.



**దృష్టి సారిస్తే ...**

పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే ధాన్యాన్ని నిలవరించేందుకు అధికారులు దృష్టి సారిస్తే సరిపోతుంది. వరి సాగు చేయని భూముల వివరాలు అధికారుల వద్ద ఉంటే ఇది సాధ్యమే. కానీ అధికారులే దళారులతో కుమ్మక్కై ఇతర పంటలు వేసిన భూముల్లో వరి సాగైనట్లు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో రైతు అమ్మకాలు సాగించాలంటే తప్పని సరిగా పట్టాదారు పాస్ పుస్తకం అవసరం ఉంటుంది. దీని ఆధారంగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొంటారు. అక్రమాలు నివారించాలంటే అధికారులు నీతిగా ఉండి ఏఏ పంటుల సాగు చేశారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో మండలాల వారీగా లెక్కలు చేతిలో ఉంటే అక్రమార్కుల ఆటలు ఇట్టే కట్టిపడేయవచ్చని పలువురు అంటున్నారు.

# గ్రామీణ విద్యార్థులకు 'కార్పొరేట్ వల'

### విద్యా సంవత్సరం ముగియక ముందే వ్యాపారం షురూ

### ఉపాధ్యాయులకు అడ్మిషన్ల పేరిట ప్రత్యేక టార్గెట్..

### ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణ కరువు..


**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఇంకా విద్యా సంవత్సరం ముగియనే లేదు..సెలవులు ఇంకా ప్రారంభమే కాలే దు.. కానీ నిర్మల్ జిల్లాలో హైదరాబాద్ కు చెందిన కొన్ని కార్పొరేట్ సంస్థలు,పాఠశాలలో అడ్మిషన్ చేసుకోండి అని ఫోన్లో వాయించేస్తున్నారు. పీర్వోలు విద్యార్థుల చిరునామా లు పట్టుకుని నేరుగా ఇళ్ళకు వెళ్ళి తల్లిదండ్రులతో ఒప్పందాలు చేసు కుంటున్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వేట ప్రారంభించాయి. పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల పీఆర్వోలు అడ్మిషన్ల కోసం రంగంలోకి దిగారు.విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి కాల్స్ చేస్తూ అడ్మిషన్ల కోసం పదే పదే విద్యార్థుల తల్లిదండ్రులకు అడుగుతున్నారు. మరి కొంతమంది పీఆర్వోలు నేరుగా విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి అడ్మిషన్ చేసుకుంటే రాయితీలు.. అడ్మిషన్ల వేట షురూ..! హలో సమస్కారమండి మా పాఠశాలలో మీ పిల్లలకు ముందుగానే ఇప్పుడు అడ్మిషన్ చేసుకుంటే.. భారీ డిస్కౌంట్ ఉంది.. ఈ అవకాశాన్ని చేజారు చేసు కోకండి అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను కార్పొరేట్ పాఠశాలలు బురిడీ కొట్టిస్తున్నాయి. టక్కు టమారా విద్యలను ప్రదర్శిస్తున్నాయి. అంతేకాకుండా ముందుగా బుక్ చేసుకోకుంటే ఫీజులు పెరుగుతాయని, సీట్లు దొరకవన్ భయ పెడుతున్నారు. దీంతో తలిదండ్రులు ఏమి చేయాలో తోచక సతమతమతున్నారు. కరపత్రాలు, ప్రకటనలతో మాయ చేస్తుంద్రు కార్పొరేట్ పాఠశాలల పీఆర్వోలను నియమించుకుని అడ్మిషన్ల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఇంటింటికి తిరిగి కరపత్రాలు, బ్రోచర్లు పంపిణీ చేస్తూ ప్రకటనల పేరిట తల్లిదండ్రులను మాయలో పడేవేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాళల్లో చదవే విద్యార్థుల జాబితా తీసుకుని మరీ మా పాఠశాలల్లో మీ పిల్లలకు మంచి ర్యాంకులు వస్తాయంటూ నమ్మబలుకుతున్నారు. విద్యార్థుల తల్లి దండ్రులకు కార్పొరేట్ పాఠశాలల వేధింపులు తప్పడంలేదు. విద్యా సంవత్సరం ముగియక ముందే విద్యావ్యాపారానికి తెరతీశాయి. అక్రమ అడ్మిషన్లకు తెరలేపి భారీ మొత్తంలో ఫీజులు దండుకుంటున్నారు. విద్యాశాఖ పర్యవేక్షించంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అడ్మిషన్ల పేరిట ఉపాధ్యాయులకు ప్రత్యేక టార్గెట్.. జిల్లాలోని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ల పేరిట ఉపాధ్యాయులకు ప్రత్యేక టార్గెట్ విధిస్తున్నారు. పిల్లలను అడ్మిషన్ చేయాలని ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో, అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు తిప్పలు అన్ని ఇన్ని కావు, కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల కోసం ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. అడ్మిషన్ల కోసం ప్రత్యేక కసరత్తు... జిల్లాలోని విద్యార్థుల అడ్రస్లు, ఫోన్ నంబర్లు, కన్సల్టెన్సీలు, ప్రైవేటు పాఠశాలల పీఆర్వోలు సేకరించాయి. అడ్మిషన్ల ప్రచారానికి పకడ్బందీగా శ్రీకారం చుట్టాయి. విద్యార్థుల తల్లిదండ్రులపై అడ్మిషన్ల కోసం ఒత్తిడి పెంచి ఒక్కో విద్యార్థిపై అడ్వాన్సు తీసుకుంటున్నారు. అడ్మిషన్లు సేకరించిన పీఆర్వోలకు ఒక్కో విద్యార్థిపై రూ.10,000 వేల నుంచి రూ.15,000 వేల వరకు కమీషన్ అందుతున్నట్లు గుసగుసలు విని పిస్తున్నాయి.



# దేశంలో తొలి హైడ్రోజన్ రైలు రెడీ!

### జులై నుంచి పట్టాలపై పరుగులు

**న్యూఢిల్లీ :** దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు జూలై నుంచి హర్యానాలోని జీంద్ జిల్లాలో పరుగులు తీయనుంది. జీంద్ నుంచి సోనిపత్ మధ్య నడవనుంది. అయితే హైడ్రోజన్ ప్లాంట్ నిర్మాణం రెండు నెలల్లో పూర్తవుతుంది. ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ అశోక్ వర్మ ఆదివారం హైడ్రోజన్ ప్లాంట్‌ను పరిశీలించారు. హైడ్రోజన్‌తో నడిచే రైలు నిర్మాణ పనులు చెన్నైలో జరుగుతున్నాయని అశోక్ వర్మ తెలిపారు. ఆ పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. ఇక్కడ హైడ్రోజన్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, భద్రత కోసం పూర్తి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. చెన్నైలో తయారు చేస్తున్న రైలును జీంద్‌కు తీసుకువచ్చాక ట్రయల్ రన్ జరుగుతుందని తెలిపారు. జీంద్, సోనిపత్ మధ్య సజావుగా ప్రయాణం ప్రారంభమవుతుందని అన్నారు. జనరల్ మేనేజర్ అశోక్ వర్మ తనిఖీ సమయంలో రైల్వే ఉద్యోగుల సమస్యలను విన్నారు. జీంద్‌లోని వాషింగ్ లైన్‌ను ప్రస్తుతం 17 కోచ్‌ల సామర్థ్యంతో ఉండగా, దాన్ని 23 కోచ్‌లకు విస్తరించాలని సూచించారు. దీనిపై ఆయన అధికారులతో చర్చించారు. ఆరు కోచ్‌ల విస్తరణకు పనులు ప్రారంభించాలని చెప్పారు. కొత్త రైల్వే జంక్షన్ పునరుద్ధరణ పనులు ఆగస్టుసెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్ఆర్ఎంయు, డిఆర్ఎంయు యూనియన్ల నాయకులు తమ డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని జనరల్ మేనేజర్‌కు సమర్పించారు. జీంద్‌లోని రైల్వే ప్యానెల్‌లో ఆస్పత్రి లేకపోవడం అనే అంశాన్ని నాయకులు లేవనెత్తారు. జీంద్‌లో దాదాపు నాలుగు వేల మంది రైల్వే ఉద్యోగులు, వెయ్యి మంది మాజీ ఉద్యోగులు ఉన్నారని వారు విన్నవించారు. అయితే రైల్వే ప్యానెల్‌లో ఆస్పత్రి లేదు. గతంలో రెండు ఉండగా, ఇప్పుడు ఒక్క ఆస్పత్రి కూడా లేదు. అయితే జీంద్‌లోని రెండు ఆస్పత్రులను ప్యానెల్‌లో చేర్చే ఫైల్ ప్రక్రియలో ఉందని రైల్వే ఉద్యోగులు తెలిపారు. త్వరలోనే దానిని ఆమోదించమని జనరల్ మేనేజర్‌ను కోరారు. అయితే జనరల్ మేనేజర్ ఆస్పత్రిలో విషయంలో వ్యక్తిగత ఆసక్తి చూపుతానని వెల్లడించారు. రైల్వే ఉద్యోగులు ఎటువంటి సమస్యలు ఎదుర్కోకుండా ఆ పనిని త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.



## కోదాడ ఆర్టీసీ బస్సు బోల్తా



**ప్రజాపక్షం/చింతలపాలెం:** ఆర్టీసీ బస్సు బోల్తా పడి 15 మందికి గాయాలైన సంఘటన చింతలపాలెం మండలంలోని నక్కగూడెం గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పల్లెవెలుగు చింతలపాలెం మండలం నక్కగూడెం వెళ్తున్న క్రమంలో బైకు బస్సు అడ్డుగా రావడంతో బైకును తప్పించబోయి బస్సు స్టీరింగ్ రాడ్ విరగడంతో కంట్రోల్ తప్పి బస్సు బోల్తా పడిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలు కాగా 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనంకు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వారిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు బోనాల రవీందర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర్ రావులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర్ టైర్ల ఏజెన్సీని వారు ప్రారంభించి మాట్లాడారు. వాహనదారులకు నమ్మకం కలిగేలా టైర్ల వ్యాపారాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం టివిఎస్ కంపెనీ మేనేజర్ మెహతా సందీప్ కుమార్ మాట్లాడుతూ మీ వాహనాలకు అధిక కాలంతో పాటు మన్నికకు మారుపేరు మా టివిఎస్ టైర్లు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బండారు రాజా, కక్కిరేణి చంద్రశేఖర్, విద్యాసాగర్ రావు, మల్లికార్జున్, గాంధీ, రాజు, అశోక్, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**ప్రజాపక్షం/చండూరు:** ఐకెపి, పిఏసిఎస్ ఆధ్వర్యంలో చండూరు మండలంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ నిర్వహకులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన చండూరులో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా ధాన్యం వచ్చి నిల్వఉన్నందున విక్రయ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. ఆకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతుల ధాన్యం తడవకుండ సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని అన్నారు.

## ఈత సరదా విషాధంగా మారొద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వేసవి కాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో పిల్లలు, యువకుల ఈత సరదా విషాదంగా మారకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సరగా ఈతకు వెళ్లే పిల్లలు చిన్న చిన్న నిర్లక్ష్యాలతో ప్రాణనష్టానికి దారి తీస్తుందన్నారు. చెరువులు, కాలువలు, బావులలో పిల్లలు, యువకులు ఈతకు వెళ్తే వారి వెంట పెద్దలు తప్పకుండా వెళ్లాలని సూచించారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లవద్దని చెప్పారు. వేసవి సెలవులకు వచ్చిన పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఒంటరిగా ఎక్కడికి పంపవద్దని సూచించారు.

## గ్రామీణ వైద్యుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరిస్తుంది

జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు




**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడలో గ్రామీణ వైద్యుల సంఘం భవన ఏర్పాటు ఏమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో స్థలాన్ని సమకూర్చేందుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన తెలంగాణ ఆర్‌ఎంపిల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కోదాడ డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులపై దాడులు జరగడం బాధకరమని, వారిపై దాడులు జరగకుండా వైద్యులకు ప్రభుత్వం నుండి రక్షణ కల్పిస్తామని అన్నారు. కోదాడలో గ్రామీణ వైద్యుల సంఘం భవన నిర్మాణానికి స్థలం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ బ్రహ్మం, గోపాల లక్ష్మి నర్సింహ, సరికొండ నాగరాజు, రహిముతుల్లా, జెర్రిపోతుల లక్ష్మణ్, బి.వెంకటేశ్వర్లు, శ్రీరాములు, సైదులు, వెంకటప్పచారి, మురళికృష్ణ, సైదులు, బిక్షం, విక్రమ్, తుమాటి రామకృష్ణ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## ఎల్లయ్య మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు కాగు ఎల్లయ్య(70)ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేష్‌లు ఆయన భౌతిక కాయం పై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసదర్భంగా బిక్షం రెడ్డి మాట్లాడుతూ కరడుగట్టిన భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి ,దున్నే వాడికే భూమి, పనికి తగ్గ వేతనం, కూలి రేట్లు పెంచాలని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, ఎలిమినేటి రామ్ రెడ్డిల సహకారంతో పేదల పక్షాన నిలబడాడని ఆయన సేవలు మరువలేవని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్యవర్గ సభ్యులు ఎరుకలి నిరంజన్, ఆకుల రఘుమయ్య పటేల్, నాయకులు, కళ్లెం యాదిరెడ్డి, ఆకుల వెంకట్ రామ్ పటేల్, గ్రామ శాఖ కార్యదర్శి శిరసవాడ నరసింహ, ఎలిమినేటి కార్తీస్ రెడ్డి, రామిడి లింగారెడ్డి, హరికృష్ణ, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/నందికొండ:** మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీ కోసం ఆదివారం నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6,7,8,9 తరగతులకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు విద్యార్థులను తనిఖీచేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. ఆ తర్వాత ఎంఈఓ తరి రాము పరీక్షా కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మొత్తం 240 మంది విద్యార్థులకు గాను 194 మంది హాజరు కాగా, 46 మంది గైర్హాజరయ్యారని ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు జరిగిన ప్రవేశ పరీక్షలో పరీక్ష కేంద్రంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించామని అన్నారు.



## ధరణిలో పరిష్కారం లేని భూ సమస్యలకు భూభారతి చట్టం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ/ తిప్పర్తి:** ధరణిలో పరిష్కారం లేని భూ సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం దొరుకుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి (భూమి హక్కుల చట్టం 2025 ) పై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా ఆదివారం ఆమె నల్లగొండ మండలం, దోమలపల్లి రైతు వేదికలో,తిప్పర్తి మండల కేంద్రం లోని రైతు వేదిక లో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధరణి సమయంలో భూముల సమస్యలు పరిష్కారం కాక మహిళ రైతులు, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం భూ భారతి ద్వారా కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఈ చట్టంపై రైతులందరూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఆర్ఓఆర్ అప్డేషన్ చేసే అవకాశం లేదని, భూ భారతిలో అప్డేట్ చేసే అవకాశం ఉందని, మొఖా మీద ఉన్న రైతు తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే సవరణ చేసే అవకాశం ఉందన్నారు .అలాగే సక్సెసన్ విషయంలో సైతం ధరణిలో ఆప్షేషన్ కు అవకాశం లేదని, భూభారతిలో చేసుకోవచ్చని చెప్పారు. భూ భారతి చట్టం ద్వారా 90 రైతుల భూ సమస్యలను పరిష్కారం ఇక్కడే జరుగుతుందని, కేవలం 10 శాతం మాత్రం ఆర్డిఓ, కలెక్టర్ స్థాయిలో ఉంటాయని చెప్పారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఈ చట్టం లోని వికేంద్రీకరణ పరిపాలన వల్ల రైతులకు వారి భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎంతో వెసులు బాటు కలిగిందని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రభుత్వం అవగాహన కల్పించడం జరుగుతున్నదని, రైతులందరూ కొత్త చట్టం పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, నల్లగొండ తహసిల్దార్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, వైస్ చైర్మన్ వెంకన్న, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి,తిప్పర్తి తహసిల్దార్ పరశురాం పాశం సంపత్ రెడ్డి, ప్రత్యేక అధికారి ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలు కళ్యా ణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

## 'హైదరాబాద్ టూ సాగర్' యాత్ర విజయవంతం



**ప్రజాపక్షం/నందికొండ:**ప్రతిమ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో తెలంగాణ టూరిజం సహకారంతో నిర్వహిస్తున్న హైదరాబాద్ టు నాగార్జునసాగర్ మొదటిరోజు యాత్ర పూర్తిగా విజయవంతమయిందని ప్రతిమ టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకులు కిషోర్ కుమార్ తెలిపారు. ప్రతినెల మూడవ ఆదివారం హైదరాబాదు నుండి నాగార్జునసాగర్ కు పర్యాటకులకు అందుబాటులో ప్రతిమ టూర్స్ అండ్ ట్రావెల్స్ వారు ఏర్పాటుచేసిన టూర్ మొదటిసారిగా ఆదివారం ప్రారంభమైనది. బుద్ధవనం ఓఎస్డి సుధన్‌రెడ్డి, తెలంగాణ టూరిజం మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి, సంఘ పాల బంతే ఈ యాత్ర ను ప్రారంభించారు. ప్రారంభించిన మొదటి రోజే 37 మంది పర్యాటకులతో నాగార్జునసాగర్ లోని బుద్ధవనం చేరుకున్న వీరికి బుద్ధవనం లోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను వివరాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవి చంద్ర ఆవులు వివరించారు. అనంతరం ఈ బృందం మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. తర్వాత తెలంగాణ టూరిజం లాంచిలో నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ యాత్ర ప్రారంభం నుండి పూర్తి అయ్యేవరకు తర్వాత తెలంగాణ టూరిజం లాంచిలో నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు.అందరినీ సమన్వయపరుస్తూ విజయవంతం చేసిన బుద్ధవనం మేనేజర్ డి ఆర్ శ్యాంసుందర్రావు ను నిర్వాహకులు అభినందించారు.

## వ్యక్తిత్వ వికాస నైపుణ్యంపై సెమినార్

**ప్రజాపక్షం/నందికొండ:** ప్రతి ఒక్కరికి వారి వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడానికి వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరం అని సాగర్ సిఐ శ్రీను నాయక్ అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గం సాగర్ సర్కిల్ పరిధిలోని సాగర్,తిరుమలగిరి సాగర్,పెద్దవూర పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఎకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రైన్ యువర్ టంగ్ అనే వ్యక్తిత్వ వికాస కార్యక్రమన్ని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు విజయ్ జదుపతి ఆదివారం సాగర్ పోలీస్ స్టేషన్ లోని మీటింగ్ హాల్ లో నిర్వహించారు.ట్రైనర్ విజయ్ పోలీస్ సిబ్బంది కి వివిధ వ్యక్తిత్వవికాస అంశాలైన పాజిటివ్ ఆటిట్యూడ్, కమ్యూనికేషన్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, బాడీ లాంగ్వేజ్ పైన సెమినార్ నిర్వహించి సిబ్బంది తో ఆక్టివిటీ చేయించారు.సాగర్ సిఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ, సాగర్ నియోజకవర్గం లో నిరుపేద యువతకి, నిరుపేద వర్గాలకి, సామాజిక మార్పుకై ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తు న్న ఏకే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు అడ్వకేట్ కట్టెబోయిన అనిల్ కుమార్ సేవలు అభినందనీయమనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంపత్, తిరుమలగిరిసాగర్ ఎస్ ఐ వీరశేఖర్, పెద్దవూర ఎస్ఐ వీరబాబు, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ ఉన్నారు.

## 22న వాహనాల వేలం

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్ నల్గొండ ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ దేవరకొండ నందు వివిధ కేసులలో సీజ్ చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొన దలిచిన వారు 22వ తేది ఉదయం ఎక్సైజ్ స్టేషన్ నందు ద్విచక్ర వాహ నానికి రూ. 10వేలు, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 30వేలు డిపాజిట్ కట్టి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## గ్లోబల్ వార్మింగ్ నుండి భూ మాతను కాపాడుకుందాం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** గ్లోబల్ వార్మింగ్ నుండి భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చండూరు ఆర్డిఓ వందనపు శ్రీదేవి అన్నారు. ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆదివారం గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యులు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గ్రీన్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మమాట్లాడుతూ చెట్లను నరికివేయడంతో వనాలు తగ్గడం, నీరు నిలువలు ఉండాల్సిన చెరువులు, కుంటల్లో ఇండ్లు కట్టుకోవడం, వాహనాల నుండి వెలువడే కాలుష్యం పెరిగిపోయి గ్లోబల్ వార్మింగి పెరిగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇండ్ల పరిసర ప్రాంతాల్లో చెట్లను పెంచాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ అధ్యక్షులు ముప్పారపు నరేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, గ్రీన్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, హేమ మాలిని, రామచంద్రయ్య, నాగరాజు, సురేష్, సంపత్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని చిల్లాపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మీ నారాయణ(48) ఆదివారం మధ్యాహ్నం సుమారు 2గంటలకు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. లక్ష్మీ నారాయణ గ్రామస్థులతో కలిసి చిల్లాపురం గ్రామ శివారులోని చెరువు వద్ద చేపలు పట్టడానికి ఉదయం వెళ్లి ఇంటికి వచ్చి తిరిగి మధ్యాహ్నం 1.45గంటలకు చేపలు తెచ్చుకోవడానికి వెళ్తుండగా చిల్లాపురం గ్రామ శివారులోని జానపాటి సైదులు వ్యవసాయ భూమిలోని విద్యుత్ మోటార్ స్టాటర్‌కు ఉన్న వైరు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడనే విషయమై మృతుని కుమారుడు బొడ్డుపల్లి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## రక్తదానం ప్రాణదానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఒకరి రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానమని, ముఖ్యంగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. దళిత మోర్చ ఉబ్బపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గాంధీనగర్ 34. 35 వార్డులకు చెందిన యువకులు రక్తదానం ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తదాన నిల్వలు లేక గర్భిణీలు, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సజ్జల నాగిరెడ్డి, నాయకులు చిలుకూరి శ్యామ్, దాసరాజు శివ, గూడూరు శ్రీను, కరుణాకర్, డాక్టర్ అంజయ్య, నాగార్జున, శివ, మదన్మోహన్ పాల్గొన్నారు.



## పేదలపై కేంద్రం కక్షపూరిత చర్యలు



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం నేరేడుగొమ్ము మండల కాచరాజుపల్లి గ్రామంలో ఆదివారం గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వాంకునావత్ బాలు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి రెడ్డి పాల్గొని సిపిఐ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని అందులో భాగమే గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంపు అని ఆయన అన్నారు. ఎన్నికల ముందు పేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి మభ్యపెట్టి మూడోసారి అధికారంలోకి వచ్చారని, మతం పేరుతో రాజకీయం చేస్తూ అధికారం చేపడుతున్నారని అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని ఆయన తెలిపారు. పార్టీకోసం కృషి చేసిన వారికి స్థానిక సంస్థల్లో ఫలితం దక్కుతుందని ప్రతి కార్యకర్త గ్రామాలలో పార్టీని బలోపేతం చేసే విధంగా ముందుకు వెళ్ళాలని సూచించారు. అనంతరం సిపిఐ గ్రామశాఖ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బొమ్ము అచ్చయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాండురంగారెడ్డి, గ్రామశాఖకార్యదర్శి ఆంజనేయులు, మంగు, చందు, హరి, హనుమంతు, వెంకటయ్య, పద్మావతి, సురేష్, హతీరాం, పాప, లాలు, శంకర్, బిక్కు పాల్గొన్నారు.

## ఎంపి కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసిన సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం




**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం 8 వార్షికోత్సవం భువనగిరి పట్టణ కేంద్రంలో ఈనెల 22న నిర్వహిస్తున్న సందర్భంగా మండల కేంద్రానికి విచ్చేసిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతలు వంగ శ్రీనివాస్, అంబటి రవి కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కారం చేయడానికి మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉపేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, బత్తిని ఉప్పలయ్య గౌడ్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంగ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి అంబటి రవి కిరణ్, మండల ప్రచార కార్యదర్శి మస్కు నరేందర్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు తవిటి అచ్చయ్య, శ్రీరాముల అత్రి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 22న కొలనుపాకకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/యాదాద్రి:** ఆలేరు మండలం కొలనుపాక గ్రామం భూ పోరాటం జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి 22న కొలనుపాకకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు జాతీయ సమితి సభ్యులు మాజీ మునుగోడు ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, గోదా శ్రీరాములుని హాజరవుతారని సిపిజి జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆలేరులో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల ముఖ్య నాయకులు సమావేశం అధ్యక్షులు సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ కొలనుపాక భూ పోరాటం జరుగుతున్న కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుడు లచ్చిరామ్‌కు గౌరవ డాక్టరేట్




**ప్రజాపక్షం/మర్రిగూడ:** జిల్లాలోని మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాం హానరీ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ నాంపల్లిలో సురవరం ప్రతాప రెడ్డి (పొట్టి శ్రీరాములు) తెలుగు విశ్వవిద్యాలయంలో నందమూరి తారక రామారావు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ చైర్మన్ రమేష్ ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి నుంచి హానరీ డాక్టరేట్ అవార్డు ను అందజేశారు.. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ కరోనా సమయంలో తను చేసిన సేవలు, పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు గుణాత్మక విద్యను అందించడం, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించడం,పర్యావరణం, మహిళా సాధికారిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం వంటి మొదలగు వివిధ అంశాల్లో చేసిన సేవలను గుర్తించి మహిళా సాధికారతసామాజిక సేవ అంశంలో యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ అవార్డు కు ఎంపిక చెయ్యడం సంతోషంగా ఉందని, ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆకుల రమేష్, డాక్టర్ గూడూరు చేన్నారెడ్డి, డాక్టర్ మల్లాది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు వ్యాయామం చేయించాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** పిల్లల్లో సృజనాత్మక ను వెలికి తీసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిఎస్పి శివరామరెడ్డి,లు సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని శివాజీ నగర్ సెంటర్లో ఎస్డి డాన్స్ అకాడమీని వారు ప్రారంభించి మాట్లాడారు ప్రతి కుటుంబంలో పిల్లలను ఒక గంట సేపు వ్యాయామం గాని డాన్స్ గాని నేర్పించినట్లైతే వారిలో నైపుణ్యత పెరిగి చలాకీగా ఉంటారని వారు తెలియజేశారు. డ్యాన్స్ ఉన్న పిల్లల్లో ఒత్తిడి తగ్గి, చదువులో కూడా షార్ప్ గా తయారవుతారని వారు అన్నారు. ఎస్ డి డాన్స్ అకాడమీలో వెస్టన్ క్లాసికల్ నృత్యాలు నేర్పించడం జరుగుతుందని వేసవికాలంలో పిల్లలకు నేర్పించి వారి ఉన్నత భవిష్యత్తుకు తల్లిదండ్రులు తోడ్పడాలని తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగో ని రమేష్, గౌడ్ కౌన్సిలర్ గోగుల గణేష్, టూ టౌన్ ఎస్ఐ సైదులు, ఎస్డి డాన్స్ అకాడమీ నిర్వాహకులు సాయి సుధా, సాయి, దిలీప్, దామోదర్, పూజారి ఫణి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్‌వేడుకలు



ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలో ఈస్టర్‌వేడుకలను ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. గుడ్‌ఫ్రైడేరోజు శిలువత్యాగమరణం పొందిన మహోన్నతుడైన ఏసుక్రీస్తు , మూడోరోజు ఆదివారం సజీవుడైలేచిన రోజే ఈస్టర్ పర్వదినమని ఎంబివార్కంటిన్ మెమోరియల్ చర్చి రెవరెండ్ జేబి రాజు అన్నారు. పాపుల రక్షణార్థం ఏసుక్రీస్తు శిలువమోసి తనరక్తాన్ని చిందించి లోకాన్ని శుద్ధిచేసేందుకు రక్షణగా నిలిచారన్నారు. చర్చిచైర్మన్ జోహన్న విల్సన్, వైస్‌చైర్మన్ స్టీవెన్‌సన్, సెక్రటరీ రామస్వామి, జాయింట్‌సెక్రటరీ జగదీష్, ఇజ్రాయిల్, సురేష్‌బాబు, యూత్‌సభ్యులు నేరటిరవి, జ్యోతిప్రసాద్, నందు, చింటు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల పరిధిలోని కొర్లకుంట గ్రామానికి చెందిన వి. పద్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన చికిత్స పొందాల్సి ఉంది.మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితురాలు పద్మకు కాంగ్రెస్ నాయకులు రామనందరావు, గోపాల్ నాయక్ అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వాన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వారు అన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



ప్రజాపక్షం/వెల్దండ : మండలకేంద్రం సమీపంలోని కురుమ కులదైవమైన బీరప్ప ఆలయ నిర్మాణానికి కల్వకుర్తి మార్కెట్‌కమిటి చైర్మన్ మనీలాసంజీవ్‌యాదవ్‌లు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం ఆయన నివాసంలో ఆలయ కమిటిసభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిందంకృష్ణయ్య, తంబాలుకురుమ, చిన్నవెంకటయ్య, జంగయ్య, రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కల్వకుర్తిలోని డబుల్‌బెడ్‌రూమ్ సమీపంలో నివాసముంటున్న వేణుగోపాలచారి మృతిచెందాడు. విషయం తె లుసుకున్న మాజీసర్పంచ్ జిల్లెల రాములు మృతుని కుటుంబసభ్యులకు రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుని కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, గోపినాయక్, పులిజాల చంద్రకాంత్, దున్నసురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ‘అగ్నిమాపకశాఖ’ వారోత్సవాలు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అగ్నిమాపకశాఖకేంద్రం నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో ఈనెల 14నుంచి 20వరకు వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. అగ్నిమాపకశాఖ వారోత్సవాల ముగింపుసందర్భంగా వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. సుమారు వారంరోజులపాటు అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకకేంద్రాధికారి కృష్ణమూర్తి, లీడింగ్‌ఫైర్‌మెన్స్ ఎండి.వహీదుద్దిన్, రంగస్వామి, ఎండి.ఖదీర్, శంకర్, మల్లేష్, వెంకటేశ్వరరావు, ఎండి.కైఫ్, ఆర్.సాయిబాబు, ఎం.అమరేందర్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు నేతలకు ఘనసన్మానం



ప్రజాపక్షం/కల్వకుర్తి/వెల్దండ : వెల్దండ మండలపరిధిలోని కెవిఆర్‌హోటల్ వద్ద టియూడబ్ల్యూజే ఐజెయురాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌మీటింగ్ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలలోజరిగే సమావేశానికి వెళుతున్న రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ, రాష్ట్రకార్యవర్గసభ్యులను నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్‌రెడ్డి, జర్నలిస్టునాయకులు సామ బాలయ్య, బచ్చురామకృష్ణ, కృష్ణయ్య, సూర్యశ్రీనివాస్, టివి9రవి, తంబాలుకురుమ, మల్లేష్, రాజయ్య, రామకృష్ణ, బొమ్మిశెట్టిశ్రీనివాస్, ఎర్రవల్లిశ్రీనివాస్, రాజయ్యలతోపాటు ఇతర జర్నలిస్టులు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు.

## 27న చలో వరంగల్‌సభ

ప్రజాపక్షం / కొత్తకోట: ఈ నెల 27న జరగబోయే బీఆర్‌ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా వరంగల్ లో జరిగే భారీ బహిరంగ సభ సందర్భంగా నేడు కనిమెట్ట గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసారు. కనిమెట్ట గ్రామంలో మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్ , మాజీ సీడీసీ చైర్మన్ చెన్న కేశవరెడ్డి, మాజీ సర్పంచులు ఆకుల శ్రీనివాసులు, గాదం పరమేష్ , మాజీ వైస్ ఎంపీపీలు వాకిటి బాలరాజు, గుంత మల్లేష్ ,గ్రామ అధ్యక్షులు రాంచంద్రి యాదవ్ , మాజీ వార్డు సభ్యులు సురేష్ యాదవ్ , మ్నెంకొండ, బాబు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాపరెడ్డి, కృపాకర్ రెడ్డి, సీఎం మన్నెం కొండ, శివాచారి, వాకిటి దేవన్న, నరుకులవెంకటన్న, ఆంజనేయులు నాయుడు, వాకిటి శబరీను, కురుమన్న, భరత్ , బాలస్వామి, జమ్మాలన్న, అరుణ్ దాసు రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి వృద్ధుడు మృతి

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మండలానికి చెందిన వైనమోని బిచ్చన్న గొర్రెలకు మేత తేవడానికి వెళ్లి ప్రమాద బావిలో పడి మరణించిన సంఘటన చోటు చేసుకుంది. కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్ రెడ్డి తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల ఊసెత్తరేమి?





ప్రజాపక్షం / వీపనగండ్ల : వరి కోతలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా.. మండల పరిధిలోని గ్రామాలలో వరికొనుగోలుకేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తుండటంతోభయాందోళన చెందుతున్నారు. మండలంలో పలు గ్రామాలలో బోరుబావులు, వ్యవసాయ బావులు, జూరాల , బీమా కాలువల కింద వరి పంటలు సాగు చేయడంతో గత 20 రోజుల నుంచి కోతలు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే దాన్యపు రాశులు నిండి ఉన్నాయి. పలువురు రైతులు కల్లాల వద్ద, పంట పొలాల వద్దనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. మరో పది రోజుల్లో వరి కోతలు పూర్తి కావస్తుండటంతోధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోతే ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి కూడా స్థలాలు సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుండటంతో ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి కావాల్సిన కవర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టడం, విక్రయించడానికి కావాల్సిన తేమశాతం కూడా రావడంతో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు గోదాంలకు తరలిస్తే రైతులకు కొంత ఉపశమనం కలుగుతుంది. పాలకులు, అధికారులు, ఇప్పటికైనా కష్టాలను గమనించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

## జర్నలిస్టులు గౌరవం కాపాడుకోవాలి

### మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : జర్నలిస్టులు క్రమశిక్షణతో ఉంటూ తగిన గౌరవాన్ని కాపాడుకోవాలని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్ మండలం సోమశిలలోజరిగే టియూడబ్ల్యూజే ఐజెయు రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి వెళుతుండగా నాగర్‌కర్నూల్ జిల్లాసంఘం నాయకలు ఆహ్వానం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు, అక్రిడేషన్ల మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. మారిన కాలానుగుణంగా జర్నలిస్టులు వృత్తిపరమైన శిక్షణలో మెళుకువలతోపాటుగా ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం జాతీయనాయకులు దేవులపల్లి అమర్, జిల్లానాయకులు విజయ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, మోహన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

## చదువుతో పాటు ఉపాధి అవకాశాలపై దృష్టి

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : ఉన్నత చదువులతో పాటు ఉపాధి అవకాశాలపై యువత దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నతంగా రాణిస్తారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి పట్టణం 28వ వార్డు ఆర్డీఓ కార్యాలయం సమీపంలో యువకులు నర్సింహస్వామి, శివలు ఏర్పాటు చేసుకున్న గ్రామీణ ఫుడ్స్ దుకాణ ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నన చదువులు చదివి ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే స్వయం ఉపాధిపై దృష్టి సారించి ఇలాంటి వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేఉకునే యువకుల భవిష్యత్తు బాగుంటుందని గ్రామీణ ఫుడ్స్ దుకాణం ఏర్పాటు చేసుకున్న యువకులను ఎమ్మెల్యే అభినందించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు , మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## 22న పూలే,అంబేద్కర్ జాతర



ప్రజాపక్షం/బిజినేపల్లి : ఈనెల 22న జిల్లాకేంద్రంలోని జడ్పి పాఠశాల మైదానంలో సాయంత్రం నిర్వహించే పూలే అంబేద్కర్‌జాతరను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని గౌరవఅధ్యక్షులు రాజేందర్‌గౌడ్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మాజ్యోతిరావుపూలే భారతదేశ సామాజిక రూపురేఖలుమార్చాడు అన్నారు. ఆధునిక భారతదేశ రాజ్యాంగనిర్మాత, విశ్వరత్న డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప దార్శనికుడిగా, మహామేధావిగా ప్రథమస్థానంలో నిలిచిన చారిత్రక మహనీయుల ఆశయాలసాధనలోభాగంగా అవిశ్రాంతపోరాటం చేసి అణగారినవర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయరంగాలలో, అంబేద్కర్ గొప్ప భారతీయుడైనకూడా ప్రపంచమేధావిగా గుర్తింపుపొందాడు అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉస్మానియా యూనివర్సిటి తెలుగువిభాగం ప్రొఫెసర్ ఖాసీం, రాంనర్సయ్య, వేపూరిసోమన్న, దేవేందర్, మండల అధ్యక్షులు సత్యశిలసాగర్, మస్కూరి బంగారయ్య, శాంతయ్య, సత్యనారాయణ, నర్సింహ్మా, బాలస్వామి, రామకృష్ణ, సత్యనారాయణ, భీమయ్య పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలపై అవగాహన ఉండాలి



ప్రజాపక్షం / కొత్తకోట: దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు వడ్డేవాట గ్రా మంలో జై బాపు, జై భీమ్ , జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి, మాజీ సిడిసి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి, రావుల కరుణాకర్ రెడ్డి, గోకరయ్య హాజరయ్యారు.వారు మాట్లాడుతూ రాజ్యాంగ విలువల పైప్రజల్లోఅవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజా స్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీం, జై సంవిదాన్ నినాదానికి పిలుపునిచ్చారన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాతను నిండాముంచిన అకాలవర్షం



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలంలోని ఆదివారం సాయంత్రం అకాలవర్షం ఈదురుగాలులతో ఆయా గ్రామాల్లో అకాలవర్షం అన్నదాతను నిండాముంచింది. కోతకువచ్చిన వరి పంటదెబ్బతింది. కోతలతర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వరిపంటధాన్యం తడిసింది. మామిడికాయలు నేలరాలడంతో ఆరుగాలం శ్రమించిన రైతన్నకష్టం నీటిపాలైంది. లింగసానిపల్లి , వసంతాపూర్, లట్టుపల్లి, గౌరారం, మంగనూరు, బిజినేపల్లి,పాలెం,వెంకటాపూర్ , మంగనూరు వివిధతండాల పరిసర గ్రామాల్లో కురిసిన అకాలవర్షం అన్నదాతకు తీవ్రంగా నష్టం కలిగించింది. కొన్నిచోట్ల గాలిదుమారంతో చెట్లు నేలకొరిగాయి. మంగనూరు శివారులోని మామిడి తోటల్లో వడగళ్లవలన మామిడికాయలు నేలరాలాయి. పంటపొలాలవద్ద గ్రామసమీపంలోని సిసిరోడ్లపై పంటకల్లాల్లో ఆరబెట్టుకున్న వరిధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులుపడ్డారు. వీచిన తీవ్రగాలులకు విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. మంగనూరు శివారులో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ పంటపొలాల్లో పడిపోయిందంటే గాలితీవ్రత ఇట్టే అర్థమవుతుంది. పాలెంలో పౌల్ట్రిఫారాలు ఈదురుగాలులకు విరిగిపడ్డాయి.

## ప్రజాపాలనలోనే విద్యాభివృద్ధికి పెద్దపీట

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని ఉపాధ్యాయుల ప్రమోషన్లను, ట్రాన్స్ఫర్లను చేపట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి పట్టణం కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన శ్రీరంగాపురం కాంప్లెక్ జిహెచ్ఎం విష్ణువర్ధన్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఉపాధ్యాయుల ప్రమోషన్లను ట్రాన్స్ఫర్లను పారదర్శకంగా చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేడు పదవి విరమణ పొందే విష్ణువర్ధన్ రెడ్డి సైతం జీహెచ్ఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చాకే ప్రోట్ అయ్యారని ఆయన జ్ఞాపకం చేశారు. ఈ సందర్భంగా ఆయన విష్ణువర్ధన్ రెడ్డి దంపతులను శాలువా పూలమాలలతో సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది తప్పకుండా ఉంటుందని పదవి విరమణ తర్వాత ఉన్న శేష జీవితాన్ని ప్రజా జీవితానికి అంకితం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సకల సదుపాయాలు



ప్రజాపక్షం / పాన్‌గల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పాలమూరు జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి , వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్‌లు అన్నారు. ఆదివారం పాన్‌గల్ మండల పరిధిలోని దావాజీపల్లి, మహ్మదాపురం, పాన్‌గల్ , కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, రేమద్దుల గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. తేమ శాతం 14 వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని లేకుంటే రైతులు నష్టపోతారన్నారు. రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం వారి ఖాతాలలో డబ్బులు వెంటనే జమ అయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. విండో వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పిటిసి రవి, విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి, రాము యాదవ్ , పుల్లారావు, బ్రహ్మం, విండో డైరెక్టర్లు, సిఈఓ భాస్కర్‌గౌడ్ , సిబ్బంది, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు తరలిరండి

ప్రజాపక్షం/ కొత్తకోట: కొత్తకోట మండలం ఈ నెల 27వ తేదీన జరుగు బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ బహిరంగ సభను ఉద్దేశించి కొత్తకోట మండలం పామాపురం గ్రామంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి ఇరవై అయిదు వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి దగ్గర భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకగా పండుగ వాతావరణంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్ , సిడిసి మాజీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బుస్సా రవీంద్రనాథ్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కె. వాసుదేవారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ గోవిందునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సబ్బండ జాతుల సంక్షేమమే లక్ష్యం



ప్రజాపక్షం/వెల్దండ: దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధికి నోచుకొని సబ్బండజాతుల సంక్షేమమే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.మోతిలాల్‌నాయక్ అన్నారు. ఏఐసిసి పిలుపుమేరకు మండల కాంగ్రెస్‌పార్టీఆధ్వర్యంలోఆదివారం రాచూర్ గ్రామంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణపాదయాత్ర ప్రచార కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ నాయకులు పర్వత్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, భూపతిరెడ్డిలతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూదేశంలో బిజెపి ప్రభుత్వం మత,కుల, ప్రాంత, భాష, వర్ణభేదాలతో ప్రజలనువిచ్ఛిన్నం చేసి అశాంతిని చెలరేపి అభివృద్ధిని ఆటకెక్కించారని ఆయన ఆరోపించారు. మనదేశ స్వాతంత్ర్య లక్ష్యసాధనలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి, సంక్షేమంవైపు దారులువేసేవిధంగా వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతికరంగాలను ప్రోత్సహించి అత్యాధునిక దేశంగామారిస్తే బిజెపిపార్టీమాత్రం మతంపేరిట మబ్బుల్లోకి ప్రజలను నెట్టివేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాల అమలుతీరుతోపాటు బిసికులగణన, ఎస్సి వర్గీకరణ, సామాజిక న్యాయ అంశాలతోపాటు ప్రజాకర్షణ పథకాలే ప్రచార అస్త్రాలుగా మార్చుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేసి అన్నిస్థానాలను కైవసంచేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్, యువజనకాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, మాజీసర్పంచ్ యాదయ్య, రాములుయాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఎర్రశ్రీను, ముదిగొండరమేష్, రాణి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాపక్షం / పెబ్బేరు : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్లగా.. కృష్ణానది తీర ప్రాంతం నుండి నాలుగు ఇసుక ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఈర్లదిన్నె గ్రామంలో గస్తీ తిరుగుతున్న పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా కేసు నమోదు చేసినట్టు సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

## గుండెపోటుతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

ప్రజాపక్షం / పాన్‌గల్ : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నగోప్లాపూర్‌కు చెందిన గందం చిన్న రాములు ఆదివారంగుండెపోటుతోమృతిచెందారు.కాలకృత్యాలు అనంతరం స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్తుండగామార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. భార్య జ్యోతి, ఒక కూతురు ఉన్నారు.

## ఈదురు గాలుల బీభత్సం

### రాలిన మామిడికాయాలు



ప్రజాపక్షం / వీపనగండ్ల : ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలులు రావడంతో మామిడి, వరి రైతులకు ఆపార నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు మామిడికాయాలు రాలిపోవడం, కోతకు సిద్దంగా ఉన్న వరి పంటలు ఈదుగు గాలుల వల్ల పంట పొలాలను వంగిపోవడంతో కోతకు ఇబ్బందిగా మారిందని, రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలలో పలుచోట్ల టెట్లు నెలకొరిగాయి. ఇప్పటికే హైదరాబాద్ మార్కెట్ లో మామిడి కాయాలకు అంతగా ధర లేకపోవడంతో ఈదురుగాలవల్ల నేలరాలిన మామిడి కాయలను ఎవరు కొంటారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఆరోగ్యం

## ఫోకస్

### హైపో అండ్ హైపర్..

థైరాయిడ్ తగినంత హార్మోన్లను తయారు చేయకపోవడాన్ని హైపోథైరాయిడిజం అంటారు. ఇది మన శరీరం యొక్క శక్తి స్థాయిలు పడిపోవడం, మనం అలసిపోయినట్లు ఎక్కువ తినకుండా బరువు పెరగడం వంటిది.

### హైపర్ థైరాయిడిజం:




హైపర్ థైరాయిడిజం దీనికి విరుద్ధంగా ఉంటుంది. ఇది థైరాయిడ్ చాలా హార్మోన్లను ఉత్పత్తి చేసినప్పుడు. ఇది మనల్ని అశాంతిగా, వణుకుతున్నట్లుగా కొన్నిసార్లు ప్రయత్నించకుండానే బరువు తగ్గేలా చేస్తుంది. కాబట్టి, రెండూ మీ శరీరం యొక్క శక్తి స్థాయిలతో గందరగోళానికి గురవుతాయి, కానీ వ్యతిరేక మార్గాల్లో. సరైన రోగ నిర్ధారణ చికిత్స కోసం వైద్యుడిని సంప్రదించడం కీలకం.

## తినవలసిన ఆహారాలు

**అయోడిన్ అధికంగా ఉండే ఆహారాలు:**

మీ ఆహారంలో అయోడైజ్డ్ ఉప్పు, సీఫుడ్ (చేపలు, రొయ్యలు సీవీడ్ వంటివి), పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు చీజ్ వంటివి) గుడ్లు చేర్చండి. థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి అయోడిన్ కీలకం.

**సెలీనియం అధికంగా ఉండే ఆహారాలు:**

బ్రెజిల్ గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, జీవరాశి, చికెన్ గుడ్లు వంటి సెలీనియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోండి. సెలీనియం థైరాయిడ్ హార్మోన్ జీవక్రియను నియంత్రించడంలో సహాయపడుతుంది. వాపును తగ్గిస్తుంది.

**ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు:**

కొవ్వు చేపలు (సాల్మన్, మాకేరెల్, సార్డినెస్), అవిసె గింజలు, వంటి ఒమేగా3 కొవ్వు ఆమ్లాల మూలాలను చేర్చండి. చియా విత్తనాలు, అక్రోట్లను. ఒమేగా3లు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి థైరాయిడ్ పరిస్థితులు ఉన్న వ్యక్తులకు ప్రయోజనం చేకూరుస్తాయి.

**పండ్లు కూరగాయలు:**

మొత్తం ఆరోగ్యం రోగనిరోధక పనితీరుకు తోడ్పడే యాంటీఆక్సిడెంట్లు, పోషకాలను అందించడానికి వివిధ రకాల రంగురంగుల పండ్లు కూరగాయలను లక్ష్యంగా చేసుకోండి. ఉదాహరణలు బెర్రీలు, నారింజ, క్యారెట్లు, బచ్చలికూర, బెల్ పెప్పర్స్.

**లీన్ ప్రోటీన్లు:**

పౌల్ట్రీ, గొడ్డు మాంసం లేదా పంది మాంసం యొక్క లీన్ కట్స్, టోఫు, చిక్కుళ్ళు కాయధాన్యాలు వంటి ప్రోటీన్ యొక్క లీన్ మూలాలను మీ భోజనంలో చేర్చండి. థైరాయిడ్ హార్మోన్ సంశ్లేషణ జీవక్రియకు ప్రోటీన్ అవసరం.

**తృణధాన్యాలు:**

క్వినోవా, బ్రౌన్ రైస్, ఓట్స్ హోల్ వీట్ బ్రెడ్ లేదా పాస్తా వంటి తృణధాన్యాలను ఎంచుకోండి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో సహాయపడేటప్పుడు ఫైబర్ అవసరమైన పోషకాలను అందిస్తాయి.

**ఆరోగ్యకరమైన కొవ్వులు:**

అవోకాడోస్, ఆలివ్ ఆయిల్, గింజలు గింజలు వంటి ఆరోగ్యకరమైన కొవ్వుల మూలాలను మీ ఆహారంలో చేర్చుకోండి. ఈ కొవ్వులు హార్మోన్ ఉత్పత్తికి కొవ్వులో కరిగే విటమిన్ల శోషణకు తోడ్పడతాయి.




## థైరాయిడ్‌పై ఆహార ప్రభావం!



ఇటీవల కాలంలో అత్యధిక శాతం మంది ఎదుర్కొంటున్న సమస్య థైరాయిడ్. మనిషిని అనేక రకాలుగా వేధించే ఈ సమస్య మహిళల్లో ఎక్కువ. మనం తీసుకునే ఆహారం కూడా థైరాయిడ్‌పై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. కాబట్టి, ఆహార అలవాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. థైరాయిడ్ ఆరోగ్యాన్ని నిర్వహించడంలో ఆహారం పాత్ర పోషిస్తుంది.

**అయోడిన్ :**

థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి అయోడిన్ అవసరం. అయోడిన్ లోపం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, అయోడైజ్డ్ ఉప్పు, సీఫుడ్ పాల ఉత్పత్తులు సీవీడ్ వంటి అయోడిన్ రిచ్ ఫుడ్స్ తగినంతగా తీసుకోవడం థైరాయిడ్ పనితీరుకు తోడ్పడుతుంది. అయినప్పటికీ, అధిక అయోడిన్ తీసుకోవడం కూడా సమస్యాత్మకంగా ఉంటుంది, ప్రత్యేకించి కొన్ని థైరాయిడ్ పరిస్థితులు ఉన్నవారికి.

**సెలీనియం :**

సెలీనియం థైరాయిడ్ ఆరోగ్యానికి మరొక ముఖ్యమైన ఖనిజం, ఇది థైరాయిడ్ హార్మోన్ సంశ్లేషణ జీవక్రియను నియంత్రించడంలో సహాయపడుతుంది. సెలీనియం అధికంగా ఉండే ఆహారాలలో బ్రెజిల్ నట్స్, సీఫుడ్ పౌల్ట్రీ, ఉన్నాయి గుడ్లు.

**గోయిట్రోజెన్లు :**

కొన్ని ఆహారాలలో గోయిట్రోజెన్ అని పిలువబడే సమ్మేళనాలు ఉంటాయి, ఇవి అయోడిన్ తీసుకోవడం లేదా థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని నిరోధించడం ద్వారా థైరాయిడ్ పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి. గోయిట్రోజెనిక్ ఆహారాలకు ఉదాహరణలు బ్రోకలీ, క్యాబేజీ కాలే వంటి క్రూసిఫెరస్ కూరగాయలు. ఈ ఆహారాలు ఆరోగ్యకరమైనవి పూర్తిగా దూరంగా ఉండకూడదు, వాటిని ఉడికించడం లేదా ఆవిరి చేయడం వల్ల వాటి గోయిట్రోజెనిక్ ప్రభావాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

**గ్లూటెన్ :**

గ్లూటెన్ సెన్సిటివిటీ లేదా ఉదరకుహర వ్యాధి హషిమోటోస్ థైరాయిడిటిస్ వంటి ఆటో ఇమ్యూన్ థైరాయిడ్ పరిస్థితులతో ముడిపడి ఉండవచ్చని సూచించడానికి కొన్ని ఆధారాలు ఉన్నాయి. థైరాయిడ్ ఆటో ఇమ్యూన్ డిజార్డర్స్ ఉన్న వ్యక్తులకు, గ్లూటెన్‌ఫ్రీ డైట్ తీసుకోవడం వల్ల మంటను తగ్గించి, లక్షణాలను మెరుగుపరచడంలో సహాయపడవచ్చు.

**సోయా :**

సోయా ఉత్పత్తులలో ఫైటో ఈస్ట్రోజెన్‌లు అనే సమ్మేళనాలు ఉంటాయి, ఇవి కొంతమంది వ్యక్తులలో థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి శోషణకు ఆటంకం కలిగిస్తాయి. మితమైన సోయా వినియోగం సాధారణంగా చాలా మందికి సురక్షితంగా పరిగణించబడుతున్నప్పటికీ, థైరాయిడ్ పరిస్థితులు ఉన్నవారు వారి తీసుకోవడం పరిమితం చేయడానికి లేదా వారి లక్షణాలను పర్యవేక్షించడానికి ఎంచుకోవచ్చు.


**సమతుల్య ఆహారం :**

మొత్తంమీద, థైరాయిడ్ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి సమతుల్య పోషకమైన ఆహారాన్ని నిర్వహించడం చాలా కీలకం. అవసరమైన పోషకాలను అందించడానికి, మొత్తం శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడానికి వివిధ రకాల పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, తృణధాన్యాలు ఆరోగ్యకరమైన కొవ్వులను తీసుకోవడం ఇందులో ఉంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- స్థూలంగా చెప్పాలంటే, థైరాయిడ్ ఆరోగ్యం మధ్య సంక్లిష్ట సంబంధాన్ని అర్థం చేసుకోవడం మొత్తం శ్రేయస్సును సాధించడానికి కీలకం. మీరు తినే ఆహారాల గురించి జాగ్రత్త వహించడం ద్వారా, ముఖ్యంగా థైరాయిడ్ పనితీరుకు అంతరాయం కలిగించే ఆహారాలు, మీ ఆరోగ్య ప్రయాణాన్ని నియంత్రించడానికి మిమ్మల్ని మీరు శక్తివంతం చేసుకోండి.
- సోయా, క్రూసిఫెరస్ కూరగాయలు గ్లూటెన్ వంటి కొన్ని ఆహారాలు థైరాయిడ్ జోక్యంతో సంబంధం కలిగి ఉన్నప్పటికీ, సమతుల్యత నియంత్రణతో ఆహార మార్పులను చేరుకోవడం చాలా ముఖ్యం. క్రూసిఫెరస్ కూరగాయలను వండడం మొత్తం, కనిష్టంగా ప్రాసెస్ చేయబడిన ఆహారాలను ఎంచుకోవడం వలన వాటి సంభావ్య ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, మీ అయోడిన్ తీసుకోవడం నిర్వహించడం కెఫిన్ ఆల్కహాల్ వినియోగంతో జాగ్రత్తగా ఉండటం థైరాయిడ్‌ను శ్రావ్యంగా నిర్వహించడానికి దోహదం చేస్తుంది.
- గుర్తుంచుకోండి, ఈ ఆహారాలకు వ్యక్తిగత ప్రతిస్పందనలు మారుతూ ఉంటాయి మీ ప్రత్యేక అవసరాలకు సరిపోయే మీ థైరాయిడ్ ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే ఆహారాన్ని పండించడం చాలా ముఖ్యమైనది. రెగ్యులర్‌తో ఈ ఆహార పరిగణనలను జత చేయడం వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ, స్థిరమైన వైద్య మార్గదర్శకత్వం వెల్‌నెస్‌కు సంపూర్ణ విధానానికి దారి తీస్తుంది.
- అంతిమంగా, జ్ఞానమే శక్తి, మీ ఆహార ఎంపికలు మీ థైరాయిడ్‌ను ఎలా ప్రభావితం చేస్తాయనే దాని గురించి తెలియజేయడం ద్వారా, మీరు ఆరోగ్యకరమైన, మరింత శక్తివంతమైన జీవితాన్ని పెంపొందించే దిశగా చురుకైన అడుగు వేస్తున్నారు. మీరు సరైన థైరాయిడ్ ఆరోగ్యానికి మీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నప్పుడు, మీ ఎంపికలు వివేకం శాశ్వత జీవశక్తి సాధన ద్వారా మార్గనిర్దేశం చేయబడతాయి.

## నోటి అపరిశుభ్రతతో పలు రుగ్మతలు




ప్రపంచవ్యాప్తంగా 3.5 బిలియన్ల ప్రజలు నోటి సంబంధ అనారోగ్యాలతో సతమతం అవుతున్నారని, దంత సమస్యలు ప్రధానమైనవి తెలుస్తున్నది. నేటి ఆధునిక మానవ జీవితంలో నోటి శుభ్రతకు ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోతున్నది. తీవ్రమైన నోటి అపరిశుభ్రత కారణంగా గుండె జబ్బులు, మధుమేహం, శ్వాస సంబంధ వ్యాధులు కలుగుతున్నాయి. దంతాలు, చిగుర్ల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రజలకు అవసరమైన సరళ జీవనశైలి మార్పుల గూర్చి అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 20 మార్చి రోజున ప్రపంచ నోటి ఆరోగ్య లేదా శుభ్రత దినం (వరల్ ఓరల్ హెల్త్ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ నోటి శుభ్రత దినం ఇతివృత్తంగా ఆనందమయ నోటి శుభ్రతతో సంతోషకరమైన మెదడు (ఏ హ్యాపీ మౌత్ ఈజ్& ఏ హ్యాపీ మైండ్) అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నోటి శుభ్రతను అశ్రద్ధ చేసినపుడు చిగుర్ల వ్యాధులు, క్యావిటీలు ఏర్పడడం, దంతాలు ఊడిపోవడం జరగడంతో నోటి దుర్వాసన వల్ల నవ్వుతూ మాట్లాడకపోవడం, సమాజంలో భయంతో గడపడం, ఆత్మవిశ్వాసం తగ్గడం, మానసిక ఆరోగ్యానికి అడ్డుపడడం జరుగుతుంది. నోటి అనారోగ్యాలు దీర్ఘకాలం కొనసాగితే ఆందోళన, ఒత్తిడి కలుగుతూ జీవన నాణ్యత కొరవడడం జరుగుతుంది. నోటి ఆరోగ్యంతో దంత వ్యాధుల కట్టడి, గుండె బ్బులు/మధుమేహం/శ్వాస వ్యాధుల కట్టడి, జీర్ణ క్రియ పెరగడం లాంటి విలువైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. నోటి శుభ్రత కోసం ప్రతి రోజు రెండు సార్లు బ్రష్ చేసుకోవడం, దంతాల్లో ఆహారం ఇరుక్కోకుండా జాగ్రత్త పడడం, తిన్నపుడు లేదా తాగినపుడు మౌత్ వాష్ చేసుకోవడం, చక్కెరలు/ఆమ్ల ఆహారాలను తగ్గించుకోవడం, సాఫ్ట్ బ్రష్‌లను వాడడం, సదా హైడ్రేట్ కావడం, తరుచుగా దంత వైద్యులను సంప్రదించడా లాంటి దినచర్యను పాటించాలి. ఈ విషయాల గూర్చి ఇతరులకు అవగాహన కల్పించడం వల్ల నోటి ఆరోగ్య భాగ్యాలు సిద్ధించి చిరునవ్వులతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## కమ్యూనిస్టులకు అండగా నిలవండి

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రశ్నించే గొంతుకగా... ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలను పోరాటాలను చేస్తున్న కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలవాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి కోరారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామ సిపిఐ శాఖ మహాసభ కోరపల్లి జ్యోతి అధ్యక్షతన జరిగింది. మహాసభకు బిక్షపతి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి ప్రశ్నించే గొంతుకలను, మేధావులను, కమ్యూనిస్టులను, ప్రజలనుండి దూరం చేయాలని కుట్ర చేస్తున్నదన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుటకు ప్రజలను చైతన్యం చేయుటకు కమ్యూనిస్టులు నిరంతరం శ్రమిస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను వేగవంతంగా అమలు చేసి పేదలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మడికొండ డంపింగ్ యార్డ్ వల్ల చెత్తాచెదారం ఎక్కువై కాజీపేట ప్రాంతంలో కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, అనారోగ్య సమస్యలు ఎక్కువ అవుతూ ప్రజలు అనేక ఇబ్బందులు పాలవుతున్నారని, ప్రజలు అధికారులకు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే పరిష్కారం చేయని యెడల డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మడికొండ సిపిఐ శాఖ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునగాల బిక్షపతి, నాయకులు మాలోత్ శంకర్‌నాయక్, రాసమల్ల దీన, వేల్పుల సారంగపాణి, కొట్టేపాక రవి, నేదునూరి వెంకటరాజం, కోరపెల్లి రమా, మాధవి, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో తరగతి ఉద్యోగులుగా సివిల్ సప్లయ్ హమాలీలు

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్ డిమాండ్




**ప్రజాపక్షం/నర్సంపేట :** సివిల్ సప్లయ్ హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీలకు ఇఎస్ఐ అమలు చేసి, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సహజ మరణం చెందితే రూ.30వేలు ఇవ్వాలన్నారు. మే11న వరంగల్ ఎనమాముల మార్కెట్ గోదాములో నిర్వహించే స్టేట్ సివిల్ సప్లై హమాలీ యూనియన్ వరంగల్ జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, రవి, కిషోర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు






విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచటానికే మోడల్ ఎంసెట్

ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేత బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** సమాజంలో పోటీ పెరుగుతుందని, పోటీకి తగినట్లుగా విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బాగం హేమంతరావు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న మానసిక స్థైర్యాన్ని పెంపొందించటానికే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎంసెట్ పరీక్ష ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో స్థానిక డాక్టర్స్ అకాడమీలో మోడల్ ఎంసెట్, నీట్ ఇంజనీరింగ్ ప్రశ్నాపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తేనే గుర్తింపు సాధ్యమన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల ఒక అవగాహన వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఉండేందుకు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గత 26 ఏళ్లుగా మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ విద్యార్థులకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు సమయం వృథాకాకుండా పరీక్ష ఎలా రాయా లో అవగతం అవుతుందన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పోటీ పరీక్షలు రాయాలని ఆయన తెలిపారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ఒత్తిడిని తట్టుకుని విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్స్ అకాడమీ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు నాగుల మీరా, శివనాయక్, జిల్లా నాయకులు ఉస్మాన్, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ అభివృద్ధికి గత ప్రభుత్వం నిర్లక్ష్యం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ అభివృద్ధిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా సిపిఐ జిల్లా సమితి సమావేశం దండు లక్ష్మణ్ అధ్యక్షతన వరంగల్ శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడంలో గత ప్రభుత్వం తీవ్రవివక్షత ప్రదర్శించిందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేపట్టలేదని, పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తామని చెప్పి చేయలేదన్నా రు. గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వలేదని, పేదల కు డబుల్ బెడ్ రూం ఇండ్లు అందించలేదన్నారు. జిల్లాలో రైతాంగానికి సాగునీరు అందించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను నిర్లక్ష్యం చేసి టెక్స్‌టైల్ పార్క్‌ను పూర్తి చేయలేదని, కంతనపల్లి ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సస్యశ్యామలం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కంతనపల్లిని చేపట్టాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేష్, జిల్లా సహాయకార్యదర్శులు ఎస్‌కె భాషామియా, పనాస ప్రసాద్, పార్టీ జిల్లా నాయకులు తోట చంద్రకళ, బుస్సా రవి, గన్నారపు రమేష్, సంగి ఎలెందర్, గుడే భద్రి, అక్కపల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వరుడు, కందిక చెన్న కేశవులు, వీరగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


## కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్రం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భిక్షపతి

**ప్రజాపక్షం/తొర్రూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఓమ భిక్షపతి పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ తొర్రూరు డివిజన్ జాయింట్ సమావేశాన్ని పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ మహబూబాబాద్‌లోని జగన్నాథం భవన్‌లో కార్మిక సంఘాల ఐక్య జిల్లా సదస్సు జరగనుందని చెప్పారు. ఈ సదస్సుకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి అన్ని వర్గాల కార్మికులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సదస్సుకు సంఘాల రాష్ట్ర బాధ్యులు ముఖ్య వక్తలుగా వస్తారని చెప్పారు. నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలన్నారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాక సదస్సుకు కార్మిక వర్గం అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి జమ్ముల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఘనపురం లక్ష్మణ్, టియుసిఐ తొర్రూరు ఏరియా కమిటీ అధ్యక్షులు శ్రీరాం పుల్లయ్య, వెంకన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.




## బిజెపి కార్పొరేట్ విధానాలపై పోరాటం




ఉమ్మడి కార్మికసంఘాల సమావేశంలో ఎఐటియుసి నేతలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాలపై కార్మిక సంఘాలు పోరాటం చేయాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో సిఐటియు కార్యాలయంలో ఉమ్మడి కార్మికసంఘం ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సమావేశం ఆదివారం ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44కార్మిక చట్టాలను కాపాడుకునే వరకు కార్మికసంఘాలు సంఘటితంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు తాతయ్య, సత్యం, శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి బి.పర్వతాలు, ఈశ్వర్, దశరథం, శంకర్‌నాయక్, అశోక్, పొదిల రామయ్య, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.




**హనుమకొండ టౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తుందని ఆ విధానాలపై పోరాటం చేయాలని కార్మిక సంఘాల జిల్లా సమావేశం తీర్మానించింది. రామనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జక్కుల రాజు గౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు నున్న అప్పారావు, ఎఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ రావు, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్యాంసుందర్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు మైముదాలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు మే 20న కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య, కార్మిక సంఘాల నాయకులు పుల్ల అశోక్, ఎన్.రజిత, గుంటి రాజేందర్, ఆర్.కుమార్, మంద మల్లేశం, డి.భాను నాయక్, ఆర్.దుర్గాప్రసాద్,ఎ.మల్లయ్య ఆర్.వంశీ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని బిఆర్ఎస్ యువనేత వై.మురళీకృష్ణ యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మల్లన్న స్వామికి కల్యాణం నిర్వహించారు. మండల కేంద్రంలోని గాడిబావి నుంచి మహిళలు బోనాలతో మండల కేంద్రం శివారులో ఉన్న మల్లన్న స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. దేవాలయం వద్ద మహిళలు బోనాలతో ప్రదక్షిణలు చేసి, స్వామి వారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మురళీ యాదవ్ మాట్లాడుతూ మల్లన్న స్వామి చల్లగా చూడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో రాజేష్ పటేల్, తాండ్ర ప్రేమ్‌కుమార్, దయ్యాల శ్రీశైలం, చెన్నయ్య, శ్రీశైలం, రమేష్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సేవలు మరువలేం

### అఫ్జల్ అలీ సంస్మరణ సభలో పలువురు వక్తలు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దివ్యాంగుల జీవితాల్లో స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం నింపేందుకు అఫ్జల్ అలీ చేసిన సేవలు మరువలేమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో డిఫెరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముక్కు నర్సయ్య అధ్యక్షతన అఫ్జల్ అలీ సంస్మరణ సభ నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబీబ్ మియా, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్. లక్ష్మయ్య, బొల్లం మహేందర్, ఎం.సుబ్రహ్మణ్యం, ఎన్.క్రిష్ణకుమార్, ఎంఐఎం నేత మహ్మద్ అమీనుద్దీన్ హాజరై, మాట్లాడారు. దివ్యాంగులకు బైకులు, కార్లను ఆల్టరేషన్ చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి అఫ్జల్ అలీ అని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పురస్కారాలతో సత్కరించాయని తెలిపారు. సమావేశంలో అఫ్జల్ అలీ సతీమణి సయ్యద్ ముజఫర్ సుల్తానా, కుమారుడు వాజిద్ అలీ, కూతుళ్లు సానియా అఫ్జల్, సనా అఫ్జల్, సోదరీ,సోదరులు జరీనా బేగం,జాందార్ అలీ, జబీర్ అలీ పాల్గొన్నారు.

## కామర్స్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు శిక్షణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కామర్స్ రంగంలో డిగ్రీ పూర్తి చేసుకొన్న విద్యార్థులకు దేశంలో ఇప్పటివరకు లేనివిధంగా నూతన ఒరవడితో 'ఫైనాన్స్ అకౌంట్‌ఎక్స్‌ఫర్ట్ అండ్ ప్రో' అనే పేరిట శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఫ్రెషర్ ప్లాట్‌ఫార్మ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ సయ్యద్ ముకరం తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కామర్స్ డిగ్రీ పూర్తి చేసిన సి, బి, బి ప్లస్ గ్రేడ్‌ల విద్యార్థులకు రోజుకు 5 గంటల చొప్పున పది రోజుల పాటు శిక్షణ అందిస్తామని తెలిపారు. అనంతరం ఉద్యోగావకాశాలు వారే సొంతంగా పొందేలా విద్యార్థులను తయారు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కోర్సులో చేరే ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్‌సైట్ www.fresherplatformglobal.comను సంప్రదించాలని తెలిపారు.

## క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి

### తెలంగాణ క్రిస్టియన్ జెఎసి రాష్ట్ర చైర్మన్ రవికుమార్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారంతో పాటు వారికి సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేయాలని తెలంగాణ క్రిస్టియన్ జెఎసి రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఈస్టర్ పండుగ పురస్కరించుకొని నగరంలోని బేతేలు ప్రార్థన మందిరానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. లోకానికి వెలుగై ఉన్న ప్రభువు ఏసు క్రీస్తు నిజమైన రక్షకుడు అని, ఆయన పట్ల విశ్వాసం ఉంచిన వారు రక్షింపబడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సులేమాన్ థామస్ జాన్సన్, మహేశ్ తిమోతి, విశాల్, ప్రీతి, స్వప్న, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


## రైతులు, సైనికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

### బిజెకెపి జాతీయ అధ్యక్షుడు నారాయణ ప్రభాకర్ అంకుష్



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాష్ట్రంలో భారతీయ జవాన్ కిసాన్ పార్టీ (బిజెకెపి) బలోపేతానికి కృషిచేయాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారాయణ ప్రభాకర్ అంకుష్ పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బిజెకెపి రాష్ట్ర అధ్యక్షులు గండే సురేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన హాజరై, మాట్లాడారు. రైతులు, సైనికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. తాము ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, సమాజంలో జరుగుతున్న అన్యాయం, దోపిడీ, అక్రమాలపై బిజెకెపి రాజీలేని పోరాటం చేస్తున్నదన్నారు. సైనికులు, రైతన్నలు ఏకమై సుస్థిర పాలనకు అడుగులు వేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ జాతీయ సమన్వయకర్త సుదర్శి మోహన్‌రావు, బిజెకెపి జాతీయ అధికార ప్రతినిధి జగ్‌బీర్ సింగ్, విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు టి. రమేశ్, తెలంగాణ స్టేట్ కో–ఆర్డినేటర్ సత్యప్రసాద్, ఎపి రాష్ట్ర అధ్యక్షులు కొండ్రు రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



**ప్రజాపక్షం/గండిపేట :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడలో మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఈ కళ్యాణ మహోత్సవ కార్యాక్రమాల్లో శివసతుల పూనకాలు, ఒగ్గు కళాకారుల డోలు, తాళాలు నృత్యాల మధ్య అంగరంగ వైభవంగా కల్యాణ వేడుకలు జరుపుకున్నారు. వేడుకలలోకురుమలతో పాటు కులాలకు అతీతంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున మల్లికార్జున కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుమ సంగం అధ్యక్షుడు ఎగే మల్లేశం, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కార్పొరేటర్లు సంగీత గౌరీ శంకర్,అర్చన జయప్రకాష్,తోకల శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తుమ్మకుంట అరుణ్ కుమార్,స్థానిక కురుమ సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం 'చందుల్ల ఎల్లమ్మ'

### పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ కోదండరామ్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మట్టిలో మాణిక్యమైన కథలను నేటి సమకాలీన చర్చల్లోకి తీసుకురావడం ఎంతో అవసరమని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో చందుల్ల ఎల్లమ్మ పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ, కోదండరామ్‌తోపాటు తెలంగాణ సాంస్కృతిక శాఖ రాష్ట్ర సంచాలకులు మామిడి హరికృష్ణ హాజరయ్యారు. ఎమ్మెల్సీ, కోదండరామ్ మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు నేటితరం చదువాలని సూచించారు. తెలంగాణ జానపద సంప్రదాయాల కులచరిత్రల, కుటుంబ అనుబంధాల శక్తిమంతమైన ప్రతిబింబంగా ఈ పుస్తకం నిలుస్తున్నదని పేర్కొన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ఈ పుస్తకంలోని మూల రచనతోపాటు అనువాదాన్ని అభినందించారు. తెలంగాణ సాహితీ, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించే ప్రాముఖ్యతను వివరించారు. మహిళా వర్సిటీ విసి ప్రొఫెసర్ సూర్య ధనంజయ మాట్లాడుతూ మాతృరచనను కూతురు అనువదించడం తరతరాల మేధస్సుల మధ్య ఏర్పడే మానసిక వారసత్వానికి అపూర్వ నివాళి అని అభివరించారు. చందుల్ల ఎల్లమ్మ పుస్తకాన్ని డా.కె.ముత్యం రచించగా, ఆయన కుమార్తె కె.ప్రత్యూష యామిని ఆంగ్లంలోకి అనువదించారు. ఈసందర్భంగా చిందు యక్షగానం ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకొన్నది. కార్యక్రమంలో



ఒయు ఆర్ట్స్ కాలేజీ మాజీ అధిపతి తుల రాజేందర్, ఒయు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు పట్టెళ్ల శశిధర్‌రెడ్డి, కాకతీయ వర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ సయ్యన్న, పలువురు సాహితీ ప్రియులు, రచయితలు పాల్గొన్నారు.

## మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు

### వాల్యూ గోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ చందా

**ప్రజాపక్షం/గండిపేట :** తాకట్టు పెట్టిన బంగారం విడిపించి, మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు చేస్తామని వాల్యూ గోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ చందా అన్నారు. ఆదివారం మణికొండలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్యూ గోల్డ్ 6వ శాఖను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ చందా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1901 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రారంభమైన కాప్స్ గోల్డ్ కి చెందిన వాల్యూ గోల్డ్ ఆరవ శాఖను మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగూడ లో ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అభిషేక్ చందా చెప్పారు. ఈనెల 23న తమ వాల్యూగోల్డ్ ఏడవ శాఖను ఏ.ఎస్.రావునగర్‌లో ప్రారంభించనునట్లు ఆయన తెలిపారు. మరో 3,4 బ్రాంచ్‌లు రాబోయే కొద్ది నెలల్లో ప్రారంభం కానున్నాయన్నారు. అత్యవసరానికి, పిల్లల ఉన్నత విద్యకు, వ్యాపారం, ఆరోగ్య అవసరాల కొరకు బంగారం ఒక అద్భుతమైన ఆస్థి అని, అలాంటి బంగారాన్ని అవసరానికి సరియైన ధరలో అమ్ముకోవడానికి వాల్యూ గోల్డ్ మంచి వేదిక అన్నారు. వాల్యూ గోల్డ్‌లో బంగారం మార్పిడి ప్రక్రియ అనేది ఎటువంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. కస్టమర్ తమ బంగారాన్ని తీసుకువచ్చి స్వచ్ఛత కోసం పరీక్షించిన తర్వాత వారి ఖాతాలోకి తక్షణమే నగదు బదిలీ చేస్తామన్నారు. తాకట్టు పెట్టిన బంగారంకు సంబంధించి పత్రాలను పరీక్ష చేసి, భౌతికంగా ధృవీకరించిన తర్వాత తాకట్టు పెట్టిన బంగారం తక్షణమే విడుదల చేస్తామని, అనంతరం మార్కెట్ విలువ ప్రకారం మొత్తం నగదు బదిలీ చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## పార్టీ బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** బిజెపి అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బోసుపల్లి ప్రతాప్ హాజరై మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి వచ్చే మూడు రోజుల్లో గావ్ చలో బస్తి చలో కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీలో ప్రతిబస్తీకి వెళ్లి బిజెపి 10 ఏళ్ల పాలన గురించి బస్తి వాసులకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్, బిజెపి రాష్ట్ర ఎస్.సి మోర్చా కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్, రాష్ట్ర ఎస్ సి మోర్చా కార్యదర్శి కొండ్రు పురుషోత్తం, మున్సిపల్ మాజీ అధ్యక్షులు తూళ్ల నరసింహా గౌడ్, బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ సనేం అర్జున్ గౌడ్, కందాల బల్దేవ్ రెడ్డి, నోముల కార్తిక్ గౌడ్, పలుసా శ్రవణ్ గౌడ్, కరాడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

### డిసిపి రష్మిపెరుమాళ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలకు నియంత్రించాలంటే.. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని నార్త్‌జోన్ డిసిపి ఎస్.రష్మి పెరుమాళ్ సూచించారు. సికింద్రాబాద్‌లోని ఎంఎస్‌బి విద్యా సంస్థ(ఇస్లామిక్ విద్యాసంస్థ)లో ఆదివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ సైబర్ భద్రత, మాదక ద్రవ్య దుర్వినియోగం సమాజానికి చీడపురుగుగా మారిందన్నారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను విద్యార్థులకు కూలంకశంగా వివరించారు. అలాంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ వీడియోలు, ఫోటోలను షేర్ చేయకూడదని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తొమ్మిద తరగతి నుంచి 12 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ క్రైంపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు డిసిపి రష్మి పెరుమాళ్ సమాధానాలు చెప్పా రు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు చైతన్యవంతం కావడంతో పాటు నేరాలు తగ్గుతాయని రష్మి అభిప్రాయపడ్డారు.

## అవయవ మార్పిడీలో అపోహలు వద్దు

**ప్రజాపక్ష/హైదరాబాద్:** ఎటువంటి అపోహలను పెట్టుకోకుండా అవయవ మార్పిడీకి ముందుకు రావాలని, తద్వారా కొత్త జీవితాన్ని ఇచ్చిన వారవుతామని యశోద ఆస్పత్రి సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి సూచించారు. ఫౌండేషన్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్స్, కేర్ ఫర్ యువర్ కిడ్నీ ఫౌండేషన్, కిడ్నీ వారియర్స్ ఫౌండేషన్ సహకారంతో యశోధ ఆస్పత్రి ఆదివారం కిడ్నీ మార్పిడీ చేసుకున్న పేషెంట్లతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ మార్పిడిపై అవగాహన కల్పించారు. అవయవ మార్పిడీకి సిద్ధమైన రోగులలో ధైర్యం నింపేందుకే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు డాక్టర్ రాజశేఖర చక్రవర్తి ఆయన తెలిపారు. కిడ్నీ మార్పిడీ చేసుకున్న తరువాత వారి జీవనశైలి ఎలా ఉంటుంది?,ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు వారు అనుభవించిన అనారోగ్య సమస్యలు, అవయవ మార్పిడీ తరువాత వారు అనుభవిస్తున్న మెరుగైన జీవన విధానం ఎలా ఉంటుందనే అంశాలపై ఆయన వివరించారు. దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల భారం పెరుగుతోందని, ప్రతి ఏటా 5 లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు డయాలసిస్ దశకు చేరుకుంటున్నారని చక్రవర్తి తెలిపారు. వీరిలో కేవలం ఇరవై వేల మంది రోగులకు మాత్రమే కిడ్నీ మార్పిడీ జరుగుతుందని, మిగిలిన వారు డయాలసిస్‌లో




ఉండి, మార్పిడీ కోసం వేచి ఉంటున్నారని వివరించారు. తెలుగు రాష్ట్రాలలో జనాభాలో 20 శాతం కంటే ఎక్కువ మందిలో సికెడి క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రాబల్యం పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని వివరించారు. యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి.ఎస్‌రావు మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్‌లో అధునాతన సాంకేతికత, నిపుణులైన బహుళ వైద్య విభాగలు ఉన్నాయన్నారు.

## దాహం తీర్చడం మానవతా ధర్మం

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజల నీటిదాహం తీర్చడమే మానవతా ధర్మమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బీఆర్ఎస్ నాయకులు కొండ మల్లేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పి వైస్ చైర్మెన్ ఈట గణేష్, మున్సిపల్ మాజీ చైర్మెన్ నరేందర్, మాజీ వైస్ చైర్మెన్ నటరాజ్, నాయకులు కె శ్రీనివాస్ గౌడ్, కె అనంతయ్య, సి జంగయ్య, ఆర్ అంజనేయులు, ఎం శ్రీశైలం, పి మల్లేష్, జె సుధాకర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు



## 'సేవా హి సంకల్ప్' ఆర్‌పిఎఫ్ లక్ష్యం

### డిఐజి ఎస్ఎస్ అహ్మద్

### నేడు జాతీయ పౌర సేవా దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైల్వే ప్రయాణికులకు 'సేవా హి సంకల్ప్' అనే లక్ష్యంతో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఉత్తమ సేవలందిస్తుందని ఆర్‌పిఎఫ్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్, డిఐజి ఎస్ఎస్ అహ్మద్ తెలిపారు. రైళ్లు, ఫ్లాట్‌ఫామ్‌లపైన ప్రయాణికులు మరిచిపోయిన, పోగొట్టుకున్న వస్తువులను 'ఆపరేషన్ అమానత్' కింద ఆర్‌టిపిఎఫ్ గత మూడేళ్లలో రూ.172 కోట్ల విలువైన వస్తువులను తిరిగి ఇవ్వడంలో విజయం సాధించిందని వివరించారు. భారత జాతీయ నిర్మాణం, అభివృద్ధి, సామాజిక న్యాయం ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న పౌర సేవకుల సహకారానికి గుర్తుగా ప్రతి ఏటా ఏప్రిల్ 21ని 'జాతీయ పౌర సేవల దినోత్సవం'గా జరుపుకుంటున్నామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోవిడ్2019 మహమ్మారి వచ్చిన సమయంలో ప్రజలకు పాలను, మందులను, వెంటిలేటర్లను, నిత్యవసర సరుకులను సరఫరా చేయడంలో ఆర్‌పిఎఫ్ చురుకైన పాత్ర పోషించిందని గుర్తుచేశారు. దేశంలో ఆయా రాష్ట్రాలలో పనిచేస్తున్న 63 లక్షల మంది వలస కార్మికులను 4000కు పైగా శ్రామిక్ స్పెషల్ రైళ్లలో వారి స్వగ్రామాలకు తీసుకెళ్లడంలో ఆర్‌పిఎఫ్ ఎంతో సహాయపడిందన్నారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ సమయంలో ఆర్‌పిఎఫ్ శ్రామిక్ స్పెషల్ రైళ్లు, పార్శిల్ రైళ్లను సజావుగా నడపడంలో చాలా కీలక పాత్ర పోషించిందన్నారు.ఆర్‌పిఎఫ్ అధికారులు, సిబ్బంది కృషితో 'ఆపరేషన్ నాన్హేఫరిస్తే'లో భాగంగా గత ఏడాది 4460 మంది బాలికలతో సహా మొత్తం 15674 మంది పిలలను రక్షించామని డిఐజి ఎస్ఎస్ అహ్మద్ తెలిపారు. ఇక ఆర్‌పిఎఫ్ చొరవతో 'మేరీ సహేలీ' పేరుతో గత ఏడాది చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆడపిల్లలతో సహా 46,649,06 మంది ఒంటరి ప్రయాణికులను ఆదరించి వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చిందని తెలిపారు. రైలులో ఎక్కి,దిగే సమయంలో 'మిషన్ జీవన్ రక్ష' కార్యక్రమం కింద 2022–2024 మధ్య ఆర్‌పిఎఫ్ సిబ్బంది తమ సొంత ప్రాణాలను పణంగా పెట్టి ధైర్య సాహసాల స్ఫూర్తితో 8,455 మంది ప్రాణాలను కాపాడిందని తెలిపారు.'ఆపరేషన్ సాథీ' ఆపరేషన్ కింద రైల్వే ట్రాక్‌ల సమీపంలోని నివసిస్తున్న ప్రజలకు కూడా ఆర్‌పిఎఫ్ తన సేవలను అందించిందని, గత ఏడాది 96,000 మందికి ఉపాది అవకాశాలు కల్పించిందన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమే సందర్భంగా రైల్వే స్టేషన్‌లలో భక్తుల రద్దీతో పాటు భద్రతపై ఆర్‌పిఎఫ్ చురుకైన పాత్ర పోషించిందని ఎస్ఎస్ అహ్మద్ తెలిపారు.

## సంస్కృతి, సంప్రదాయాలు పాటించాలి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** సంస్కృతి సంప్రదాయాలను ప్రతిఒక్కరూ పాటించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల పరిధిలోని చేగూర్‌లో ఆదివారం నిర్వహించిన మైసమ్మ పండుగకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామస్థులందరూ ఏకతాటిపైకి రావడం సంతోషకరమని, తెలంగాణ గ్రామీణ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను మరిచిపోవద్దన్నారు. కార్యక్రమం లో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, జంగా నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### సేవలతో ప్రత్యేక గుర్తింపు

సమాజానికి చేసిన సేవలతో ప్రత్యేక గుర్తింపు



వస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని మల్లిఖార్జున కాలనీలోని పార్కులో సీనియర్ సిటిజన్స్ కూర్చోవడానికి సిమెంట్ బెంచీలను కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు ఇంఛార్జీ గోదా మాధవులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మాధవులు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు సమాజానికి తమకు తోచిన సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్, కొందుర్గు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎ కృష్ణారెడ్డి, ఎం ప్రదీప్ కుమార్, దంగు శ్రీను, కెకె కృష్ణ, కె ప్రవీణ్, జయప్రకాష్, మాణిక్యం, ఎవీరేశం, జిసత్యయ్య, శ్రీధర్‌గౌడ్, వెంకటేష్ యాదవ్, రంజిత్, శ్రీకాంత్, జయ, మల్లేష్, పాండు, మాధవరెడ్డి, శ్రీనివాస్, లాలాపేట్ మధుసూదన్‌రెడ్డి, బి.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ పూర్తి చేయలేదు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

**ప్రజాపక్షం/గండిపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒక్కటి పూర్తి చేయలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు వనం శ్రీరామరెడ్డి ఆదివారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్




మాట్లాడుతూ ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయని, అందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి తినే కంచంలో మన్నుపోసుకున్నట్లయిందన్నారు. రేవంత్‌రెడ్డి మాటలన్నీ బోగస్ అన్నారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికలలో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** క్రికెట్ ఆడుతూ ఓ యువకుడు గుండెపోటుకు గురై మృతి చెందిన ఉదంతం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బోయనపల్లిలో నివసిస్తూ కెనరా బ్యాంక్‌లో పని చేస్తున్న ప్రణీత్ ఎప్పటి లాగే క్రికెట్ ఆడేందుకు ఆదివారం రాంపల్లి దాయార ప్రాంతంలోని త్యాగి క్రికెట్ గ్రౌండ్‌కు వచ్చి ఆడుతుండగా అకస్మాత్తుగా కింద పడిపోయి అపస్మారక స్థితికి చేరుకొన్నాడు. వెంటనే అతడిని చీర్యాల చౌరాస్తాలోని విజయ్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. .

## ‘ఇందిరమ్మ’ లబ్ధిదారుల ఎంపిక



**ప్రజాపక్షం/నాగారం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వ ఆదేశానుసారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు, నాయకులు,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవ భూమినగర్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ దేవ భూమి నగర్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులను నేరుగా అడిగి కూన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ దేవ భూమి నగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, కమిటీ హాల్ భవనం తదితర సమస్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇటీవలే కాలనీ వాసుల విన్నపం మేరకు ప్రభుత్వం నుండి రూ.36 లక్షల నిధులను సిమెంటు రోడ్డు నిర్మాణానికి విడుదల చేయించానని అన్నారు. దేవ భూమి నగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ భవనానికి ఏడు సంవత్సరాల క్రితమే స్థలాన్ని ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజాపాలన, ప్రజా సంక్షేమం, ప్రజా అభివృద్ధి జరుగుతాయని తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, బిక్షపతి గౌడ్, సంపత్, రాజేష్, నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రజనీకాంత్ పాల్గొన్నారు.

## నిఘా నేత్రాలతోనే నేరాలు తగ్గు ముఖం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిఘా నేత్రాలతోనే నేరాలు తగ్గు ముఖం అవుతున్నాయని బాలానగర్ జోన్ డిసిపి సురేశ్ కుమార్ అన్నారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపిఆర్ ప్రణవ్ ఆంటీలియా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వంద సిసి కెమెరాలను బాలానగర్ జోన్ డిసిపి సురేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నేరాలు తగ్గాలన్నా, నేరస్థుల ఆటకట్టాలని ఈ నిఘా నేత్రాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కాలనీలలో ఇదేవిధంగా స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అందుకోసం తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలానగర్ జోన్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ, కూకట్ పల్లి ఏసిపి శ్రీనివాస రావు, బాచుపల్లి సిఐ ఉపేందర్ రావు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబెర్ అలీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కూతురికి విషమిచ్చి తానూ సేవించిన మహిళ

కూతురు మృతి, తల్లి పరిస్థితి విషయం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కూతురికి విషమిచ్చి తాను సేవించిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని ఆదిత్య గార్డెన్ హరిత ఆర్కేడ్‌లో నివాసముండే నంబూరి కృష్ణ పావని (33), సాంబశివరావులు దంపతులు. వీరికి నాలుగున్నర సంవత్సరాల వయస్సు కలిగిన కూతురు జాశ్నవి ఉంది. అయితే ఈ నెల 18న సాయంత్రం భర్త ఇంట్లో లేని సమయంలో ర్యాట్ పాయిజన్‌ని మజాలో కలుపుకుని కూతురు జాశ్నవికి తాగించి పావని సేవించింది. అనంతరం భర్త సాంబశివ రావుకు సమాచారం అందించడంతో వెంటనే ఇంటికి చేరుకున్న సాంబశివ రావు వెంటనే ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జాశ్నవి మృతి చెందగా భార్య పావని పరిస్థితి విషయమంగా ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అష్టలక్ష్మి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వాస్తు పూజ

ప్రత్యేక పూజలు చేసిన మాజీ డిప్యూటీ మేయర్ దన్‌రాజ్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మధురానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వాస్తు, ఆలయ ప్రధాన ముఖ ధ్వార నిర్మాణానికి పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ప్రణీతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాటు మాట్లాడుతూ మధురానగర్‌లో ఎక్కడా లేని విధంగా అష్టలక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించడం సంతోషకరమని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, ఆలయాలు మానసిక ప్రశాంతతకు, ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో హేమంత్ రావు, విష్ణువర్ధన్ రావు, లింగయ్య, రాంబాబు, మద్దయ్య, హన్మంత్, రమేశ్, కమల్ కుమార్, శ్రీనివాస్, నవీన్, రామ్ ప్రసాద్, అప్పల రాజు పాల్గొన్నారు.



## అంబేద్కర్ అనేది ఒక పేరు కాదు...
# దేశ ప్రజల జీవన రేఖ

దళిత, బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగునిచ్చిన సూర్యుడు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** అంబేద్కర్ వ్యక్తిగా కాదు, ఒక శక్తిగా మనందరి శరీరాలలో ప్రవహిస్తున్నారని, అంబేద్కర్ అనేది ఒక పేరు కాదని, ఈ దేశ ప్రజల జీవన రేఖ అని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధి సయ్యదల్లిపూర్, మర్పలి మండలం పంచలింగాల గ్రామాలలో ఏర్పాటు చేసిన రాజ్యాంగా నిర్మాత భరత రత్నా డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. భూ ప్రపంచం ఉన్నంత వరకు అంబేద్కర్ పేరు చిర స్థాయిగా ఉంటుందన్నారు. ఈ రోజు ఢీల్లి నుండి గల్లీ వరకు పార్లమెంట్ నుండి గ్రామ పంచాయతీల వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సజావుగా జరుగుతున్నది అంటే దానికి కారణం అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ ఒక కులానికో , మతానికో సంబందించిన వారు కాదని, ఈ దేశ ప్రజల ఆస్తి అన్నారు. ఈ దేశంలో అట్టడగు వర్గాలు, విద్య, ఉద్యగాలలో తమ వాటాను పొందుతూ రాజకీయ రంగాలలో కీలకమైన పదవులలో ఉంటున్నారని గుర్తు చేశారు. దీనికంతటికి అంబేద్కర్ కల్పించిన రిజర్వేన్లు కారణమన్నారు. తెలంగాణ గడ్డపై ప్రజా ప్రభుత్వం ఉన్నంత వరకు దళితుల, గిరిజన బహుజన వర్గాలకు ఏలోటు ఉండదని అన్నారు. పూరి గుడిసెలో, దళిత వాడలో గిరిజన గూడంలో పుట్టిన వారు కూడా దేశ అత్యున్నత పదవులు పొందుతున్నారని అన్నారు. అంబేద్కర్ ఆలోచనకను అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగుతుందన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఎస్‌సి వర్గీకరణ అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతు ల మీదుగా తెలంగాణలో ఎస్‌సి వర్గీకరణ అమ లు ప్రారంభించారని, ఈ సందర్భంగా దళిత సోదరులందరికి శుభాకాంక్షాలు తెలియజేశారు. ఎస్‌సి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జేట్‌లో రూ.40,232కోట్ల నిధలు కేటాయించిదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే తాండూరు నుండి అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు

తాండూరు ఆర్టీసి డిఫోను సందర్శించిన ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణంలోని ఆర్‌టిసి డిపోను స్థానిక ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి సందర్శించారు. తాండూరు డిపో మేనేజర్ సురేష్‌తో కలసి డిపోను సందర్శించిన ఎంఎల్‌ఏ ప్రభ్యుతం అమలు చేస్తున్న ఉచిత బస్సు సర్వీసులు, ప్రయాణికులు ఇబ్బందులపై ఆరా తీశారు. అయితే ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేష్ తాండూరు నుండి యాద్గీర్, తాండూరు నుండి బీదర్‌కు నూతన సర్వీసులను కల్పించాలని ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్ళారు. ఇందుకు స్పందించిన ఎంఎల్‌ఏ వెంటనే ప్రజల అవసరాల నిమిత్తం వెంటనే రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పోన్లో మాట్లాడిన ఎంఎల్‌ఏ తాండూరు అంతరాష్ట్ర సర్వీసులను ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా తాండూరు నుండి బీదర్, తాండూరు నుండి యాద్గీర్ వంటి ప్రాంతాలకు బస్సు సర్వీసులను కల్పించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో త్వరలోనే అంతరాష్ట్ర సర్వీసులను ప్రారంభిస్తామని హామి ఇచ్చారు.ఇందుకు గాను ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఎంఎల్‌ఏ వెంటనే రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, స్థానిక నాయకులు ఉన్నారు.



## వైభవంగా భద్రేశ్వర స్వామి రథోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణంలో వెలసిన భవిగి భద్రేశ్వర స్వామి జాతర మహోత్సవాలు వైభంగా సాగుతున్నాయి. జాతర ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి జరిగిన భద్రేశ్వ స్వామి రథోత్సవ వేడుకలు కనుల పండవగా నిర్వహించారు. శనివారం సాయంత్రం కలశానికి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం భక్తుల జయజయ ధ్వనుల మద్య కలుశాన్ని రథం పైకి ఎక్కించారు. రాత్రి 11గంటల నుండి ప్రారంభమైన రథోత్సవ వేడుకలు తెల్లవారు జాము వరకు వైభవంగా నిర్వహించారు.ఈ రథోత్సవ వేడుకలకు ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ పైలెట్ రోహిత్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతతో పాటు తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్ రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ కిరణ్‌లతో కలసిన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రేశ్వర రథోత్సవ వేడుకలలో మరో మారు నేతలు పోలీసుల మద్య వాగ్వావాదం నెలకొంది.

## అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు

అగ్నిమాపక శాఖాధికారి ఎస్.గణేష్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** అగ్ని ప్రమాదాల నివారణ చేపట్టటం ద్వారా దేశ సంపదను కాపాడాలన్న నినాదంతో గత వారం రోజులుగా కొనసాగుతున్న అగ్ని మాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. దీనిలో భాగంగా ఐడిఏ నాచారం, మల్కాజిగిరి అగ్నిమాపక దళాధికారి ఎస్.గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో పరిశ్రమలు, విద్యా సంస్థలు , ఆస్పత్రులు, ఆపార్ట్‌మెంట్లు, గ్యాస్ గోదాములు, రైల్వే, బస్‌స్టేషన్లులలో అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి గణేష్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా పొగ తాగటం, విద్యుద్ఘాతం,వంట గ్యాస్, ఎక్కువ వేడికి గురయ్యే వస్తువులే తరచు జరిగే అగ్ని ప్రమాదాలకు కారణాలవుతున్నాయన్నారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటంలో భాగంగా జనసాంద్రత అధికంగా



ఉండే ప్రాంతాల్లో తప్పనిసరిగా అగ్ని మాపక నిరోధక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.. వారోత్సవాల్లో భాగంగా ఉప్పల్ శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డి మల్లాపూర్‌లో ప్రత్యేకంగా రూపొందించిన ముందస్తు జాగ్రత్తలతో కూడిన పలు అంశాల పోస్టర్లు,కరపత్రాలు ఆవిష్కరించిన అనంతరం ఆపార్ట్‌మెంట్లు, ఆనంద్ కంటి ఆస్పత్రి, కోహేన్స్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ, హెచ్‌పి గ్యాస్ గోదాము, పెట్రోల్ పంపులు, విద్యా సంస్థల్లో అవగాహనా సదస్సులు నిర్వహించామన్నారు.

## జర్మనీలో పరిశ్రమలు, విశ్వ విద్యాలయాల్లో లఘు శిక్షణా కార్యక్రమాలు


శ్రీ రాజ్ వంగపండు





**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** జర్మనీలోని పరిశ్రమల్లో, విశ్వవిద్యాలయాల్లోనూ లఘు శిక్షణా కార్యక్రమాలు, అభినివేశ కార్యక్రమాలు ఉంటాయని జర్మనీ వర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రాజ్ వంగపండు అన్నారు. బాచుపల్లిలోని విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎక్ఫీచో 7.0ఎచ్ పేరిట ఆంత్రప్రెనార్‌షిప్ ఫెస్ట్ జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జర్మనీ వర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రాజ్ వంగపండు అంతర్జాల వేదికలో పాల్గొని మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు జర్మనీలోని పరిశ్రమల్లో, విశ్వవిద్యాలయాల్లో లఘు శిక్షణా కార్యక్రమాలు, అభినివేశ కార్యక్రమాలు వంటి వాటిలో స్వ యంగా పాల్గొని అనుభవపూర్వకమైన విద్య నేరుగా లభించే అవకాశాలుంటాయని తెలిపారు. తద్వారా అభ్యాసం ద్వారా మాత్రమే కాక ప్రపంచంలోని అత్యాధునిక సాంకేతికత గురించి విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం స్విట్జర్‌ల్యాండ్‌లోని డిఫ్యాక్టర్ వై వ్యవస్థాపక సిఇఒ ఫిలిప్ ఆస్మస్ అంతర్జాల వేదికలో మాట్లాడుతూ నవకల్పనలకు వాణిజ్యత, ఆర్థిక విలువ ముఖ్యమని, ది ఫ్యాక్టర్ వై సంస్థ పరిశోధన ద్వారానూ, అంకుర సంస్థల ద్వారానూ సృష్టించిన నవ కల్పనలకు వ్యాపారీకరణలో సహకారమందించి సమారంభకులు సాధికారత సాధించడానికి అంతర్జాతీయ విపణిలో అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఏడవ విడతగా చేస్తున్న ఎక్ఫీచో వేడుక గత నాలుగేళ్లుగా హైబ్రిడ్ పద్ధతిలో సాగుతుందని అన్నారు. అనంతరం విజ్ఞాన్ జ్యోతి సంస్థ అధ్యక్షులు దగ్గుబాటి సురేశ్ మాట్లాడుతూ విద్యార్థులు అనుసృజన, నవకల్పన పట్ల అవగాహన, అభినివేశం కల్పించుకుని తమ చుట్టూ ఉన్నా సమస్యలను పరిష్కరించడానికి సాంకేతికత సహాయంతో నూతన మార్గాలను వెతకాలని సూచించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే సాంకేతిక విద్య మాత్రమే కాకుండా సాంకేతికతా ఫలాలు, పరిశోధన నుంచి వచ్చిన పరిష్కారాలను వ్యాపారీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ జ్యోతి సంస్థ ప్రధానా కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్, కళాశాల సంచాలకులు డాక్టర్ బి.చెన్నకేశవ రావు, విజెఐఎం సంస్థ సంచాలకులు డాక్టర్ భరత్ భూషన్ సింగ్ పాల్గొన్నారు.

## కన్నుల పండువగా భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో శ్రీనివాస అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి తృతీయ బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డిలు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, స్వామి కృపతో ప్రతిఒక్కరు సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస రావు, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఏవి రావు, ఆది, సురేశ్, బాలాజి, రవి, శ్రీరామ్,శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, సునీల్, మురళి కృష్ణ, మహేశ్, బాలకృష్ణ, రఘు, ప్రశాంత్, మహిపాల్, నర్సింగ రావు, రమణ బాబు, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

## అక్క మహంకాళి నూతన కమిటీ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మల్లాపూర్‌లోని శ్రీ అక్క మహంకాళి, కామరాతి సమేత బీరప్ప స్వామి ఆలయ కమిటి చైర్మన్‌గా జెట్టా శ్రీశైలం, జనరల్ సెక్రటరీగా వనకాల వీరేష్‌లు ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌లుగా వస్సరి శ్రీనివాస్, కంది రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కొక్కలకొండ రవి, ఐలయ్య, జంగయ్య, శివ, సంయుక్త కార్యదర్శులుగా బుగ్గ గణేష్, సూర్ణ కొట్టి, దొడ్డి నర్సింహ, రవీందర్, ప్రచార కార్యదర్శులుగా కుమార్, నర్సింహ, బుచ్చేందర్, యకరాజు, కోశాధికారిగా వీరేష్,సలహాదార్లుగా చంద్రయ్య, కొమరయ్య, కంది నర్సింహ,జల్లి శ్రీనివాస్,ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నవీన స్వామి, రాజు, నాగరాజు, యాదగిరి, సంపత్,పరశురాం, వెంకటేష్,ఉపేందర్, శ్యామ్ సుందర్, కుమార్,ఉపేందర్, మల్లేష్,సంపత్‌లు ఎన్నికైన వారిలో ఉన్నారు.

## సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/అల్వాల్ :** ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా గత 25 సంవత్సరాల నుండి సురేష్ సేవా సమితి పనిచేస్తుందని మల్కాజ్గిరి నియోజకవర్గం శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మచ్చ బొల్లారం డివిజన్ బొల్లారం మార్కెట్లో సురేష్ సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నార్ల సురేష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఈ సందర్భం గా మాట్లాడుతూ, వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేం ద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో చేపట్టే వివిధ కార్యక్రమాలలో చలివేంద్రం ఒకటన్నారు. ప్రజలకు కనీస అవసరా లు తీర్చడంలో సురేష్ సేవా సమితి ముందు ఉంటుందన్నారు. 25 సంవత్సరాల నుండి సురేష్ సేవా సమితి ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, రమేష్, సురేష్ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కొల్తూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200910 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అల నాటి అల్లరి చిల్లరి జ్ఞాపకాలను తల్చుకుంటు ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయుల యోగ క్షేమాలను తెలుసుకుని తాము ప్రస్తుతం వివిధ రంగాల్లో పనిచేస్తున్న వివరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాము గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటు ఆనందంగా గడిపారు. అనంతరం అలనాడు తమకు పాఠాలు బోదించిన ఉపాధ్యాయులను శాలువాలతో, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ వసంతకుమారి, ఉపాధ్యాయులు తిరుమలేష్, గోపాల్‌చారి, మహావీర్‌సింగ్, వెంకటనర్సయ్య, ఆనంద్‌జోషి, విజయలక్ష్మి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





## పొదల్లోకి దూసుకెళ్లిన లారీ : డ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** చెట్ల పొదల్లోకి లారీ దూసుకెళ్లిన ఘటనలో లారీ విద్యుత్ టవర్‌తో పాటు చెట్లను ఢీకొని డ్రైవర్ మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఆర్‌సిపురంకు చెందిన ఆశాల బేతయ్య (44) మెదక్ జిల్లా, కాళేశ్వరం వైపు నుంచి ఇసుక లారీ(టిఎస్05u7349) లోడ్‌తో హైదరాబాద్ వైపు వస్తున్నాడు. శామీర్‌పేట రాజీవ్ రహదారిలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా వస్తున్న క్రమంలో లారీని అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపిస్తు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ టవర్‌ను ఢీకొట్టి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఆశాల బేతయ్యకు తీవ్ర రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/చర్లపల్లి :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినం పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో టిడిపి జిల్లా సీనియర్ నాయకులు,కంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లను పంచి పెట్టా రు.

**నీరుగొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో....**

చంద్రబాబు జన్మదిన వేడుకలను ఏఎస్ రావు నగర్ సౌత్ కమలానగర్‌లో నీరుగొండ సతీష్ బాబు ఆధ్వర్యంలో 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**నాగారంలో...**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం పురస్కరించుకుని మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కొండ జంగారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.

# క్రీడ



## పంజాబ్‌పై ఆర్సీబీ ప్రతీకార విజయం

### మెరిసిన కోహ్లీ, పడిక్కల్

ఐపిఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రతీకార విజయం సాధించింది. చిన్నస్వామిలో తమను చిత్తుగా ఓడించిన పంజాబ్ కింగ్స్‌పై 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తొలుత సుయాశ్ శర్మ(226), కృనాల్ పాండ్యాల విజృంభణతో పంజాబ్‌ను 157 కట్టడి చేసిన ఆర్సీబీ.. ఛేదనలో చెలరేగింది. ప్రత్యర్థి బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వని విరాట్ కోహ్లీ(73 నాటౌట్) ఇప్యాంక్ట్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్(61)లు హాఫ్ సెంచరీలతో హోరెత్తించారు. జితేశ్ శర్మ(11) సిక్సర్ బాదడంతో మరో 7 బంతులు ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది బెంగళూరు. సొంతగడ్డపై చతికిలపడుతూ.. ఇతర మైదానాల్లో విజయఢంకా మోగిస్తున్న ఆర్సీబీ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. పంజాబ్ కింగ్స్‌ను వాళ్ల ఇలాకాలో చిత్తుగా ఓడించి బదులు తీర్చుకుంది. 158 పరుగుల ఛేదనలో విరాట్ కోహ్లీ(73 నాటౌట్) క్లాస్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. ఇప్యాంక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్(61) ఖతర్నాక్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. వీళ్లిద్దరి మెరుపులతో గెలుపు దిశగా దూసుకెళ్లిన ఆర్సీబీ.. 18.5 ఓవర్లలనే లక్ష్యాన్ని చేరుకుని శ్రేయస్ అయ్యర్ బృందానికి పెద్ద షాకిచ్చింది. ముల్లనూర్‌లో పంజాబ్‌ను తక్కువ స్కోర్‌కే కట్టడి చేసిన ఆర్సీబీకి ఆదిలోనే అర్ష్‌దీప్ సింగ్ షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(1)ను తన తొలి ఓవర్లోనే వెనక్కి పంపాడు. అయితే.. జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్న విరాట్ కోహ్లీ(73 నాటౌట్), ఇంప్యాక్ట్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్(61)తో కలిసి ధాటిగా ఆడాడు. చిన్నస్వామిలో నిప్పులు చెరిగిన పంజాబ్ పేసర్లు ఈసారి తేలిపోగా.. విరాట్, పడిక్కల్ బౌండరీలతో విరుచుకుపడ్డారు. 30 బంతుల్లోనే అర్ధ శతకం బాదిన పడిక్కల్ ఔటైనా.. విరాట్ మరింత చెలరేగాడు. అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఫోర్ బాదిన అతడు.. ఆ తర్వాత చాహల్ బౌలింగ్‌లో వరుసగా 6, 4 కొట్టాడు. అయితే.. రజత్ పాటిదార్ సిక్సర్‌కు యత్నించి బౌండరీ లైన్‌వద్ద యాన్సెన్‌కు చిక్కాడు. అప్పటికి ఆర్సీబీ విజయానికి 15 రన్స్ అవసరం. నేహల్ వధేరా వేసిన 19వ ఓవర్లో జితేశ్ శర్మ(11 నాటౌట్) సిక్సర్ కొట్టి జట్టును గెలిపించాడు. దాంతో, ఈ ఎడిషన్‌లో ఐదో విజయం బెంగళూరు ఖాతాలో పడింది.

**శశాంక్, యాన్సెన్ పోరాటంతో..**

సొంత ఇలాకాలో పంజాబ్ కింగ్స్ ఆరంభం అదిరినా భారీ స్కోర్ కొట్టలేకపోయింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు విజృంభించడంతో& టాపార్డర్ విఫలమైంది. సుయాశ్ శర్మ(226), కృనాల్ పాండ్యా(225)లు తిప్పేయడంతో మిడిలార్డర్ చేతులెత్తేసింది. వందలోపే నాలుగు వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను జోష్ ఇంగ్లిస్ (29), శశాంక్ సింగ్(31 నాటౌట్), మార్కో యాన్సెన్(25)లు ఆదుకున్నారు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న శశాంక్, యాన్సెన్ డెత్ ఓవర్లలో విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఏడో వికెట్‌కు 43 రన్స్ జోడించింది ద్వయం. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది.



## ఓడి గెలిచిన ముంబయి విజయం

### విరుచుకుపడ్డ రోహిత్, సూర్య..

ఐపిఎల్ 18లో ముంబయి ఇండియన్స్‌కు హ్యాట్రిక్ విజయం. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 15.4 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. రోహిత్ శర్మ (76*), సూర్యకుమార్ యాదవ్ (68*) అర్ధశతకాలతో విరుచుకుపడ్డారు. వీరి ధాటికి 177 పరుగుల లక్ష్యం చిన్నబోయింది. ముంబయికిది నాలుగో విజయం కాగా, చెన్నైకిది ఆరో ఓటమి. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై.. రవీంద్ర జడేజా (53*), శివమ్ దూబే (50) హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. నాలుగో ఓవర్ తొలి బంతికే రచిన్ రవీంద్ర (5) పెవిలియన్ చేరాడు. అశ్వనీ కుమార్ బౌలింగ్‌లో కీపర్ రికెల్టన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. గాయం కారణంగా రుతురాజ్ గైక్వాడ్ మ్యాచ్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో బరిలోకి దిగిన 17 ఏళ్ల ఆయూష్ మాత్రే (32: 15 బంతుల్లో 4 ఫోర్లు 2 సిక్స్‌లు) భారీ షాట్లతో అలరించాడు. అయితే ఏడో ఓవర్ చివరి బంతికి చాహర్ బౌలింగ్‌లో శాంట్నర్‌కు చిక్కాడు. ఆ తర్వాత శాంట్నర్ బౌలింగ్‌లో షేక్ రషీద్ (19) స్టంపౌట్ అయ్యాడు. అనంతరం జడేజా, శివమ్ దూబే కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించారు. దూకుడుగా ఆడిన దూబే 30 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అశ్వినీ కుమార్ వేసిన 16 ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్‌లో దూబే రెండు సిక్స్‌లు, జడేజా ఓ ఫోర్, సిక్స్ బాదారు. అనంతరం బుమ్రా వేసిన 16.2 ఓవర్‌కు భారీ షాట్ ఆడిన దూబే విల్ జాక్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. కెప్టెన్ ధోనీని కూడా బుమ్రానే ఔట్ చేశాడు. చివరి ఓవర్‌లో జడేజా అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ముంబయి బౌలర్లలో బుమ్రా రెండు, దీపక్ చాహర్, అశ్వనీ కుమార్, శాంట్నర్ తలో వికెట్ తీశారు.

# రీల్

## ఆ పాత్రల కంటే ఆంటీ పాత్రలే బెస్ట్

**– సిమ్రాన్**



సీనియర్ హీరోయిన్ సిమ్రాన్ ప్రస్తుతం తాను చేయబోయే సినిమాలపై, తానూ కనిపించే పాత్రలపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సిమ్రాన్ స్టేజ్‌పై మాట్లాడుతూ.. 'కొన్నిరోజుల క్రితం నాకు బాగా తెలిసిన తోటి నటికి ఓ మెసేజ్ పంపించాను. ఆమె నటించిన ఓ సినిమాని ఉద్దేశించి అందులో రాసుకొచ్చాను. ఆ సినిమాలో ఆమె పాత్ర చాలా బాగుందని.. ఆ రోల్ చూసి ఆశ్చర్యపోయానని మెసేజ్ పంపాను. దానికి ఆమె వెంటనే స్పందించింది. ఆంటీ రోల్స్‌లో నటించడం కంటే ఇది ఎంతో ఉత్తమం అంటూ నాకు సమాధానంగా ఆమె మెసేజ్ పంపింది' అని సిమ్రాన్ తెలిపింది. సిమ్రాన్ ఇంకా మాట్లాడుతూ.. 'నిజం చెప్పాలంటే ఆమె పంపిన మెసేజ్ నన్ను ఒకింత షాక్‌కు గురి చేసింది. ఆమె ఎంతో చులకనగా మాట్లాడినట్లు అనిపించింది. ఈ వేదికగా ఆమెకు నేను చెప్పేది ఒక్కటే. పనికిమాలిన డబ్బా రోల్స్‌లో నటించడం కంటే, ఆంటీ లేదా అమ్మ పాత్రలు పోషించడం ఎంతో ఉత్తమం. ఏ వర్క్ చేసినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి' అంటూ సిమ్రాన్ తెలిపింది. ఇటీవల విడుదలైన 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో సిమ్రన్ అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించారు.

## జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే అదే ముఖ్యం

**– షారుక్ ఖాన్**



జీవితంలో డబ్బు, స్టార్‌డమ్ కంటే ఒత్తిడి లేకుండా ఉండడమే ముఖ్యమని అంటున్నాడు బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్. తన జీవితంలో జరిగి విషాద సంఘటన వలన తనకు డబ్బు, ఫేమ్ కంటే మానసికి ఒత్తిడి లేకుండా ఉండడమే లైఫ్‌లో ఉత్తమమని పంచుకున్నాడు షారుక్. త్వరలో కింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆయన తాజాగా ఆయన జీవితంలో జరిగిన ఒక సంఘటన గురించి పంచుకున్నాడు. నా తల్లిదండ్రుల మరణం నా సోదరిపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ రోజు నా తండ్రి మృతదేహం ముందు నిలబడి ఆమె ఏ మాత్రం ఏడవ లేదు, ఇప్పటికీ ఆ సంఘటన నాకు గుర్తుంది. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఆమె ఆ మానసిక స్థితి నుంచి బయటపడలేకపోయింది. అందుకే నేను ఆమెలా డిప్రెషన్‌లో కూరుకుపోకుండా సినిమాల్లో నిమగ్నమై ఉంటాను. అందుకే జీవితంలో డబ్బు, కీర్తి కంటే ఒత్తిడి లేకుండా జీవించడమే నాకు ముఖ్యం అంటూ షారుక్ చెప్పుకోచ్చాడు.


## 'మహేష్' సిద్ధం!



దర్శకధీరుడు రాజమౌళి–మహేష్ బాబు సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఓ యాక్షన్ సీక్వెన్స్ కోసం మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్‌తో పాటు దాదాపు 3వేల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొనబోతున్నారని తెలుస్తోంది. మే నుంచి జూన్ వరకు ఈ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారట. దీనికోసం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. అన్నట్టు ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్స్ నేతృత్వంలో ఈ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించనున్నారు. ఏదిఏమైనా పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా ఆ మధ్య విజయేంద్రప్రసాద్ ఈ సినిమా కథ గురించి ఓ ఇంటర్వ్యూలో చెబుతూ.. 'నేను, రాజమౌళి ఇద్దరం దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ కు పెద్ద అభిమానులం. అందుకే ఆయన పుస్తకాల ఆధారంగానే ఈ సినిమా స్క్రిప్ట్‌ను రాశాను' అంటూ చెప్పుకొచ్చారు. కాబట్టి రాజమౌళి–మహేష్ సినిమా ఒక అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఉండబోతుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ, దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.

## 'హరి హర వీరమల్లు' పార్ట్–2 షురూ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'హరి హర వీరమల్లు'. ఈ చిత్రం మే 9, 2025న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఐతే, ఈ చిత్రం విడుదల తేదీ మారే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ ముంబైలో జరుగుతోంది. ఈ షూట్‌లో పార్ట్ టూకి సంబంధించిన సన్నివేశాలను తీస్తున్నారు. మొదటి భాగానికి సంబంధించిన చాలా సన్నివేశాలు పూర్తయినప్పటికీ, పవన్ కళ్యాణ్‌కి సంబంధించిన కీలకమైన సీన్స్‌ను ఇంకా షూట్ చేయాల్సి ఉంది. కాగా పవన్ త్వరలో సెట్స్‌లో అడుగు పెడతాడు అని, ఏప్రిల్ చివరిలోపు డబ్బింగ్‌తో పాటు తన సీన్స్‌ను పూర్తి చేస్తాడని తెలుస్తోంది. ఈ లోపు పార్ట్ 2 సీన్స్ మేకర్స్ షూట్ చేస్తున్నారు. అన్నట్టు డైరెక్టర్ జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాలో నిధి అగర్వాల్ తో పాటు బాబీ డియోల్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అన్నట్టు క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాలోని పలు సన్నివేశాలకు దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే



## జెన్సోల్ కంపెనీపై కేంద్రం దర్యాప్తు

### ఇందులో ధోనీ, దీపిక పెట్టుబడులు



**న్యూఢిల్లీ:** భారత స్టార్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనెతోపాటు మరికొందరు వ్యాపార ప్రముఖులు పెట్టుబడులు పెట్టిన జెన్సోల్ (బ్లూస్మార్ట్) సంస్థపై తాజాగా మోదీ సర్కారు విచారణ ప్రారంభించింది. తీవ్రమైన ఆర్థిక దుష్ప్రవర్తన, నియంత్రణ ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జెన్సోల్ ఎలక్ట్రిక్‌పై సుమోటోగా విచారణ చేపట్టింది. వీటిలో రూ.975 కోట్ల రుణాల దుర్వినియోగం కూడా ఉంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) జెన్సోల్ ప్రమోటర్లపై మధ్యంతర ఉత్తర్వు జారీ చేసిన తర్వాత కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ... సెబీ దాఖలు చేసిన ఆర్థిక రికార్డులను పరిశీలించడం ప్రారంభించిందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. అయితే, స్వతంత్రంగా చేపట్టిన ఈ విచారణకు ఎలాంటి కాల పరిమితి లేదు. దర్యాప్తులో బయటకొచ్చే లోపాల ప్రాతిపదికగా చర్యలు ఉండే అవకాశం ఉంది. కాగా, క్రికెట్ స్టార్ ధోని ఈ కంపెనీలో దాదాపు 4 వందల కోట్ల రూపాయలు ఈ ఏడాది మొదట్లోనే కంపెనీ (లోపాలు బయటపడకుండా ఉన్నప్పుడు) ఉచ్చదశలో ఉన్న తరుణంలో పెట్టుబడులు పెట్టగా, దీపికా పదుకునే కంపెనీ ప్రారంభించిన (2017) తర్వాత ఏడాదిలోనే కంపెనీ షేర్లు కొన్నట్టు తెలుస్తోంది. ఈ కంపెనీ పుట్టుక విషయానికొస్తే, దేశంలో లీడింగ్ క్యాబ్ సర్వీస్ ప్రొవైడర్స్ ఉబర్, ఓలా సంస్థలకు సవాలుగా 2018లో బెంగళూరు కేంద్రంగా బ్లూస్మార్ట్ అనే కంపెనీ ఏర్పాటైంది. ఈవీ(ఎలక్ట్రిక్ వెహికల్స్) కార్లను ఈ సంస్థ క్యాబ్ సర్వీసులకు వాడుతుంది. ఈ సంస్థ సహ వ్యవస్థాపకుడు జెన్సోల్ ఇంజినీరింగ్ వ్యవస్థాపకుడు అన్మోల్ జగ్గీ. ఈ సంస్థ బ్లూస్మార్ట్ వెహికల్స్ కొనుగోలు కోసం పెట్టుబడిదారుల నుండి రూ. 4,100 కోట్లకు పైగా సేకరించింది. కంపెనీలో పెట్టుబడి పెట్టిన ప్రముఖ పెట్టుబడిదారుల జాబితాలో మహేంద్ర సింగ్ ధోని, దీపికా పదుకొనే, సంజీవ్ బజాజ్, అష్నీర్ గ్రోవర్ తదితరులున్నారు. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే ఈ సంస్థ తొలి పెట్టుబడిదారులలో ఒకరు. కాగా, 'బ్లూస్మార్ట్ యాప్‌లో బుకింగ్‌లను తాత్కాలికంగా మూసివేయాలని మేము నిర్ణయించుకున్నాం' అని బ్లూస్మార్ట్ కంపెనీ ఏప్రిల్ 17న కస్టమర్లకు పంపిన ఇమెయిల్‌లో తెలిపింది. అయితే, ఈ మెయిల్... సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) రెండు రోజుల ముందు చేసిన ఒక కీలక ప్రకటన తర్వాత వచ్చింది. బ్లూస్మార్ట్ స్టార్టప్ ప్రమోటర్లైన జెన్సోల్ ఇంజినీరింగ్ అధిపతులు అన్మోల్, పునీత్ సింగ్ జగ్గీ బ్లూస్మార్ట్ కోసం కార్లు కొనడానికి ఉద్దేశించిన రుణాలను ది కామెలియాస్‌లోని లగ్జరీ అపార్ట్‌మెంట్ కోసం, ఇంకా రూ.26 లక్షల విలువైన హైఎండ్ గోల్ఫ్ పరికరాలు కొనుక్కొనేందుకు మళ్లించారని కనుగొన్నట్లు చెప్పింది. అంతేకాకుండా మధ్యంతర ఉత్తర్వుల్లో జగ్గీ సోదరులు సంస్థలో డైరెక్టర్ పదవులు నిర్వహించకుండా, మార్కెట్‌లోకి ప్రవేశించకుండా సెబీ నిషేధించింది. దీంతో జెన్సోల్ కథ అడ్డం తిరిగింది. తాజాగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కూడా రంగంలోకి దిగాల్సి వచ్చింది.

## ఇండిగో విమానాన్ని ఢీకొన్న టెంపో

**బెంగళూరు:** బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆగిఉన్న ఇండిగో విమానాన్ని ట్రావెలర్ టెంపో శనివారం ఢీకొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకరు గాయపడినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ మాత్రమే వాహనంలో ఉన్నాడు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఈ టెంపో ఆకాశ ఎయిర్ సిబ్బందిని వారి కార్యాలయం నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ బే వద్దకు తీసుకురావడానికి వినియోగిస్తున్నారని తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ ప్రమాదం వల్ల పలు విమాన సర్వీసుల్లో స్వల్ప అంతరాయం కలిగిందని, తర్వాత వాటిని పునరుద్ధరించామన్నారు. ఈ ఘటనపై ఇండిగో స్పందిస్తూ బెంగళూరు విమానాశ్రయంలో ఆగి ఉన్న విమానాన్ని టెంపో ఢీకొట్టడంపై తమకు సమాచారం అందిందని, ఈ విషయాన్ని జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు తెలిపినట్లు వెల్లడించింది. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని, ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని పేర్కొంది.

## పూర్తి రాజకీయ వంచన

### బీజేపీ ఎంపీల వ్యాఖ్యలు ఖండించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థపై తన ఎంపీలు చేసిన వ్యాఖ్యలకు బీజేపీ దూరంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీ ఆదివారం కేంద్రంలో అధికార పార్టీపై ధ్వజమెత్తింది. దాని 'నష్ట నియంత్రణ' అనేది 'చిన్న అర్థాన్ని కలిగి ఉంది' అని తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాను దేశంలోని అన్ని అంతర్యుద్ధాలకు కారణమని సుప్రీం కోర్టుపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే తీవ్రంగా విమర్శించిన తర్వాత కాంగ్రెస్ ప్రకటన వెలువడింది. దీని తరువాత, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం రాత్రి మాట్లాడుతూ బీజేపీ ఈ వ్యాఖ్యలను పూర్తిగా తిరస్కరించిందని, అలాంటి ప్రకటనలకు వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ ఆదివారం మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిపై ఇద్దరు బీజేపీ ఎంపీలు చేసిన దారుణమైన వ్యాఖ్యలను బీజేపీ అధ్యక్షుడు పెద్దగా అర్థం చేసుకోలేదని అన్నారు. 'ఈ ఎంపీలు ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో తరచూ నేరస్తులు, జీ2 ద్వారా కమ్యూనిటీలు, సంస్థలు, వ్యక్తులపై దాడి చేయడానికి తరచుగా ఉపయోగించబడతారు. పదవీ విరమణ చేయనున్న బీజేపీ అధ్యక్షుడి వివరణ నష్ట నియంత్రణ తప్ప మరొకటి కాదు. ఇది ఎవరినీ మోసం చేయదు. ఇది మొత్తం రాజకీయ వంచనగా ప్రతిబింబించే రాజకీయ శాస్త్రం' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ న్యాయ వ్యవస్థపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రస్తావించారు. కానీ న్యాయ వ్యవస్థపై ఉన్నత రాజ్యాంగ పదవిలో నియమితులైన వారిలో ఒకరు నిరంతరం చేసే ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలపై బీజేపీ అధ్యక్షుడు పూర్తి మౌనంగా ఉన్నారు. ఈ వ్యాఖ్యల గురించి ఆయన ఏమి చెబుతారు? బీజేపీ వాటిని అంగీకరిస్తుందా?' అని ప్రశ్నించారు. ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని జైరాం రమేశ్ మాట్లాడుతూ 'భారత రాజ్యాంగంపై తరచూ జరుగుతున్న దాడులపై ప్రధాన మంత్రి కొనసాగిస్తున్న మౌనం వారికి నిశ్శబ్దంగా మద్దతు ఇవ్వడం కాకపోతే, ఈ ఇద్దరు ఎంపీలపై ఎందుకు చర్య తీసుకోలేదు? నడ్డా జీ ఈ ఇద్దరు ఎంపీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారా?' అని నిలదీశారు. కాగా, భారత్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేబీ.వాన్స్ పర్యటన నేపథ్యంలో భారత పౌరులను బహిష్కరిస్తున్న విధానం, పారిస్ ఒప్పందం, డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా వైదొలగడంపై డబ్ల్యూటీవోలో బహుపాక్షిక నియమాల ఆధారిత వాణిజ్య వ్యవస్థకు సంబంధించి పూర్తి విధ్వంసం' పై భారతదేశ ఆందోళనలను ప్రధానమంత్రి మోదీ తెలియజేస్తారా అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత రైతులు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలపై ప్రతికూల ప్రభావం పడకుండా చూసుకోవాలనే భారతదేశ దఢ సంకల్పాన్ని తెలియజేస్తారా అని ఆయన అడిగారు. వాన్స్ దంపతులు ఏప్రిల్ 21 నుంచి భారతదేశానికి వచ్చే అవకాశం ఉంది. వాణిజ్యం, సుంకాలు, ప్రాంతీయ భద్రత, మొత్తం ద్వైపాక్షిక ఒప్పందాలను విస్తరించే మార్గాలు వంటి కీలక అంశాలపై అమెరికా నాయకుడితో చర్చలు జరిపిన తర్వాత... మోదీ ఆ రోజు సాయంత్రం వాన్స్, ఉష దంపతులకు విందు ఇస్తారు.

## శాంతి చర్చలకు పిలవాలి

(మొదటి పేజీ తరువాయి)



ఉన్న భారత దేశాన్ని బిజెపి ప్రభుత్వం సాంస్కృతికంగా, సైద్ధాంతికంగా విభజన చేస్తోందని అన్నారు. వ్యక్తిగత రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ 370 ఆర్టికల్ స్వయంప్రతిపత్తిని రద్దు చేయడం, ట్రిపుల్ తలాక్ చట్టంతో పాటు తాజాగా వక్ఫ్‌బోర్డు అంశాన్ని బరితెగించి బలవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను పక్కదోవ పట్టిస్తూ గతంలో లేని ఇబ్బందులను సృష్టిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలైన నిరుద్యోగులకు ఉద్యోగాలు, కార్మికులకు 4 లేబర్ కోడ్‌లు, రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా ఆర్థిక సంపదనంతా కొంత మంది చేతిలో కేంద్రీకృతం చేస్తోందన్నారు. తాత్కాలిక ప్రయోజనాలే తప్ప దీర్ఘకాలిక ప్రయోజనాలేవీ పట్టించుకోవడం లేదన్నారు. హిందువుల్లో అనేక సమస్యలపై పట్టింపేదని ప్రశ్నించారు. బిసి కులగణనను మరుగున పట్టించారన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గించే కుట్ర చేస్తోందన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంతో ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను ప్రధాన శత్రువులుగా చూస్తున్నారన్నారు. ఇటీవలే కేంద్రంలో చావు తప్పి లొట్టపోయినట్లు నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడుతో ఏకమై బిజెపి గట్టెక్కిందన్నారు. తెలంగాణలో బిజెపి ఆటలు సాగవని తేల్చి చెప్పారు. రాష్ట్రానికి ఏం చేశారని? ఏ పేరుతో ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి సర్కారు నుంచి తెలంగాణకు వివక్ష ఎదువుతూనే ఉందన్నారు. విభజన హామీలు అమలు చేయలేదన్నారు. రాష్ట్రం నుంచి రూపాయి కడితే 30 పైసలు ఇస్తున్నారని, అదే బిజెపి పాలిత ప్రాంతాల్లో రెట్టింపు ఇస్తున్నారన్నారు. అదే విధంగా రాష్ట్రంలో బిఆర్ఎస్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నా ఒరిగేదేమీ లేదన్నారు. గాలిలో మేడలు కడుతున్నారని, అధికారముంటేనే రోడ్డెక్కుతారా? కనీసం అసెంబ్లీకి రావాలి కదా? అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలపై అడిగే హక్కు కేవలం సిపిఐకి మాత్రమే ఉందన్నారు. గతంలో సంక్షోభానికి కారణమే బిఆర్ఎస్ అని, ఇప్పుడు హామీల అమలుపై మాట్లాడే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఇచ్చిన వాగ్దానాలపై కాంగ్రెస్ సర్కారుకు అవసరమైన సలహాలిస్తామని, కుదరని పక్షంలో ప్రజలతో కలిసి ప్రజాఉద్యమాలు నిర్మిస్తామన్నారు. బిఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడిస్తే వ్యతిరేకత తప్పదని, ఇంకా అనుభవం రావాల్సి ఉందని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపిని, బిఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు. ఆర్టీసీ, సింగరేణి, జెన్‌కో వంటి ప్రధాన సంస్థలను ప్రైవేట్ పరం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్ర తివాచి పరిచినట్లు తెలుస్తోందని, ఆ చర్యలను పూర్తిగా వ్యతిరేకించి ఎదుర్కొంటామన్నారు. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు ప్రజల హక్కులు కాలరాస్తే ఊరుకోమన్నారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ స్పష్టత ఉండాలన్నారు. హామీల అమలు సాధ్యం కాని పరిస్థితిని, అమలు చేసిన పథకాలను ప్రజలకు చెప్పుకోవాలన్నారు. కగార్ ఆపరేషన్‌పై పార్టీలకతీంగా సమావేశాల్లో చర్చించుకోవడం జరిగిందని, దేశంలో సానుకూల వాతావరణం కల్పించేలా బిజెపి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య తదితరులున్నారు.

## హైదరాబాద్‌లో వ్యభిచారం

(మొదటి పేజీ తరువాయి)

పాటు అటు బంగ్లాదేశ్లోలోని సరిహద్దు గ్రామాల్లో అనుచరులు ఉంటున్నారు. ఇలాంటి సూత్రధారుల్లో పశ్చిమ బెంగాల్‌లోని బసిర్హత్ జిల్లా సోలదాన గ్రామానికి చెందిన రాహుల్ అమన్ దాలి కీలకమని దర్యాప్తు అధికారులు గుర్తించారు. అక్రమంగా సరిహద్దులు దాటాలని భావించిన బంగ్లాదేశీయులు ఆ దేశంలో ఉన్న సరిహద్దు గ్రామాలకు చేరుతున్నారు. వీరిని సంప్రదిస్తున్న రాహుల్ అనుచరులు రూ.4 వేలకు.. డిమాండ్ ఎక్కువగా ఉంటే రూ.5 వేలకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఈ మొత్తాన్ని ఆ యువతులతోనే బంగ్లాదేశ్లోని సరిహద్దు గ్రామాల్లో ఉండే దుకాణదారుల వద్ద భారత కరెన్సీలోకి మార్పిస్తున్నాడు. మరికొందరు దళారుల ద్వారా ఈ నగదు బ్యాంకు ఖాతా లేదా యుపిఐ ద్వారా తనకు చేరేలా చేస్తున్నాడు. ఈ మొత్తం నుంచి రూ.1000 కమీషన్‌గా సరిహద్దుకు అటుఇటు ఉన్న గ్రామాలకు చెందిన తన అనుచరులకు ఇస్తుంటాడు. అక్కడ ఉన్న వారు అనువైన ప్రాంతం, సమయంలో యువతుల్ని పంపిస్తుండగా ఇక్కడ ఉన్న వాళ్లు రిసీవ్ చేసుకుని సురక్షిత ప్రాంతానికి తరలిస్తుంటారు. రాహుల్ ఎక్క డా తెరపైకి రాకుండా ఈ వ్యవహారం నడిపిస్తుంటాడని అధికారులు చెబుతున్నారు. 2017 నుంచి ఈ దందా చేస్తున్న రాహుల్‌కు కోల్కతాకు చెందిన కొన్ని ముఠాలతో సంబంధాలు ఉన్నాయి. వారి సహకారంతోనే డిమాండ్ చేసిన మొత్తం చెల్లించిన వారికి నకిలీ గుర్తింపుకార్డులు తయారు చేయించి ఇస్తున్నాడు. ఇలా ఇక్కడి ఆధార్, ఓటర్ ఐడీలు పొందుతున్న బంగ్లాదేశీ యువతులు పశ్చిమ బెంగాల్ వాసులుగా చెలామణి అవుతున్నారు.

**హైదరాబాద్ సహా మరికొన్ని చోట్లకు**

కొందరు దళారులు సదరు యువతులను హైదరాబాద్ సహా మరికొన్ని నగరాలకు తరలిస్తున్నారు. ఉద్యోగం పేరుతో తీసుకువచ్చి వ్యభిచార కూపాల్లోకి నెడుతున్నారు. అతి తక్కువ మంది మాత్రం మసాజ్ పార్లర్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో పని చేస్తున్నారు. ఇదే పంథాలో కొందరు బంగ్లాదేశ్ యువకులు కూడా అక్రమంగా సరిహద్దులు దాటి వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మనుషుల అక్రమ రవాణా నెట్వర్క్ పూర్వాపరాలతో ఓ సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఎవరెవరు కీలకంగా వ్యవహరిస్తున్నారు? ఎక్కడ నుంచి సరిహద్దులు దాటిస్తున్నారు? తదితర అంశాలను నిఘా వర్గాలతో పాటు సరిహద్దు భద్రతా దళం దృష్టికి తీసుకువెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లో నమోదైన మనుషుల అక్రమ రవాణా కేసుల్లో కొన్ని దర్యాప్తు నిమిత్తం జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) చేరాయి. దీంతో ఆ విభాగంతో సమన్వయం ఏర్పాటు చేసుకుని, సమాచార మార్పిడి చేసుకోనున్నట్లు తెలిసింది.

## వారిద్దరూ కలిస్తే మంచిదే : ఫడ్నవిస్

**ముంబై:** ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ హిందీ భాషను విధిగా బోధించాలంటూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే సోదరులు వ్యతిరేకిస్తున్నారు. దీని పై సమైక్యంగా పోరాడేందుకు ఇద్దరూ ఏకం కానున్నారంటూ చర్చ మొదలైంది. దీనిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తొలి సారి స్పందించారు. తిరిగి వారిద్దరూ ఏకం కావాలని అనుకుంటే తమకు సంతోషమేనని అన్నారు. ఎవరైనా సరే విభేదాలు పరిష్కరించుకుంటే మంచిదే. అంతకంటే తాను చెప్పేదేముందని దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మహారాష్ట్ర సంస్కృతి, భాషాపరమైన గుర్తింపు విషయంలో వెనక్కి తగ్గేది లేదని, దీనిపై విభేదాలు మరచి ఉద్ధవ్ ఠాక్రేతో పని చేసేందుకు సిద్ధమేనని రాజ్‌ఠాక్రే ఇటీవల ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తెలిపారు. ఉద్ధవ్ ఠాక్రే సైతం మరో కార్యక్రమంలో తమ మధ్య ఉన్న చిన్నచిన్న విభేదాలను మరాఠా ప్రజల ప్రయోజనాల కోసం పక్కన పెట్టేందుకు సిద్ధమేనని అన్నారు. మహారాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే వాళ్లను దగ్గరకు రానీయకూడదని చెప్పారు. అయితే దీనిపై శివసేన(ఉద్ధవ్) వర్గం నేత సంజయ్ రౌత్ స్పందిస్తూ ప్రస్తుతానికి ఎలాంటి పొత్తు లేదని, వాటిని భావోద్వేగమైన సంభాషణలుగానే చూడాల్సి ఉంటుందని అన్నారు. 'వాళ్లిద్దరూ సోదరులు. అంతా చాలా ఏళ్లు కలిసి ఉన్నాం. ఆ బంధం ఎప్పటికీ తెగిపోదు. రాజకీయంగా కలిసి వస్తారా అనేది వారి నిర్ణయం' అని రౌత్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com